

వర్ణచిత్రం
ముత్యాల పల్లకి
యమ్ యస్ రెడ్డి
బి వి ప్రసాద్

ఫిబ్రవరి 1977

జ్యోతి

సంపుటి: 15
సంచిక: 1

సచిత్ర మాసపత్రిక

సంస్థాపకులు:
కీ. శే. వి. వి. రాఘవయ్య


మేనేజింగ్ ఎడిటర్:
శ్రీమతి వి. లీలావతి రాఘవయ్య

సహకార సంపాదకుడు వేమూరి సత్యనారాయణ

విషయ సూచిక

ముఖచిత్రం శ్రీ అన్నపూర్ణ పిసీ ఎంటర్‌ప్రైసెస్ 'కల్పన'లో
మురళీమోహన్, జయచిత్ర

జ్యోతి, 40/1 మూసాసేట్ స్ట్రీట్, టి. నగర్, మద్రాసు-600017.
ఫోన్: 440548. సంవత్సర చందా (ప్రత్యేక సంచికతో) రు. 42/-.


ఉత్తేజాన్నిచ్చే
పాలసీల గురించి మీ ఎల్ ఐ సి
ఏజెంటును వాకబు చేసారా?
'మనీ బ్యాక్' పాలసీ
కాలపరిమితి తీరకముందే
నిర్ణీత వ్యవధులలో ఇతర
పథకాల క్రిందకన్న
త్వరగాను, ఎక్కువగాను,
సొమ్ము తిరిగి లభిస్తుంది
ప్రతి 5 సంవత్సరాలకు
వాయిదాలలో సొమ్ము
గ్యారంటీగా చెల్లింప
బడుతుంది—భీమా చేసిన
పూర్తి సొమ్ముపై
బోనసులతో సహా—పైగా
జీవిత కాలమంతా భీమా రక్షణ
పరీక్షతోగానీ పని
లేకుండా,
ఉంటుంది
మారే కాలానికి
మారుతున్న అవసరాలకు
లైఫ్ ఇన్సూరెన్స్
కార్పొరేషన్ ఆఫ్ ఇండియా
daCunha/LIC/38 TEL

తొలిమాట

జ్యోతిలో కథలు బాగుంటున్నాయి. అని అభినందనలందిస్తున్న పాఠకులు కథల సంఖ్య తక్కువగా ఉంటున్నదన్న విమర్శను అందించారు. ఇంతకాలమూ జ్యోతిలో ఒకేసారి మూడు సీరియల్స్ ప్రచురిస్తూ వస్తున్న కారణంగా కథలు తక్కువగా వస్తున్న మాట నిజమే. ఈ సంచికతో జై మంగళా సీరియల్ ముగిసింది. వచ్చే సంచిక నుంచీ రెండు సీరియల్స్ (సత్యం, శివం, సుందరం—మనిషికి ఏం కావాలి) మాత్రమే ఉంటాయి కనుక పాఠకులకు మరిన్ని మంచి కథ లందించగలమని ఆశిస్తున్నాము.

*   *   *   *

జై మంగళా రచయిత్రి ఎ. శ్యామలారాణి ఈ సంవత్సరం ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడెమీ బహుమతి గెలుచుకున్నారు. ఆమె రచించిన 'హరిణి'కి ఈ సంవత్సరం అకాడెమీ నవలలకిచ్చే బహుమతి ఇచ్చారు. ఈ సందర్భంలో జ్యోతి రచయిత్రికి తన అభినందనల నందజేస్తోంది.

*   *   *   *

గత సంచికలో చేసిన విజ్ఞప్తిని మరోసారి మీకు గుర్తు చేస్తున్నాము.

అన్నపూర్ణగా పిలువబడే ఆంధ్రదేశంలోని రైతులు ప్రకృతి బీభత్సం చేసిన కారణంగా ఆపదల పాలయ్యారు. వారినాదుకో వలసిన బాధ్యత మనందరి మీదా ఉంది. మీ శక్తి కొద్దీ 'ముఖ్యమంత్రి వరద బాధితుల సహాయ నిధి'కి విరాళాలిచ్చి సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము.

ఉత్తరాలు

డిశంబరు 1976 సంచికలో ప్రచురించిన 'కాటేసిన సుఖం' నవల చాలా సంవత్సరాల క్రితం ప్రచురితమైన కీ॥ శే॥ శారద నవల 'మంచీ చెడు'కు అనుకరణని ఎంతోమంది పాఠకులు ఉత్తరాలు రాశారు. ఈ విషయంగా మంచీ చెడు నవల పరిశీలించి, రచయిత్రి నుంచి సమాధానం కూడా తెప్పించిన తర్వాతనే ప్రస్తావించ దలచుకొన్న కారణంగా జనవరి 77 సంచికలో ఆ విషయంగా ఏమీ ప్రమరణ జరగలేదు. 'కాటేసిన సుఖం' నవలా రచయిత్రి యార్లగడ్డ సరోజినీదేవి పాఠక విమర్శకు సమాధానంగా "వాస్తవాన్ని వాస్తవంగా చిత్రించటం రచయిత్రి జన్మ హక్కు. అలా వ్రాసిన నా నవల్సు "వసుధ" "ఆ రోజులు రావు" ఒకనాడు బహుముఖ వ్యాప్తిని పొందాయి. సుభద్ర లాంటి స్త్రీ జీవితం నా సన్నిహిత వర్గాల వారిలోనే వున్నది ఆమె ఇంకా బ్రతికే ఉన్నది ఇరవై పైసలు కవరు రానేకంటే యిరవై రూపాయలు ఖర్చు పెట్టుకొని రాగలిగితే అలాంటి స్త్రీల నెందరినో ముఖ్యంగా సుభద్రలాంటి జీవిని పరిచయం చేస్తాను" అంటున్నారు అయితే "కాటేసిన సుఖం" "మంచీ చెడు" యీ రెండు నవలలు పునః పరిశీలించాక జ్యోతి సంపాదకవర్గం "కాటేసిన సుఖం" మంచీ చెడు"ను అనుసరించి రాయబడిందేనని అభిప్రాయపడింది రచయిత్రి వివరణ ఆ అభిప్రాయంలో మార్పు తేలేదు కూడా! జ్యోతిలో ఇటువంటి సందర్భం ఏర్పడినప్పుడల్లా రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తూనే వస్తున్నాము ఇప్పుడు మళ్లీ విజ్ఞప్తిచేస్తున్నాము. దయచేసి పేరుకోసం తాపత్రయపడి గ్రంథ చౌర్యానికి పాల్పడి మీ పేరూ, జ్యోతి పేరుకూడా దెబ్బతీసే రచనలు పంపకండి.

—ఎడిటర్, జ్యోతి.

అఖిలభారత నాటక పోటీలు

1977 ఏప్రిల్ 4 నుండి 10 వరకు తెలుగు నాటక సమితిచే నిర్వహించే నాటక పోటీలలో ఉత్తమ నాటకానికి రు 1116 ద్వితీయ ఉత్తమనాటకానికి రు 558 బహుమతులున్నాయి ఇంకా ఉత్తమరచన ఉత్తమ దర్శకత్వంకు కూడా బహుమతులున్న ఈ పోటీలో పాల్గొనేందుకు వివరాలకోసం "కార్యదర్శి తెలుగు నాటక సమితి, అకౌంటెంట్ జనరల్ కార్యాలయము, హైదరాబాదు 500 004"కు రాసి తెలుసుకోవచ్చును

నూతలపాటి సాహితీ సత్కారం


స్వర్గీయ యువకవి శ్రీ నూతలపాటి గంగాధరం పేరిట మే 29 న రు 1116 తో జరిగే సాహితీ సత్కారానికి రచనలు పంపదలచిన వారు క్రింది సూచనలు గమనించగలరని 'గంగాధరం సాహితీ కుటుంబం' (చిత్తూరు) అధ్యక్షులు తెలియజేస్తున్నారు. ఈ సంవత్సరం పోటీ నవలలకే పరిమితము జనవరి 74 డిసెంబర్ 76 మధ్య ప్రచురితమైన నవలలు మాత్రమే (పునర్ముద్రణలు పంపరాదు) పంపాలి వ్రాత

టినోపాల్* ఇప్పుడు ఓ కొత్త పేరుతో


రానిపాల్+



రానిపాల్+
నూలు దుస్తులకు



రానిపాల్+ఎస్
సింథెటిక్ మరియు
మిశ్రమ దుస్తులకు



ఉత్పాదన అదే, పనితనం అదే, కాని పేరుమాత్రం కొత్తది.

సర్వోత్తమ తెలుపు కోసం రానిపాల్+

Suhrid Geigy LIMITED

+ సుహృద్ గైగి లిమిటెడ్ వారి ట్రేడ్ మార్క్
* ఇంతకు పూర్వం సిబా-గైగి లిమిటెడ్ వారి లైసెన్స్ క్రింద అమ్మబడేది

Shilpi SGT 6A/76 tel

ప్రతులుగాని. అనువాద రచనలు స్వీకరించబడవు ఫిబ్రవరి 28, 77 లోగా నాలుగు ప్రతులు "కార్యదర్శి, గంగాధరం సాహితీ కుటుంబం (రిజిస్టర్డ్) 3-4-58 గిరింపేట, చిత్తూరు-2"కు పంపవలయును


* * *

దినదిన ప్రవర్ధమానంగా క్రొత్త క్రొత్త శీర్షికలతో నూతన సౌందర్యాలను సంతరించుకొని వెలువడుచున్న జ్యోతిని చూస్తుంటే నాకెంతో సంతోషంగా ఉంది జనవరినెల జ్యోతి నవలానుబంధంగా వచ్చిన 'ఎరమాల' ఒక ఆణిముత్యం ఈ చక్కటి నవలలో హైందవ నారీత్వానికే ప్రతిబింబమైన సుచరిత, సాగర్, చందన్, అనుపమ పాత్రలు నాలుగూ మా హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయాయి

మహాకవి శ్రీ శ్రీ గారి "కుక్కా, పీతుక్కా కవిత ఈ నెల జ్యోతికో హైలైట్' డా॥ కొమ్మూరిగారి క్రొత్త సీరియల్ ప్రారంభదశతోనే మమ్మాకట్టుకొంది మినీ కథల్లో "అద్భుత దీపం" "ప్రపంచం దేనిమీద నడుస్తోంది" చాలా బావున్నాయి శ్రీ టి గౌరీశంకర్‌గారి "ప్రేమలేఖ" చాలా గమ్మత్తుగా వుంది. "జై మంగళా" "సత్యం శివం సుందరం" సీరియల్స్ రెండూ చాలా ఆసక్తిదాయకంగా సాగుచున్నాయి

సుభాషితాలపై కార్టూన్స్ మమ్మెంతో నవ్వించాయి మినీకథలద్వారా నవయువ రచయితల ప్రోత్సహిస్తున్నందుకు మీ రెంతో అభినందనీయులు

—యస్ ఆర్ ప్రతాపరెడ్డి,


REGD 169505
ESTD:1948
త్రివేణి
వక్కపొడి
గంగ. యమున, సరస్వతుల సంగమం
త్రివేణి
రుచి, సువాసన, పరిమళాల సమ్మేళనం
త్రివేణి వక్కపొడి
PHONE: 270
TRIVENI NUT POWDER MFG. CO.
CIRCLEPET,
MACHILIPATNAM (A.P.)
Mg. PARTNER: DESU VENKATA SUBBA RAO

జనవరి పదబంధ ప్రహేళిక ఫలితాలు :

ఒక్క తప్పూ లేకుండా వచ్చిన ఎంట్రీలు మూడు వాటిని పంపిన వారిలో కొల్లూరు కామేశ్వరరావు, ప్లాట్ నెం. 25, ఆలపాటినగర్, హైదరాబాద్-28. నిఘంటువు గెలుచుకొన్నారు ఆల్‌కరెక్ట్ పంపిన మిగతా ఇద్దరు యం శివరామమూర్తి. విశాఖపట్టణం. యం. వి లత, బెంగుళూరు-8. వీరికి ఫిబ్రవరి జ్యోతి ఉచితంగా పంపుతున్నాము

ఆహా శ్రీశ్రీగారు
మీ నవరసాల శ్రీశ్రీ చదివా
దైవ ప్రార్థన చేసేవారిని
ఎంత బాగా అర్థం చేసుకున్నారు!
భగవంతుని నమ్మేవాళ్ళంతా
పాపాలు చేస్తున్న వాళ్ళేనా?
పాపాలు చేస్తున్నాము.
ఆ పాపాలు తుడిచెయ్యి అనేనా,
కొబ్బరికాయు కొట్టి కర్పూరం
వెలిగిస్తున్నారు?
ఓహో శ్రీశ్రీగారి భావన
ఎంత బాగా చెప్పిందండీ
"భగవాన్' నన్ను సన్మార్గంలో
నడుపు
మాకు ఏ కీడూ జరుగకుండా చూడు
మాకు ఏ లోటూ లేక,
ఖులాసాగా కాలం జరిగేట్లు చూడు
సర్వ మానవాళికి
జయంకల్గేలా చేయి "
అని ఎవరూ ప్రార్థించరా?
భగవంతుని నమ్మి
కొబ్బరికాయ కొట్టి
కర్పూరం వెలిగించేవాళ్ళంతా
శ్రీశ్రీగారి భావనలోనే చేస్తున్నారా?
భగవధ్యానాన్కి, అంతా కోవెలకే
పోతున్నారా?
మహాకవిగారి వూహలా ఇవి?
కుంటీ, కుష్టు, గుడ్డీ
ఒక్క భగవన్మందిరముల ముందేనా
ఉండేది
ప్రసాదమిచ్చే చావు లేనా వుంటారు?
హోటళ్ళ ముందుండరా?
రోడ్లపై నడవరా?
శ్రీవారు లోకాన్ని చూడటం లేదా?
చెరువుకో కప్ప కాదుగదా?

—సామాన్యుడు, అనకాపల్లి.

సి హెచ్. మధుగారి "అటు దారి కాదు యిటు" ఎంతో నచ్చింది "సీటు" విజయ్‌గారు రచించిన ఈ కథ మమ్మల్ని ఎంతో ఆకర్షించింది ఇలాంటి కథలు ఎక్కువ అచ్చువేయండి

—నల్లంటి సన్యాసిరావు, సాలూరు.

మహాకవి శ్రీశ్రీ రచనల ప్రత్యేక శీర్షిక !



నవరసాల శ్రీశ్రీ

బ్రూహి ముకుందేతి

"శాంతమూ లేకా సౌఖ్యమూ లేదూ" అంటూ పాడుతోంది జగత్ప్రసిద్ధ తమిళ గాయనీమణి. ఆవిడ పేరు నేను చెప్పనక్కరలేనంత సుప్రసిద్ధం. శాంత రసం వర్షిస్తున్న ఆమె సంగీతంలో తెలుగు భాషకి జరుగుతున్న చిన్న డామేజీని శ్రోతలెవ్వరూ ఖాతరుచెయ్యలేదు. నేను మాత్రం త్యాగయ్యగారి [illegible] జాలిపడుతూనే, సంగీత సుధారసంలో ఓలలాడుతున్నాను.

ఆనాడు నేను హాజరయిన కచ్చేరీల వంటివి ఆవిడ పరశ్శతంగా చేసింది. కాలంనాడు జావళీల మాదిరి శృంగార రసస్ఫోరకమైన పాటలుపాడినా, వయస్సు హెచ్చినకొద్దీ ఆవిడలో భక్తి రెచ్చిన కారణంవల్ల ఇటీవల పదేళ్లనుంచీ భజన కీర్తనలు తప్ప మరేవీ పాడలేదు. ఆమె గానంలో గొప్ప ఆధ్యాత్మిక విలువలున్నవని మొట్టమొదటిసారిగా మద్రాసులోని ఒక ప్రముఖ దినపత్రిక రివ్యూ ప్రచురించింది. సంగీతం విషయంలో, ప్రత్యేకించి కర్ణాటక సంగీతం విషయంలో ఆ పత్రి ఏది రాస్తే అదే ప్రామాణికం.

ఏ మాట కా మాటే చెప్పుకోవా తెలుగు భాషకి ఆవిడ ఎన్ని గాయా చేసినా, ఈనాటి అరవయ్యో ఏట కూ ఆ మహాగాయని గాత్రమాధుర్యం చెక్కు చెదరలేదు. అది పూర్వజన్మ సుకృతమ దైవప్రసాదమనీ ఈ పుణ్యభూమి అందరూ అనుకుంటారు, నాబో కొందర్ని మినహాయిస్తే.

ఆవిడ పాడుతూ ఉంటే శాంతరస ఉట్టిపడుతుందనీ, ఏవో దివ్యలోకాల విహరిస్తున్న భావం కలుగుతుంద అందరూ అనుకుంటారు. అందు అయిదువందల రూపాయల టిక్కెట్టు కొని అయినా ఆమె గానాన్ని ఆస్వా దిస్తారు. నేను అయిదు రూపాయ టిక్కెట్టు రోజుల్లో ఆమె సంగీత విన్నాను. సంగీతం గురించి సాధి రంగా మాట్లాడలేని నావంటివాడు ఆమెగ గురించిగాని, ఆమె సంగీతం గురిం

ఈ నెల 'శాంత' రసం

గాని విమర్శించడం అవినయమే అవు తుంది సాహిత్యానికి ఆవిడ కలిగించే హానికి మాత్రం నేను లోలోపలే బాధ పడుతూ వుంటాను.

ప్రపంచం అంతటా పర్యటించి ఆవిడ కర్ణాటక సంగీతానికి ఎనలేని గౌరవం సమకూర్చింది. బహుశా ప్రపంచం అంతటా అనడం అతిశయోక్తి కావచ్చు ఎందుచేతనంటే కమ్యూనిస్టు దేశాలలో ఆమె తన సంగీతం వినిపించిన దాఖలాలు లేవు అంతేకాక దైవభక్తిపరులు కాని వారికి తన సంగీతం వినిపించడం ఆ దైవానికే అపచారం చెయ్యడమని ఆమె త్రికరణశుద్ధిగా నమ్ముతుంది అంతా విధి విలాసమనీ, ఆ దేవుడే తనచేత పాడిస్తు న్నాడనీ (డబ్బు కూడా పుష్కలంగా వాడే ఇస్తున్నాడనీ) ఆమె దృఢ విశ్వాసం

ఆవిడ సంగీతంలో తతిమ్మా అన్ని రసాలూ ఇంకిపోయి శాంతరసం స్థాయీ భావానికి వచ్చిన దశలో, టిక్కెట్లు ప్రజలచేత కొనిపించి వాళ్ళకి సంగీతం పంచిపెట్టడం సక్రమమైన పద్ధతి కాదని ఆమె కనిపించింది అందుచేత ఇకమీద ఉచితంగానే అందరికీ సంగీతం వినిపిస్తా నని ఒక ప్రకటన చేసింది దానితో దేశం లోని రకరకాల ప్రజోపయోగ సంస్థల నుండి ఆమెకు ఆహ్వానాలు రావడం ప్రారంభమయింది. ఆ సంస్థలు టిక్కెట్లు అమ్మకూడదనే షరతుమీద వారి ప్రార్థన లను ఆమె అంగీకరించేది విరాళాలు వసూలు చెయ్యడంమీద ఆంక్షలు విధిం చేది కాదు తన సంగీతం ద్వారా వాళ్లు ఈ విధంగా లక్షలు పోగుచేస్తారు కాబట్టి అందులో తనకు రావలసినంత పెద్ద వాటా రాబట్టుకోవడంలో ఏమీ తప్పులేదన్న ఉద్దేశంతో ఆవిడ తన ప్రదర్శనమైతే ఉచితమేకాని తనకూ, తన బృందానికీ ఖర్చులు మాత్రం భరించితీరాలని పట్టు పట్టేది ప్రయాణ ఖర్చులు (తరుచు విమానంమీద), భోజనం ఖర్చులు (పెద్ద పెద్ద హొటేళ్లలో), ఇలా ఎన్నో పద్దుల కింద బోలెడు డబ్బు గుంజుకునేది.

ఇదే పద్ధతిమీద ప్రధానమంత్రి పుట్టిన రోజున కూడా ఈవిడ పాడించట "అట" అని ఎందుకంటున్నానంటే కచ్చితమైన సాక్ష్యాధారాలేవీ నావద్ద లేవు కాబట్టి. ఇండియా ప్రభుత్వమే ఈమె ఖర్చులన్నీ భరించిందట ఇది కూడా "అట" మాత్రమే, కారణం సువిదితం.

ఈమె పాడడం ఇందిరా గాంధీ పుట్టిన రోజున కాదని నేను కచ్చితంగా చెప్ప గలను అలాగయితే ప్రధానమంత్రిణి అని ఉందును. ఇక పోతే మన కిద్దరే ప్రధానమంత్రులుండేవారు కాబట్టి నెహ్రూ గారో, శాస్త్రిగారో పుట్టిన రోజున ఆమె పాడివుండాలి

ప్రధానమంత్రి పుట్టినరోజు ప్రసక్తి తేవడం ఇక్కడ అప్రసక్తం కాదు. ఎందుచేతనంటే, ఆ మర్నాడో తమాషా జరిగింది ఢిల్లీలో ఒక సేట్‌జీ ఆనాటి తన పుట్టిన రోజు పండుగలో పాడవలి సిందిగా ప్రాధేయపడుతూ "ఆమె"గారిని ఆహ్వానించాడు ఆ రోజయితే ఖర్చులు గిట్టుబాటు కావని మన గాయకురాలు వచ్చే సంవత్సరం పండుగలో పాడుతా ననీ, తన ప్రతిజ్ఞ ప్రకారం ఉచితంగానే పాడుతాననీ సేట్‌జీకి వాగ్దానం చేసింది.

మరుచటి సంవత్సరం వచ్చింది మరో

రెండు రోజుల్లో సేట్ జీ పుట్టిన దినం. వెంటనే బయల్దేరి (బృందంతో సహా) రావలసిందని సేట్ జీ టెలిగ్రాం ఇచ్చాడు

ఖర్చుల సంగతి సేట్ జీకి తెలియదన్న సంగతి మన గాయనీమణికి తెలియదు. సొంత ఖర్చుమీదనే పెద్ద బృందంతో బయల్దేరింది. వెళ్ళగానే బిల్లు చేతికిద్దామని ఆమె ఎకౌంటెంట్ సలహా ఇచ్చాడు

ఢిల్లీ నగరంలో పెద్దపెట్టున ప్రచారం జరిగిపోయింది

ఖర్చుల నిమిత్తం ఒక్క పైసా అయినా ఇవ్వననీ, ఇచ్చిన మాటప్రకారం ఆవిడ పాడవలసిందే అని సేట్ జీ పట్టు పట్టాడు.

ఆవిడ పాడక తప్పలేదు.

పుట్టెడు దుఃఖంతో ఆవిడ "బ్రూహి ముకుందేతి, రసనే। పాహి ముకుందేతి" అంటూ పాడింది


శ్రోతలందరూ శాంతరస వృష్టిలో తడిసిపోయారు

పాట మధ్యలో ఆమె గుండె పగిలి మరణించింది

"ఆహా! ఎంత భక్తురాలు! ఎంత పుణ్యాత్మురాలు" అంటూ అందరూ ఎంతో మెచ్చుకున్నారు

నా ఒక్కడికి మాత్రమే తెలుసు, ఆవిడ ఎందుకు చచ్చిపోయిందో అన్న అసలు కారణం!

శ్రీశ్రీ నిర్వహించు
పదబంధప్రహేళిక



ఆధారాలు ఫిబ్రవరి '77

అడ్డం

2. మనిషికాదు, కోతికాదు
6. ఈ జపం మోసం
7. దేవాలయం
9. " " శేషగిరిరావు సంపాదకుడు
10. " " పిండి ఇంటిపేరు
12. తిరగబడ్డ సోదరి
14 మొత్తంలో భాగం
15 రాత్రి
17 దక్షిణపు గాలి
19. " " పూజ దండన
20. దర్పం
22. ఏనుగు

జనవరి 77 'పదబంధ ప్రహేళిక'కు సమాధానం·

అడ్డం — 2. అగజానన 6 లల 7. వబా 9 అక్క 10. కలిబా 12. బాజా 14. నిన్ను 15 తుని 17. కవ్వడి 19 కిటికీ 20. వివి 22 లోటా 23 తండం 25. శకుని 27 గోతి 28. డంక 30 సీడ 32 వికటకవి

నిలువు — 2. అల 3. జాబాలి 4 నవ 6. లక్క 8 బాబా 9, అనేకదంతం 10. కన్ను 11 బాతు 13. జానకీపతి 14. నిడివి 16 నికిటా 21 నిశ 22. లోని 24. డం డం 26 కులట 27. గోడ 29. కవి 30 చెరసాల.

ఏకాక్షర పదాలు — 1 శ్రీ 5 ట్రీ 18. క్రీ 31. జౌ 33 టా

నిబంధనలు మరవకండి !

ఎంట్రీలు కొట్టివేతలూ, దిద్దుబాటులూ లేకుండా జ్యోతిలోని పదబంధ ప్రహేళిక లోనే నింపి పంపాలి ఎంట్రీ పంపినవారి చిరునామా పదబంధ ప్రహేళిక వున్న పేజీ లోనే పైన రాసి పంపాలి. ఆల్ కరెక్ట్ ఎంట్రీలలో లాటరీవేసి ఒక్కరికి తెలుగు నిఘంటువూ, మరో పదిమందికి ఆ నెల జ్యోతి కాపీలు పంపబడతాయి ఆల్ కరెక్ట్ పంపిన పాఠకులందరి పేర్లూ జ్యోతిలో ప్రకటిస్తాము. ఎంట్రీలు చేరవలసిన ఆఖరు తేది 1-2-77 (ఈనెల విజేతల పేర్లు 10 పేజిలో చూడగలరు)

---

23. కటాతో విషాదార్థం
25. లోకోక్తి
27 వలె
28 ఉదకమండలం
30 జల్తారు
32. నాగేశ్వరరావు ఇంటిపేరు

నిలువు

2 ఆభరణం
3. ముక్కు చూస్తుంది
4. వన్నె
6. భూ ఖండం
8. పీతకు తాబేలుకు ఉంటుంది.
9 32 కల్ల స్థాపితం
10. అరవంలో వదిన
11. ఈ వాడి తనం గొప్పది
13. తిక్కనలో ఎక్కువ
14. దీనితో గుర్రాన్ని తోలవచ్చు
16 ఎంగిలి రేగిపళ్ళకు ప్రసిద్ధి
21. ప్రగడరాన్నారసా, నిరసా, తునా
22. తెలుగు కథ
24. ఊరే నీరు (తలక్రిందులు)
26 ఒక వీచి
27. శకట విశేషం
29. కలరాకి విరుగుడు
30. పుట్టుక

ఏకాక్షర పదాలు

1. గ్రీకు అక్షరం మీద
5 ఈ కారం రూపం
18 భయం
31. శరీరం ఇంగ్లీషు నెల
33. జంతుప్రదర్శనశాల

సీరియల్

సంసార సాగరం



ఆరెకపూడి (కోడూరి) కౌసల్యాదేవి

ఒక పదంకంటె మరొక పదం తగ్గు శబ్దంతో ఉచ్చరిస్తూ, తనతో తానే గొణుక్కుంటూ న్నట్లుగా అంటూ మెల్లగా కదలిపోతూన్న తండ్రిని తదేకంగా చూస్తూ నిర్విణ్ణ అయిన సుందరి చాలసేపటికి తేరుకున్నది.

తన నిర్ణయానికి తండ్రి తర్క-వితర్కాలు సలుపలేదు,

ఎటువంటి ఆజ్ఞా విసరలేదు,

అభిప్రాయాలు ప్రకటించలేదు,

జరిగిన కధ

శివరావు సౌమ్యుడు, పై మెరుగులకు కాక వ్యక్తిత్వాలకు విలువనిచ్చే వ్యక్తి, ఆయన భార్య మీనాక్షి అందుకు పూర్తిగా వ్యతిరేకం వారికున్న ఇద్దరాడ పిల్లలలో పెద్దది ఉమ. గుణాలకు తల్లి పోలిక. తండ్రి గుణాలకు వారసురాలు సుందరి ఆర్థిక చిక్కులలో ఉన్న గాయక కళాకారుడు సత్యమూర్తికి మీనాక్షి అభ్యంతరం పెట్టినా తన పర్సనల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం ఇచ్చాడు శివరావు మీనాక్షికి ఇదేమీ నచ్చలేదు శివరావుతో కలిసి సత్యమూర్తి ఇంటికి వెళ్ళినప్పుడు, సత్యమూర్తి తల్లి చూపిన ఆదర భావమూ, ఆ తల్లీ కొడుకుల మధ్యగల అనుబంధమూ చూసి ముచ్చటపడిన సుందరి సత్యమూర్తివైపు ఆకర్షితురాలయింది విదేశాలకు వెళ్ళిన కుమార్ తిరిగి రాగానే ఉమ కిచ్చి పెళ్ళి చేయాలని మీనాక్షి సంకల్పం. ఉమ జీవితంలోకి శంకర్ ప్రవేశించాడు ఇద్దరూ బ్లూఫిలిమ్స్ చూశారు అంతే' ఉమ తననుతాను మరిచిపోయింది ఉమ గర్భిణి అని తెలవడంతో మీనాక్షి నెత్తిన పిడుగు పడినట్లయింది ఈ దుర్వార్త తెలిసిన శివ రావు తట్టుకోలేకపోయాడు శివరావుగారి కుటుంబం అవమానాల పాలుకావడం చూసి తట్టుకోలేని సత్యమూర్తి ఉమ పెళ్ళాడాడు. అయినా వారిద్దరూ భార్యాభర్తలుగా ఉండ లేక పోతున్నారు ఉమ అత్తగారింటికి వెళ్ళనని భీష్మించింది. సుందరి చదువు మానే సేందుకు నిర్ణయించుకొంది తనను ప్రేమించిన సుందరి అన్యాయం చేశానని కుమిలి పోయాడు సత్యమూర్తి

అభ్యర్థనలు అసలే లేవు.

అనేక వత్సరాలుగా అతడి అంతరంగాన అణచి వుంచబడిన అగ్నిపర్వతపు సెగలు మాత్రం లీలామాత్రంగా దృగ్గోచరమైనాయి

'లేదు డాడీ, లేదు. ఈ సుందరి మీ మనఃక్లేశాలను అధికం కావించే పని చేసేదీ, మీకు అప్రియమైన నడవడి నడిచేదీ కాదు. మిమ్మల్ని, మీ సేవలనూ వదలి ఎక్కడికీ పోదు, స్థిరంగా నిర్ణయించుకున్న ఆ యువతి కపోలాలపై సన్నని అశ్రు ధారలు దీపకాంతిలో మెరియసాగాయి.

25

నగల దుకాణంవద్ద కారుదిగి లోనికి నడవబోతూన్న మీనాక్షి ఉత్సాహమంతా యింకిపోగా గిర్రున వెనుదిరిగింది. అటువైపుగా వస్తూన్న వ్యక్తిని గమనించనట్లే

అయితే దురదృష్టవశాత్తూ ఆ అవతలామె ఈమెను చూడటమే కాదు. పరుగున వచ్చి అభినందన తెలుపుతూ చేయి దొరకబుచ్చుకుని మాటలు ప్రారంభించింది వడవడా.

"మాటిమాటికీ పార్టీలు యిచ్చేవారు సమావేశాలు ఏర్పాటు చేసేవారు అమ్మాయి పెళ్ళయ్యాక అసలు యిల్లు కదలటమే లేదా ఏం? ఏనాడైంది మనం కలుసుకొని? ఏమిటిలా అయిపోయారు మిసెస్ మీనాక్షిదేవీ?"

"ఏమీలేదు మిసెస్ కైలాసం ఏమిటో ఈమధ్య బంధువుల రాకపోకలతో యింట్లోనే గడచిపోతోంది" అబద్ధం చెప్పేసింది.

పెడసరంగా నవ్వింది శ్రోత "ఔనుమరి అల్లుడూ కూతురూ యింట్లోనేగా? అల్లుడి మర్యాదలు జరపొద్దూ మరీ. వాళ్ళ తాహతెలాంటిదైతేనేం. అల్లుడయ్యాక."

ఒంటికి కారం రాచినట్లున్న ఈ మాటలకు సమాధానం చెప్పకుండా దుకాణం షో కేస్‌లోని వస్తువులు చూస్తూన్నట్లుగా నటించసాగింది మీనాక్షి

"నడవండి క్రొత్త క్రొత్త డిజైన్స్ వచ్చాయి చూద్దాం" అంటూన్న మిసెస్ కైలాసంతో తప్పనిసరిగా లోనికి నడిచింది ఆమెకు ఝడిసి పారిపోయినట్లు కన్పించడం ఇష్టంలేక

"అన్నట్లు ఉమ ఎక్కడా కన్పించడంలేదు ఒంట్లో బాగుంటోందా? క్రొత్త జంట — హాయిగా తిరగక ఏమిటా ఇది?"


హఠాత్తుగా ఆమె ఈ ప్రశ్న అడగటంలోగల ఆరానుు గ్రహించిన మీనాక్షి లోలోన ఉడికిపోయినా పైకి మామూలుగానే నవ్వేసింది "మా ఇంటికంటె సుఖమూ, హాయీ ఎక్కడ వుంటాయి? 'ఇంట అవి కరువైతేకదా దేశంమీద పడటం?' అన్నాడు అల్లుడు అది నిజమేనని నాకూ అన్పించింది"

లోలోన పళ్ళు నూరుతున్నా పైకి మిసెస్ కైలాసం అంగీకారాన్నే ప్రకటించింది.

"ఔను. చక్కగా మీ మాటకు అణగిపడుండే అల్లుడు దొరికాడు. అదృష్టవంతులు మీరు ఎలాగైనా." అనేసి నగల ఎంపికలో నిమగ్నమైంది

మీనాక్షి వదనం కందగడ్డ అయింది

తన బిల్లు మూడువేలూ చెల్లించి పర్సు మూయబోతూన్న మీనాక్షి చేయిపై చేయి గట్టిగా అదుముతూ అన్నది మిసెస్ కైలాసం "సారీ నేను కామేశ్వరి క్లినిక్ నుండి ఇలా నేరుగా వచ్చేశాను. నా బిల్లు రెండువేలూ కూడ ఇచ్చేయండి. సాయంత్రం పంపించేస్తాను."



డాక్టర్ కామేశ్వరి నామోచ్చారణ మీనాక్షిలో దడపుట్టించింది మౌనంగా మరో రెండువేలు ఇచ్చేసింది తన పర్సునుండి తీసి

"మళ్ళీ కలుసుకుందాం" పరుగెత్తినట్లే హడావుడిగా వెళ్ళిపోయింది మిసెస్ కైలాసం

కారులో దర్జాగా కూర్చున్నా, చల్లని గాలులు ఆహ్లాదకరంగా వున్నా మీనాక్షికి మాత్రం తాపసోపశమనం లేదు

'ఎంతదానవే మిసెస్ కైలాసం! ఎలాగే నీ పీడ వదలించుకొనేది నేను? ఆఖరుకు నన్ను బ్లాక్ మెయిల్ చేయడం ప్రారంభించావా?'

నిస్సహాయ క్రోధంతో ఉడికిపోతూ ఇల్లుజేరిన మీనాక్షికి ఇంట్లో అందర్నీ నమిలి మింగేయాలన్నంత కోపంగా వున్నది

ప్రప్రథమంగా ఎదురైన మాలిని చెడా మడా దులిపేసింది

"ఏం చేస్తున్నావ్? తిని గాడిదలా కూర్చుంటున్నావా? ఆ మూల లాన్ ఎగుడు దిగుడుగా వుంటే కళ్ళు కన్పించలా? కత్తిరించాలని తెలియదూ? సీజనల్ ఫ్లవర్స్ ఇంకా పూత పట్టలేదేం? ఆలస్యంగా ఏడిశావా?"

వాడి సమాధానం ఆమెకు అక్కరలేదు

లాన్‌కు ఆ చివర పరధ్యానంగా గార్డెన్ కుర్చీలో కూర్చుని వున్న సుందరి ఆమె కంటపడింది

"ఏమిటా ఏడుపు మొహం ఎప్పుడూ? పదహారేళ్ళ పిల్లకుండాల్సిన ఛలాకీ అసలు వుందా నీలో? అటు కాలేజీ లేదు, ఇటు హాయిగా తిరగటమూ లేదు ఎవళ్ళో చచ్చినట్టు ఎందుకలా కూర్చుంటావ్? ఛీఛీ,"

సుందరి అయోమయంగా కనులెత్తి చూచింది.

నోరు విప్పి మాట్లాడేలోగా మీనాక్షి దూకుడుగా లోపలకు వెళ్ళిపోయింది

"ఇల్లు శుభ్రంగా వుంచాలని తెలియదా ఇడియట్?" నౌకర్లపై ఎగిరి పడింది.

"వంట ఏం చేశావో, ఎంత పరకెందో నాకు చెప్పాలని తెలియదా స్కౌండ్రల్? ఏమూల తగలడ్డావ్?" వంట మనిషిని ఆశీర్వదించి మేడమీదికి దారి తీసింది.

'అమ్మగారు కోపంగా వున్నా'రని గ్రహించిన సేవక బృందమంతా కొయ్య బొమ్మల్లా నిలబడిపోయారు పెదవి కదల్చక.

"హాయ్! వచ్చేశావా మమ్మీ?" అంటూ ఎదురు వచ్చి తన చేతిలో బాగ్‌నూ వస్తువులనూ అందుకుంటూన్న ఉమపై అమితమైన ప్రేమ కలిగింది

"ఏమ్మా ఎక్కడికో వెళ్ళాలన్నావ్ వెళ్ళలేదేం?" అన్నది.

తనకు మద్దత్తుగా వుండే తల్లి అలా అడగగానే ఉమకు ఏడుపూ, గారమూ తన్నుకు వచ్చాయి

సత్యమూర్తికీ తనకూ జరిగిన వాగ్వివాదాన్ని వివరించింది కన్నీళ్ళతో తల్లికి.

మీనాక్షి ఉగ్రురాలై రణభేరి మ్రోగించి కదను త్రొక్కుతూ బయలుదేరింది

ఈరోజు యుద్ధభూమి భోజనాల గది

అప్రసన్న వదనంతో ప్రవేశించిన మీనాక్షిని చూస్తూనే, టేబుల్ వద్దనున్న కుటుంబ సభ్యులంతా మరో వైపు చూడసాగారు ఎక్కడ ఉరుము ఉరుముతుందో, ఎవరిమీద పిడుగు పడుతుందో తెలియదాయే!

సత్యమూర్తి దెస తేరిపార చూసింది మీనాక్షి

తన రాకనూ, ఉనికిని సరకు జేయనట్లే నాప్‌కిన్ అందుకుంటూ, శివరావుతో మాటలు ప్రారంభించిన అతడి ధోరణి ఆమె సహనాన్ని అంతరింపజేసింది

"నీ విజయవాడ ప్రయాణం ఎప్పుడు?" అన్నది తీక్షణంగా చూస్తూ

సమాధానం శివరావు చెప్పాడు. "త్వరలోనే అక్కడ అన్ని ఏర్పాట్లూ అయ్యాయి ఇక్కడింకా నా దగ్గర కొంచం వర్క్ వున్నది."

"మీ దగ్గర సెక్రెటరీ పనికి 'కో' అంటే కోటి మంది వస్తారు దానికోసం అక్కడ బిజినెస్ నంతనూ గాలికి వదలి యితడిక్కడెందుకూ! పెద్ద ఉద్యోగాలలో బాధ్యతలు తెలిసివుండాలి "

వెంటనే శివరావు ఆమెను మందలించాడు "బిజినెస్ కేమీ ముప్పు రాలేదు అల్లుడితో నీవు మాట్లానే తీరు అలా వుండకూడదు "

"మీరూరుకోండి అన్నీ మీనుంచి నేర్చుకుంటాను యిక." భర్తను కసరి పారేసింది

మరలా సత్యమూర్తి దెస తిరిగింది. "భార్యపై అడుగడుగునా నీ ఆంక్ష లేమిటి?" అంతకంతకు ఆమె స్వరం హెచ్చసాగింది. "ఉమను నువ్వు సాయంత్రం

జ్యోతి

బయటకు ఎందుకు వెళ్ళనీయలేదు?"

శివరావూ సుందరీ అయోమయంగా చూస్తున్నారు. ఉమ ముఖ కవళికలు ఆనంద ప్రకటన చేస్తున్నాయి

సత్యమూర్తి ఎవరితోనైనా చాలా తక్కువ మాట్లాడ్తాడు మీనాక్షితో సాధారణంగా మాటే ఆడడు. ఈనాడు మాట్లాడలేదు.

సమాధానం శివరావుకు చెప్పాడు, "నేనూ ఉమా రేపే వెళ్ళిపోతాం."

"ఉమ ఎందుకు?" ఖంగు మన్నది మీనాక్షి స్వరం.

"అక్కడ కూడా ఇలా ఆంక్షలుపెట్టి వేధించుకు తినడానికా?"

"అతడి భార్యను అతడిష్టం వచ్చినప్పుడు తీసుకు వెళ్తాడు" స్థిరంగా గంభీరంగా అన్నాడు శివరావు.

"నేను ఇప్పుడే వెళ్ళను డాడీ" గునుస్తూ అంటూన్నది ఉమ.

"మొదటిసారి. జాగ్రత్తలేం తెలుస్తాయి? ఒంట్లో అంత బాగుండటం లేదు కూడా. ఇప్పుడు పంపను" ఖచ్చితంగా అన్నది మీనాక్షి "అక్కడ కూడా యింట్లో పడివుండమంటే ఏం తోస్తుంది? అసలు అలాంటిచోట్ల కాలక్షేపం ఏమౌతుంది హై సొసైటీ పిల్లలకు?"

"నువ్వు తల్లిగా—బాధ్యతతో మాట్లాడు మీనా. వివాహం తర్వాత భార్యాభర్తలు తమలో తాము నిర్ణయించుకోవాలి కానీ పెద్దవాళ్ళమని మధ్యలో మనం ప్రవేశిస్తే అంతా చెరుపే జరుగుతుంది"

"ఏమిటి మీరు?" గంయ్యిమన్నది. "కన్నతండ్రిలాగా ప్రవర్తించరేం ఉమ విషయంలో? ఇన్నాళ్ళనుండీ వేవిళ్ళతో బందీలాగా పడివున్నది మంచంమీదనుండి లేవకుండా కాస్త కుదుటపడి ఈరోజు ఒక్కసారి బయటకు వెళ్తానంటే వద్దంటాడా? ఎందుకని అడగరేం?"

క్రొత్తగా వింటూన్న ఈ విశేషాలు సుందరికి శ్వాస నిలిచిపోయినంత పని చేసాయి. ఉన్నది ఉన్నట్టే స్తంభించిపోయి చూడసాగింది ఉమనూ, తల్లినీ.

"మొగుడైనంత మాత్రాన శాసనాలు చెల్లవు ఈ ఇంట్లో" మీనాక్షి ఖండితంగా అరచింది.

సత్యమూర్తి భోజనం వదలి లేచిపోయాడు, శివరావూ, సుందరీ వారిస్తూన్నా వినకుండా

ఈసారి అతడు మీనాక్షిని ఉద్దేశించి మాట్లాడాడు.

"నేను వద్దని అనలేదు, ఆంక్షలు పెట్టలేదు, కానీ ఇక ఉమకు నాకు తెలియని స్నేహితులూ, నేను వెంట రావటానికి అభ్యంతరం వుండే ప్రదేశాలూ ఉండరాదు స్త్రీకి మాతృత్వం కఠినతరమే అయినా, ఒక వరం వంటిది. ఆ కారణంగా బందీవలె పడివున్నదని ఎవరూ చింతించనవసరం లేదు" ఖరారుగా అనేసి వెళ్ళిపోతూ ఒక్క

క్షణం ఆగి ఉమ దెస చూచాడు. "ఉమా, రేపే మన ప్రయాణం, సిద్ధంగా వుండు" నిక్కచ్చిగా అనేసి, మరెవరి మాటకూ ఎదురుచూడక తన గదిలోకి వెళ్ళిపోయాడు.

ఆ వెనువెంటనే విసవిసా శివరావూ వెళ్ళిపోయాడు తన గదిలోనికి

"డాడీ!" సుందరి మాట గొంతులోనే పూడిపోయింది. ముంచుకు వస్తున్న దుఃఖంవలన

అనుదినం షడ్రసోపేతమైన భోజనానికి నోచిన ఐశ్వర్యవంతులు, అయినా అది పూర్తిగా గొంతు దిగుతుందో లేదో ప్రతిరోజూ అనుమానమే!

స్పూన్నూ, ప్లేటూ పెద్ద పెద్ద శబ్దాలతో త్రోసి పారేసి భర్తను తరుముకు వెళ్ళినట్లే వెళ్ళింది మీనాక్షి.

"ఏమిటి, ఆ గతిమాలినవాడిముందు నా పరువు తీయటంలో మీ ఉద్దేశ్యం?"

"అతడు మన అల్లుడు మాటలు మీరకు, జాగ్రత్త!" హుంకరించాడు

"అల్లుడు గనుక ఇక మనం వాడి అధికారంలో వుండాలన్నమాట?"

"ఆఁ" ఖచ్చితంగా అన్నాడు. "ఆ మాత్రం తెగువా, బుద్ధీ నాకే వుండివుంటే కుటుంబం ఈనాడు ఈ గతిలో వుండేది కాదు"

నివ్వెరపోయింది మీనాక్షి.

"మీరు చాలా మారిపోయారీమధ్య."

"ఈ అనవసర సవాళ్ళు మాని, వెళ్ళి రేపు ఉమ ప్రయాణానికి అవసరమైన ఏర్పాట్లు చూడు"

"రేపేనా? తప్పదా?"

"తప్పదు!"

"అయితే నేనూ వెళ్ళాలి ఒక్కతెనూ ఎలా వదలడం?"

"నీ అవసరంలేదు అక్కడ భద్రమ్మగారున్నారు. ఆవిడ నిన్ననే చేరిపోయారు అక్కడకు"

మీనాక్షికి భద్రకాళీ రూపం వచ్చేసింది విసరి పారేయటానికి అందుబాటులో ఏ వస్తువూ కన్పించక, లేచి నిలబడి ఆ కుర్చీనే తన్నిపారేసింది.


"అడుగడుగునా మీ ఆంక్షలు నా కనవసరం. నేను వెళ్ళి తీరతాను. అత్త అమ్మ ఔతుందా?"

"చక్కగా అవుతుంది ఆమెగారు చాలా ఉత్తమురాలు నీవు వెళ్ళిన చోటల్లా తగవులు తప్ప మిగిలేదేమున్నది?"

"ఎంతమాటన్నారు?"

"నిజమే అన్నానుకానీ, అంతగా ఉమతో పుట్టింటివారు కూడా వుండాలను కుంటే సుందరిని పంపించుదాం."

"అదెందుకు మధ్యన?"



శివరావు ఇక తర్కించకుండా బయటకు వచ్చి సుందరిని పిలిచాడు

అంతా వింటూనేవున్న సుందరి గజగజలాడుతూ వచ్చి నిలబడింది

'ఔనూ', 'కాదూ' అనలేని సంకట పరిస్థితి ఇది.

నిత్యం సత్యమూర్తిని చూస్తూ అతడి యింట గడపడం తన కొక ఘోరమైన శిక్ష

'కా'దంటే తల్లి వెళ్లి తీరుతుంది, అక్కడ జన్మ జన్మలకూ సరిపడే క్లిష్ట పరిస్థితులను సృష్టించీ వస్తుంది

"రేపు అక్క బావలతో నీవూ వెళ్ళాలమ్మా సుందరీ, వెళ్ళగలవా?"

" " సుందరి నేలచూపులు చూస్తూండిపోయింది.

"ఓ రెండు నెలల వుండి రామ్మా "

"అలాగే డాడీ" అనలేక అన్నది

సుందరి మనస్సు ఏడుస్తూన్నది ఏమేమో చెప్పాలని వున్నది తండ్రికి కానీ ఏమీ చెప్పలేని అశక్తురాలైంది ఓ వంక భస్మంచేసే చూపులతో తల్లి అక్కడే నిలబడి వున్నది.

తన గదికి తిరిగివచ్చిన ఆమె మెదడులో చెదల పుట్టలు దొలచసాగాయి

డైనింగ్ టేబుల్ దగ్గర వాగ్వివాదం పిమ్మట ఉమను పరీక్షగా చూచింది తాను

'ఏమిటిది? ఎలా జరిగింది? ఉమ వివాహం జరిగి ఎన్ని నెలలైంది?

మరి ఉమ రూపమూ, స్థితీ ?

ఇదెలా సంభవం?'

అవివాహితే కానీ, లోకజ్ఞానంలేని మూర్ఖురాలు కాదు సుందరి.

'సత్యమూర్తి ఉమా వివాహానికి పూర్వమే ?'

'ఛీ.'

ఆలోచించటానికి కూడ అసహ్యం వేసింది.

చాలా రాత్రులుగా నిదుర లేదు, మనసున శాంతీ లేదు

నేడు ఆ అశాంతీ మనోవేదనా పరాకాష్ఠనందుకున్నాయి

మనసు నిర్విరామంగా ఏడుస్తూన్నది

గుండెలలో గునపాలు గ్రుచ్చినంత బాధ ఎగదన్ని ప్రాణాలను మెలిపెడుతూన్నది.

నిద్రరాక బాధపడుతూ బయటికి వచ్చి వరండాలో నిలబడి చుక్కలను చూడసాగింది

'ఈ బాధలనుండి విముక్తి ఎప్పుడు? ఈ వినీలాకాశంలో నేనూ ఒక తారకనయ్యే సుదినం ఎప్పుడు వస్తుంది భగవాన్?'

"నీతో వచ్చి ఏం చేయాలి నేను?" ఉమ తీవ్రంగా అడుగుతూన్నట్టు కంఠం వినవచ్చింది ప్రక్కగదినుండి

జవాబేమీ లేదు

"నిన్నే అడుగుతున్నాను ఏమిటీ అతిప్రేమ?" ఉమ రెట్టించిన తీక్షణతో అడుగుతోంది

"నీకే తెలుసు" సత్యమూర్తి నెమ్మదిగా ఇచ్చిన జవాబు.

అప్రయత్నంగానే అన్నీ వచ్చి సుందరి చెవుల సోకుతున్నాయి ఆ నిశ్శబ్ద నిశీధివేళ

"హుం! ఏకాంతంలో కూడా ఘర్షణలూ, వాగ్వివాదాలూ! ఎందుకొచ్చిన ప్రేమ ఫెళ్ళియిది?'' హేళనగా నవ్వుకొన్నది తనలో తాను సుందరి

ఉమ కంఠం హెచ్చింది

"లోకాన్ని వంచించాలనా ఈ నాటకం? తన కుమార్తెను యింతగా ప్రేమిస్తున్నావని నమ్మి నాన్నగారు నీపై ధనరాసులు కురిపించాలనా?"

ఈ రెట్టింపు సత్యమూర్తి సహనాన్ని కదిలించినట్లుగా విన వచ్చింది జవాబు!

"వంచన అనేది అందరికీ వచ్చే విద్యకాదు ఉమా!"

"ఓహో! అయితే నాతో నీకేమి సంబంధమని యింత ప్రేమగా వెంటబెట్టుకు వెళ్తున్నావ్?"

"సంబంధం కాదు, బాధ్యత!"

"ఏమిటా బాధ్యత?" ఉమ రోషంగా బుసలు కొట్టుతున్నది. "బయటే కానీ, గదిలో మనం భార్యాభర్తలం కాదు ఇక నాతో ఏ మవసరమని వెంట రమ్మంటున్నావ్? లోకం నీ మగతనాన్ని హేళన చేయకుండా జాగ్రత్తపడ్తున్నావా?"

"ఛీ నోర్ముయ్." అసహ్యం ఉట్టిపడ్తూన్నది సత్యమూర్తి స్వరంలో. "జరిగిన దానికి ఏ మాత్రం సిగ్గు పడినా—ఏ మాత్రం అభిమానం వున్నా నోరు మూసుకు పడివుందువు నీ బ్రతుకు రట్టు కాకుండా చేసినందుకు, ఇంటి పరువు కాపాడినందుకు తల్లీకూతుళ్ళు నన్నే నిలదీస్తున్నారా?"

"మనిషికి కోరికలు సహజం. సిగ్గెందుకు? ఇలా నేను ముక్కు మూసు కూర్చోలేను."

"తప్పదు నిన్ను నేను భార్యగా చూడలేను."

"అయితే నా మానాన నన్ను వదిలేయి."

"ఉమా! మీనాన్నగారు జీవించి వుండడం నీకు యిష్టం లేదా? పతితగా మారాలని ఎందుకు కోరుకుంటున్నావ్?"

" "

"ఉమా! అతడెవరో నాకు చెప్పు మీ వివాహం జరిగేట్టు నా శాయశక్తులా ప్రయత్నిస్తాను, మీ నాన్నగారికి నచ్చజెప్పి అంతే కాని నీ బ్రతుకును అపవిత్రం చేసుకోకు, నా జీవితం నరకం చేయకు "

"మైపుట్! ఈ పాడు నీతులు నాకు చెప్పకు, ఇంత రాయిలా వుండగలవాడితో నేను బ్రతకలేను "

"తప్పు నాది కాదు, ఈ గండం గడవటానికి నీ తప్పు నా నెత్తిన వేసుకొని పెళ్ళి చేసుకోమని నీ అంతట నువ్వే కోరావు. ఆనాడు గుర్తు చేసుకో ఆత్మహత్య చేసుకోబోతున్న నిన్నూ ప్రాణం తీసుకోబోయిన మీనాన్నగారినీ చూసి నేను ద్రవించి పోయాను, నా జీవితాన్ని త్యాగం చేశాను ఫలితం నాకు నిత్య నిరసనాలూ, దూషణలూ నా తల్లికి తీరని దుఃఖం, వేదనా!" అతడి కంఠం గాద్గదికమైంది.

"నాకేం తెలుసు నీ వింత బండరాయివని?" ఉమ రెచ్చిపోతూ అన్నది, "ఏదో ఓ పెళ్ళంటూ ముందు జరిగితే, తర్వాత ఏదో ఓ వంకన విడాకులు తీసుకుని అడ్డు తొలగించుకోవచ్చనీ, అందుకే నిన్ను యింటికి పంపుతాననీ. నిన్నేదో ఓ కారణంగా వివాహానికి అంగీకరింపజేయమనీ మమ్మీ చెప్పింది ఈ విషయం నీకూ తెలిసి యిష్టమయ్యే చేసుకుంటున్నా వనుకున్నాను కానీ, ఇలా బంకమట్టిలా ఎంత విదిలించినా పట్టుకు వ్రేళ్ళాడతావని అనుకోలేదు "

"ఉమా !!"

ఆ ఉచ్చారణ ఉరిమినట్లు లేదు.

ఉగ్రత అసలే లేదు.

హఠాత్తుగా ఒక ఘోర సత్యాన్ని విని అధఃపాతాళానికి కృంగిపోతున్న ఆక్రందన స్వరం అది.

కొన్ని క్షణాలు భయంకర నిశ్శబ్దంలో గ్రుక్కిళ్ళు...

ఆ నిశ్శబ్దాన్ని సత్యమూర్తి నీరస స్వరం ఛేదించింది.

"జీవితం ఆటలాడుకోవటానికి కాదు. విలువైనది అని నా ఉద్దేశ్యం ఉమా ఆపైన నీయిష్టం జీవితాన్ని రట్టు చేసుకుని, మీ నాన్నగారి ప్రాణాలే తీస్తావో — లేదా ఈ గుట్టును మన మధ్యనే మరణించ నిస్తావో—"

గదిలోనుండి బయటకు వెళ్ళిపోయిన అతడు చీకటిలో నిలబడివున్న సుందరిని గమనించలేదు.

ఇన్నాళ్ళుగా సుందరి మనసులోని తెగని ప్రశ్నావళికి నేడు అతి చేదు సమాధానాలు దొరికాయి.

ఘోటక విషతుల్యమైన ఈ ఘోర సత్యాలను వింటూ ఆమె నిలబడే శక్తిని కూడా కోల్పోయి. క్రింద పడతానేమోననే భయంతో స్తంభాన్ని గట్టిగా ఆసరాగా పట్టుకున్నది.

'కుటుంబం పరువూ, పరపతీ కొరకు అంతులేని త్యాగం చేసిన సత్యమూర్తి గారు దేవుడేకదా?' దుఃఖం కట్టలు త్రెంచుకొనగా తన గదిలోనికి వచ్చిపడింది

'వాడెవడు? కుమారా, శంకరా? డాడీకి ఈ విషయం తెలియదన్నమాట! నేను చెప్పివేస్తాను '

కానీ ఆమె కాళ్ళు నడవమని పట్టుబట్టాయి 'వద్దు. ఆయన తట్టుకోలేరు. ఈ గుండె భారాన్ని నేనే మోయలేకుండా వున్నాను ఇక ఆయన ఎంత బాధ పడ్తారో!'

'ఛీఛీ మమ్మీ అక్క ఎంత నీచాని కొడిగట్టారు?'

26

"డాడీ!" దుఃఖంతో పూడుకు పోతూన్న గొంతును ఎలాగో సరిజేసుకొని అన్నది సుందరి.

"రోజూ వేళకు భోజనం చేస్తానని మాట ఇవ్వండి "

శివరావు తన దుఃఖా వేదనలను గుబురు మీసాల చాటున దాచి, దరహాసాన్ని ఎరువు తెచ్చుకున్నాడు


"పిచ్చితల్లి. ఈ మాత్రానికే ఇంత బాధపడ్తున్నావ్— రేపు నీవూ నీ ఇంటికి వెళ్ళవలసిన దానవేకదా? అప్పుడేం చేస్తావ్ ఈ తండ్రిని?"

కోప వివశురాలైంది సుందరి "నేనిక్కడ వుండటం ఇష్టంలేకపోతే, పోనీ అలాగే తరిమేయండి— త్వరగా ఎవడినో వెదకి "

శివరావు పకపకా నవ్వేశాడు "ప్రతి ఆడపిల్ల ఇలాగే అంటుంది మొదట్లో. పెళ్ళయ్యాక పుట్టింటికి ఓ ఉత్తరం వ్రాసే తీరిక కూడా లేదంటుంది!"

సుందరి నవ్వలేదు చాలాసేపు గంభీరంగా ఏదో ఆలోచించుతూ వుండి పోయింది

"డాడీ ఒక్కమాట!" అన్నది హఠాత్తుగా తల ఎత్తి



"చెప్పమ్మా"

"నా ఇష్టం లేకుండా— నన్ను సంప్రదించకుండా మీరు నా కెవర్నీ కుదర్చ వద్దు— ఎవరికీ మాట ఈయవద్దు. నాకు వివాహంపై ఇష్టంలేదు" స్థిరంగా గంభీరంగా అనేసి. మరి అతడిమాట వినకనే వెళ్ళిపోయింది గబగబా

ఆమెకు తల్లితో ఏమీ మాట్లాడాలన్పించలేదు అత్తవారింటి కేగబోతూన్న ప్రియపుత్రికకు తల్లి బుద్ధులు నేర్పుతూన్నది—

"వాడి అధికారంలో పడివుండకు. ఇష్టం వచ్చినట్లుండు. కోటీశ్వరుల పుత్రికవు ఆ ముసలిదాన్ని ఎప్పుడూ హద్దులలో వుంచు ఇప్పుడు రాకపోతేనేం. ఒకటి రెండు నెలలలో ఏదో వంకన తప్పక వస్తాను ఎప్పుడు డబ్బు కావాలన్నా రాయి తల్లీ"

ఈ మాటలు విన్న సుందరి మనసు సత్యమూర్తిపై సానుభూతితో నిండిపోయింది.

'ఇటువంటి ఈమెతో జీవితం ఇంతవరకూ లాక్కువచ్చిన డాడీ ఓర్పు ఎంత శ్లాఘనీయమైనది!' అని తలపోయకుండా వుండలేకపోయింది

లాన్‌లో అన్యమనస్కంగా కూర్చున్న సత్యమూర్తి ఆమెకు కన్పించాడు

మరో అరగంటే వున్నది ప్రయాణానికి

తీరని వేదన అతడి వదనంలో ద్యోతక మౌతున్నది

తన రాకను తెలియజేయటానికి చిన్నగా దగ్గింది

ఇటు తిరిగి చూచిన సత్యమూర్తి ముఖం మ్లానమైంది

అక్కడినుండి లేచి పోబోతూన్న అతడిని ఆమె మాటలతోనే అడ్డుపడి

ఆపింది

"వెళ్ళకండి. మీతో మాట్లాడాలనే వచ్చాను "

విస్మయంగా చూచిన అతడి కనులు అంతలోనే వాలిపోయాయి.

"నేను మీతో రావడం   మీ కిష్టమేనా?"

"ఆ మాట చెప్పటానికి నే నెవర్ని సుందరీ?"

"మీ ఇంటికి వచ్చేముందు మీ అనుమతి తీసుకోవద్దా?"

"హుఁ. నా ఇల్లు?" నిర్లిప్తంగా అన్నాడు

"అందరూ తలో విధంగా మిమ్మల్ని హింసిస్తున్నారు , కుటుంబం పరువూ ప్రాణాలూ నిలబెట్టిన దేవతను నేనుకూడా బాధించడం నా కిష్టంలేదు!"

"సుందరీ!"

"ఔను. మీ కిష్టమైతేనే నేను వస్తాను మీరు మా కుటుంబంలో కలియడంవల్ల మీరేమి కోల్పోయారో నాకంటె బాగా ఎవరికీ తెలియదేమో?"

"సుందరీ!" అతడి స్వరం గళాన్ని దాటలేకపోయింది, పలుభావాలతో కను రెప్పలు రెపరెపలాడాయి

సుందరి అధోవదన అయ్యింది. "నేను అన్నీ విన్నాను రాత్రి "

"   "

"అనాడు మీకు ఉద్యోగం ఇప్పించి ఎంతో ఉపకారం చేశాననుకున్నాను కానీ, మీ జీవితాన్ని నాశనం చేస్తున్నానని   "

"ప్లీజ్ సుందరీ ఇక ఆ విషయం మాట్లాడవద్దు. మనం దురదృష్టవంతులం. అంతే, నీ జీవితమైనా ఆనందంగా గలవాడనే కోరిక మినహా నేడు నేను భగవంతుని ప్రార్థించేదేమీ లేదు "

"హుఁ. నా జీవితానికి ఆనందమా?   పోనీయండి, ఆ విషయం. నా రాకవల్ల అక్కడ మీకు ఇబ్బంది   "

"లేదు సుందరీ! వస్తే ఒక మహాపాపం జరిగిపోకుండా కాపాడగల వార మౌతాం "

"అదేమిటి?"


ఇటూ అటూ చూచి తగ్గు స్వరాన అన్నాడు "పుట్టిన శిశువును రహస్యంగా ఏ అనాథ శరణాలయానికో ఇచ్చివేయాలని మీ అమ్మా అక్కగార్ల పథకం "

"మైగాడ్!"

"దారి తప్పి వస్తున్న ఆ దురదృష్ట జీవిని అన్యాయం జరగకుండా కాపాడ టానికే నేను పట్టుదలగా ఉమను వెంటతీసుకు వెళ్తున్నాను ఇందుకు మీ సహకారం అవసరమే "

సుందరి చాలసేపు ఆలోచనలో మునిగిపోయింది

"ఈ రహస్యం   ?" ప్రశ్న ఎలా అడగాలో ఆమెకు తెలియలేదు.



"ఆ ఇద్దరూ మాట్లాడుకున్న వివరం ఒకనాడు ఉమ ఆవేశంలో నన్ను తిడుతూ చెప్పివేసింది."

"ఏ దశకు వచ్చింది ఈ కుటుంబ స్థితి?" నిట్టూర్చింది సుందరి

"అంతేకాదు సుందరీ కుటుంబానికి ఆప్తులూ, ఇటీవల జరిగిన విషయాలన్నీ తెలిసినవారూ అయిన పరబ్రహ్మంగారికి నేనీ విషయాన్ని చెప్పి ఆయన సాయం కోరక తప్పలేదు."

"ఏమన్నారు?" సుందరి ఉత్కంఠ.

"ఉమ కొరకు విజయవాడలో వారికి తెలిసిన లేడీ డాక్టర్‌ను ఏర్పాటు చేస్తానన్నారు."

సుందరి భారంగా నిట్టూర్చింది

"ఆఫీసు పనులూ అవీ ఇవీ అని బయట తిరగక తప్పదు నేను ఉమను కాస్త కాచుకోవటానికి మీరు వుంటే నాకు నిశ్చింత మా అమ్మగారు అమాయకురాలు—ఏమీ తెలియదు."


"కానీ అక్కకూ నాకూ అంత సఖ్యతలేదు మేమిద్దరమూ మాట్లాడుకొనేదే చాలా తక్కువ."

"నాకు తెలుసు, కానీ ఉమకు ఆలోచనకంటె ఆవేశం, అవివేకం అధికం, ఇంకా ఆమె పాత స్నేహాలు "

"ప్లీజ్ చెప్పకండి." వినలేనట్లు చెవులు మూసుకున్నది సుందరి. "మీతో వస్తున్నాను, వీలైనంతగా మీతో సహకరించటానికి." అంటూనే పరుగెత్తినట్లే నడచి పోయింది.

అతడికి తెలుసు, ఆమె అశ్రువులను తాను చూడరాదనే అలా పారిపోయిందని ఆమెకు తెలుసు, అతి గంభీరంగా కన్పట్టుతూన్న అతడి అంతరంగం అవధులు లేని శోకసముద్రమై కెరటాలు వేస్తూన్నదని.

[సశేషం]



యస్ పురుషోత్తమాచార్య

కొబ్బరి తోటలో సీరెండ దోబూచులాడుతోంది మేదరివాడు అల్లిన చాపలా గళ్లు గళ్లుగా ఎండ కొబ్బరి ఆకుల సందుల్లోంచి నేలమీద పడుతోంది. గెలల నుంచి రాల్చిన కొబ్బరి బొండాలు రాసి పడి గుట్టతేలేయి. దాపులోనే ఆగివున్న లారీ క్రింద పడుకొని కొబ్బరి గెలల్ని మోసుకొస్తోన్న అమ్మాయిల వొంటి బిగువుల్ని కళ్ళతో కొలతలు వేస్తున్నాడు డ్రైవరు పానకాలు లారీ కెడమప్రక్కగా పనివాళ్ళు కొబ్బరిబొండాల తొక్కని చెక్కి లారీలోకి విసురుతున్నారు

అదంతా ఏమీ పట్టనట్లుగా కాస్త ఎడంగా వున్న కుక్కిమంచంలో దిగాలుగా కూచుని వున్నాడు సింహాచలం. ఆలోచనలతని బుర్రని తొలిచివేస్తూన్నాయి పనివాళ్ళతని కనుగప్పి ప్రక్కనే వున్న గోనె బస్తాల్లో పీచుకు బదులు కాయల్ని నింపుతూనే వున్నారు అతని పరాకు నదనుగా తీసుకొని ఓ నాలుగు బస్తాల కాయలు పీచు రూపంలో తోటని దాటి వెళ్ళేయి మనసులో మనసులేని సింహాచలం యివన్నీ గమనించే స్థితిలో లేడు. అతని మనసునిండా మంగళగిరి నృసింహస్వామి దివ్యస్వరూపమూ, తను ఆయన కిపుడు కట్టవలసిన ముడుపుని గురించిన ఆలోచనలు మాత్రమే నిండి వున్నాయి

లారీ క్రిందనుంచి యివతలికొచ్చి వాగన్‌లోకి తొంగిచూచేడు పానకాలు అది యింకా నిండకపోవటాన్ని గమనించి బీడీ వెలిగించేడు పాతిక గజాల దూరంలో బొండాన్నెత్తి పట్టుకుని నీళ్ళు త్రాగుతోంది లచ్చి రెండు చేతుల్నీ పైకెత్తి బొండాంలోని నీళ్ళని త్రాగుతూన్న దాని తడిసిన గుండెల ఎత్తు పల్లాలు పానకాలు నరాల్ని జివ్వున లాగేయి ఖాళీ బొండాన్ని దూరంగా విసిరి చీరకొంగుతో మూతిని తుడుచుకుంటూన్న లచ్చికి కన్ను గీటి దాపులోని పాకవంక అడుగులేసేడు పానకాలు

వొళ్ళు విరుచుకుంటూ సిగ్గు లొలకబోసింది లచ్చి చెట్టుక్రింద రాలిన బొండాంల్లోంచి పెద్దసైజు దాన్నొకటి ఏరి పట్టుకుని పానకాలు వెళ్ళినవైపు పరుగుతీసింది

చెట్టు నెక్కి గెలల్ని రాలుస్తోన్న కనకయ్య కనుకొలుకుల్లో నీళ్ల నిలిచేయి లచ్చి పాకలోకి అడుగువేయటం చూచి, అప్పటికే పాకలో వున్న పానకాల్ని



గురించి ఊహించుకోగానే అతని గుండె బరువెక్కిపోయింది.

కుక్కిమంచంలో కూచుని వున్న సింహాచలం కూడా ఆ దృశ్యాన్ని గమనించేడు. ముడుపు విషయం ఆలోచించటాన్ని ఓ క్షణం మానుకుని కనకయ్య వంక సానుభూతిగా చూచేడతను. అతనికా క్షణంలోనే లచ్చి, కనకయ్యల పాతకాపురంనాటి రోజులు జ్ఞాపకం వచ్చాయి.

లచ్చి, కనకయ్యని కోరి పెళ్ళాడింది. మొదట్లో యిద్దరూ జోరుగా తిరిగేరు. కళకళ్ళాడుతూ తోటలంతా వేళాపాళా లేకుండా తిరుగాడుతూ వుండే ఆ జంటని చూచిన వయసుమళ్ళిన వాళ్ళలో కూడా కోరికల గుర్రాలు పరుగులు తీసేవి. కొబ్బరి తోటలే తమ యిళ్లుగా, పచ్చగడ్డే తమ పానుపుగా, బొండాలతోనే ఆకలినీ దాహాన్నీ తీర్చుకుంటూ, వయసూ పరువాల అలజడిని అణుచుకుంటూ తిరుగాడిన ఆ జంట నలుగురి కంటికీ యింపుగా వుండేది. కాని గత సంవత్సరం యిదే శేషాద్రిగారి తోటలోని కాయల్ని రాలుస్తూన్నప్పుడు కాస్తా కాలుజారి చెట్టుపైనుంచి నేలకూలేడు కనకయ్య. చెట్టు ఎత్తైంది కాకపోవటంతో వొంటికైతే ఏ హానీ కలుగలేదు కానీ మనిషన్నవాడికి కావలసిన మగసిరిని మాత్రం కోల్పోయాడు. దాంతో లచ్చి గుణం కాస్తా మారిపోయింది. కనకయ్య కళ్లు కప్పి పానకాలుతో కాలు జారింది. కొన్నాళ్ళకి కనకయ్య కళ్ళు తెరుచుకున్నాయి. కాని

పరువుకోసం తిరిగి మూసుకున్నాడతను. అది ఆసరాగా తీసుకుని యిహ అతడి ముందే నేరుగా వ్యవహారం మొదలెట్టింది లచ్చి. తోటలోని వొంటరి సంసారం కావటంతో గుట్టు రచ్చకెక్కలేదు కానీ కనకయ్య గుండెల్లో అంటుకున్న మంటలు మాత్రం రగులుకుంటూనే వున్నాయి.

సింహాచలం ఆలోచనల్లోంచి తేరు కున్నాడు. అతడిలో తిరిగి ముడుపుని గురించిన ఆందోళన ఆవరించుకు పోయింది.

కాని చెట్టుపై నున్న కనకయ్య గుండె లవిసిపోయేయి. ఇలా పట్టపగలే నలుగు రున్నారని కూడా చూడకుండా వాళ్ళిద్దరూ అలా పాకలో దూరటంతో కలిగిన అశాంతితో మనసు వశంతప్పి పిచ్చిగా గెలల్ని తెగవేయసాగేడతను.

"ఏరా కనకయ్యా! వొళ్లు పొగరెత్తిం దేవిటి? కళ్ళు కనిపించటంలా? పసిపిందె ల్నలా రాలుస్తున్నావేవిటి?" క్రింది నుంచి శేషాద్రిగారి గొంతు వినటంతోనే కనకయ్య కరచేతుల్లో చెమటలు పోసేయి. వంకీ కత్తి పట్టుదప్పి చేయి జారింది.

సూదిమొన మేరలో ప్రమాదాన్ని తప్పించుకున్న శేషాద్రిగారి కళ్ళలో రక్తం పేరుకుపోయింది. ఒళ్ళుమరచిన కోపంతో గావుకేక వేసేరాయన.

"దిగూ!"

కనకయ్య పైప్రాణాలు పైనే లేచి పోయేయి. కంగారుగా దిగబోతూంటే కాలు కాస్తా జారిపోయింది. కుప్పలా నేల కూలిన వాడి తొడ ఎముక కరకరమంది. బాధని పళ్ళమధ్య బిగిస్తూ తన తలనెత్త డతను. కాని అంతలోనే శేషాద్రిగా చేతిలోని పొన్నుకర్ర కాస్తా వాడి త తలపై విసురుగా పడిపోయింది. దాంతో కుక్కినపేనల్లే నేలకొరిగేడతను.

క్షణంలో తోటంతా సద్దుమణిగి పోయింది.

సింహాచలం కుక్కిమంచంలోంచి లేచి వచ్చేడు.

"బాబుగారూ! వెంకటేశుకెలావుంది?" సింహాచలం ప్రశ్నని వింటూనే శేషాద్రి గారి ఆగ్రహం కాస్త తగ్గుమొహం పట్టింది.

"మళ్ళీ జ్వరం రాలేదు సింహాచలం! నేనీ పనుల్ని చూసుకోగలనంటే విన్నావు కాదు. అక్కడ వాడేమో నిన్నే కలవ రిస్తున్నాడు. ఇహనయినా ఈ పనులాపి త్వరగా ఇంటిమొహం పట్టు? నేనలా పేటదాకా వెళ్ళి రెండు గంటల్లో వస్తాను. డాక్టర్‌గారిని కూడా కలిసేవస్తాను. వెళ్ళే ముందా కనకయ్యగాడికేమయిందో చూసి మరీ వెళ్ళు!" అంటూ లారీ వంక అడుగు లేసేరాయన.

"కనకయ బావా! ఓ కనకయ్య బావా!" పిలిచేడు సింహాచలం, కాని వాడు కళ్ళు తెరవకపోవటంతో వాడి గుండెలపై చేయి వేసేడతను. ఆ వెంటనే ఓ బొండాన్నందు కుని ప్రక్కనే పడివున్న వంకీకత్తితో తొక్కని చెక్కి నీటిని వాడి మొహంపై చిలకరించేడు.

పాకలోంచి నలిగిన చీరని సద్దుకుంటూ కిలకిలా నవ్వుతూ యివతలికి వచ్చిన లచ్చి తోటలోని నిశ్శబ్దాన్ని భంగపరిచింది.

ాని వెనకాలే వెన్నువిరుచుకుంటూ యివతలికొచ్చిన పానకాలు, లారీవద్ద నుంచుని తమ వంకే చూస్తూన్న శేషాద్రి గారిని చూసి జడిసి ఓ అడుగు వెనక్కేసేడు.

శేషాద్రిగారికి విషయం బోధపడింది. ఇబ్బందిగా దృష్టిని కనకయ్యవంక మళ్ళించేరాయన.

స్పృహలోకి వచ్చిన కనకయ్య ఆయన వంక బేజారుగా చూస్తూ చేతుల్ని జోడించేడు. అది చూచి శేషాద్రిగారి గుండెలు క్షణం చలించేయి. దిగ్గున వెనుదిరిగి వెళ్ళి లారీ కేబిన్ తలుపు తెరిచి భళ్ళమంటూ మూసుకున్నారాయన

పానకాలు పరుగెత్తుకుని వచ్చేడు కేబిన్ తలుపు తీసి లోనికి చూట్టంతోనే వాడి గొంతారిపోయింది. ఎర్రగా వెలుగుతూన్న చుట్టని కసిగా కొరుకుతూ అతడి వంకే తీక్ష్ణంగా చూస్తున్నారు శేషాద్రి గారు వారి చూపుల్ని తప్పించుకోవటానికి కేదారీ తోచక గభాలున లోనికి దూకి లారీని ముందుకి దూకించేడు పానకాలు.

సింహాచలం కనకయ్యని లేవనెత్తేడు. వాడికేం జరిగిందో తెలియని లచ్చి నంగనాచిలా వచ్చి మొగుణ్ణి చూస్తూనే గొల్లుమంది.

నాలుగు వెదురుబద్దల్ని వాడి తొడకి నాలుగువేపులా అమర్చి, తోటంతా వెతికి తెచ్చిన ఆకుల్ని వాటి చుట్టూ పేర్చి త్రాటితో గట్టిగా బిగించేడు సింహాచలం. నలుగురు మనుషుల్ని పిలిచి సాయం పట్టించి వాణ్ణి పాకవంక వంపించేడు. మొగుడి వెనకాలే శోకాలు పెడుతూ వెళ్ళింది లచ్చి.

పరిసరాలు ప్రశాంతంగా మిగిలిపోయే సరికి సింహాచలం మనస్సు మళ్ళీ అల్లకల్లోలమయింది. "దేవుడికి ముడుపునెలా కట్టేది?" గొణుక్కోసాగేడతను. అలా గొణుక్కుంటూనే పనివాళ్ళని ఇళ్ళకు వెళ్ళండంటూ పురమాయించి రాసిపడిన కాయలకి హద్దునేర్పాటుచేసుకుని పాకలోని లచ్చినీ, కనకయ్యనీ వాటి కాపలాకి హెచ్చరించి ఇంటిమొహం పట్టేడు.

శేషాద్రిగారి భవంతి నిశ్శబ్దంగా వుంది. నడవాలో శేషాద్రిగారు పెంచుకుంటూన్న కుక్కపిల్ల ముడుచుకుని పడుకుని వుంది లోగిలిలో చాకలి రత్తి వేసివెళ్ళిన ముగ్గులోని పిండిని కోళ్ళు ఆత్రంగా మేస్తున్నాయి. దాపులోని పూలమొక్కల్ని మేస్తోన్న మేకపిల్లొకటి అలికిడి విని పరుగుదీసింది హాల్లో ఎదురుగా వున్న వాలుకుర్చీలో తెల్లపిల్లి మత్తుగా నిద్రపోతోంది.

సింహాచలం గదిలోకి అడుగువేయటం చూచి వెంకటేశుని వళ్ళోంచి దింపి లేచి నుంచుంది వంటమనిషి సీతాలు.

"నీ కెన్నిసార్లు చెప్పాలే సీతాలూ? వాణ్నలా దగ్గరికి తీసుకోవద్దని!"

"ఏటిసేసేది సిమ్మాచలం? ఆడి వొల్లు పేలిపోతావుండాది. ఎత్తుకుని కోకముక్కెట్టి యిసరతావుంటే కాస్త కునుకు పట్టింది!"

"నీ మొహం! అదేవిటో వాణ్ని ఆ మంచంలోనే వుంచి ఏడవరాదూ? సర్లే! యిహ వెళ్ళి నీ పని చూసుకో!"

తలాడిస్తూ కదిలివెళ్ళింది సీతాలు

తడిగుడ్డని చన్నీళ్ళలో ముంచి కొడుకు

నుదురు నద్దుతూ వుండిపోయేడు సింహాచలం. కట్టవలసిన దేవుడి ముడుపు విషయం జ్ఞాపకంరాగానే అతని గుండెలు బరువెక్కిపోయేయి. ఆ వెంటనే గతం అతని స్మృతిపథంలో మెదిలింది.

* * *

సింహాచలం బల్లకట్టుమీద వున్నాడంటే చాలు! రేవుని త్వరగా దాటొచ్చునని ఆ ప్రాంతంలో ప్రతీతి. ఓరోజు అదే బల్లకట్టుమీద వున్న శేషాద్రిగారికతని ప్రజ్ఞ ముచ్చటవేసింది అభినందించబోయి వెనుకాడి తోచక సింహాచలం ప్రక్కనే వున్న రెండేళ్ళ కుర్రాణ్ని గురించి ప్రశ్నించేరాయన. తల్లిలేని తన పిల్లవాడి గురించి అంతపెద్దమనిషీ పరామర్శించేసరికి సింహాచలం కరగిపోయేడు వారడక్కముందే తన గోడునంతా వారికి చెప్పుకుని సీరుకారిపోయేడు. అంతా విని దిగిపోయేముందిలా అని సమాధానాన్ని కూడా ఆశించకుండా చక్కాబోయేరు శేషాద్రిగారు

"మరిలా ఆ పసివాడితో ఈ బల్లకట్టు బ్రతుకెందుకోయి సింహాచలం? మా తోట కాపలాకి నాకో మనిషి కావాలి వచ్చెయ్!"

సింహాచలం ఆ విషయాని కాక్షణంలో అంత ప్రాముఖ్యాన్ని యివ్వలేకపోయేడు అతని కప్పట్లో బల్లకట్టుని వదిలే ఉద్దేశ్యమే లేదు పైగా ఆయన ఖచ్చితంగా చెప్పివెళ్ళినట్లూ లేదు కాని ఓరోజు బల్లకట్టు పైనుంచి దొర్లి సీటిలో పడిపోయి కొన ఊపిరితో బయటపడిన వెంకటేశుని చూడగానే అతనికా రేవుతో రుణం తీరిపోయింది.


సింహాచలం తమ లోగిల్లోకి అడుగుపెట్టటంతోనే హాల్లోని వాలుకుర్చీలో చేరగిలబడిపోయి యెర్రగా వెలుగుతోన్న చుట్టని కొరుకుతూన్న శేషాద్రిగారు చిరునవ్వు నవ్వేరు

"నీవు వస్తావని నాకు తెలుసోయి సింహాచలం! వెళ్ళు' వెళ్ళి మన తోటలో పాకవేసుకునుండు' అందుక్కావలసిన సరంజామా అంతా పానకాలు చేత జాబితా వేయించు!"

అంత త్వరగా తన కాశ్రయం లభిస్తుందనుకోలేదు సింహాచలం శేషాద్రిగారు కూడా భార్యా విహీనుడనీ, ఆయనకూ తనలాగే తల్లిలేని పసివాడొహడున్నాడనీ అపుడే తెలిసిందతనికి తన యిబ్బందిని అనుభవపూర్వకంగా అర్థం చేసుకుని తనకి ఆశ్రయాన్నిచ్చిన వారి అభిమానాన్ని పెంపొందించుకోవటమే తన ధ్యేయంగా భావించేడతను

దాంతో వున్న కొబ్బరి చెట్లు కాస్త నిగ్గుతేరి, కొత్త మొక్కలు నాటుకొని తోటంతా విస్తరించి క్రొత్తందాల్ని సంతరించుకుంటూ వస్తే, మరోవైపు ఆడదిక్కులేని శేషాద్రిగారింట ఆ లోపలే లేనట్లుగా వారిలోగ్గిల్లో కళ్ళాపి తడుస్తూ, రంగవల్లులు వెలుస్తూ వచ్చేయి అటు తోటనీ, యిటు ఇంటినీ, అటు చినబాబునీ కంటికి రెప్పల్లా కాపాడుకుంటూ వచ్చిన సింహాచలం అచిరకాలంలోనే శేషాద్రిగారి హృదయంలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకోగలిగేడు.

కాని విధి శేషాద్రిగారిని చిన్న చూపు చూచింది. చినబాబుకేదో గాలి సోకటంతో వాడి అస్వస్థత శృతిమించి శేషాద్రిగారిని మానసికంగా చిత్రవధ చేసింది మొదట్లో



తన భార్యనీ, యిపుడు తన కొడుకునీ తమనించి ఆ జాలిలేని దేవుడు వేరు చేయటానికి పూనుకున్నాడని వాపోయేరాయన. దాంతో యజమాని నా స్థితిలోవుంచి తను తోటలో వుంటం మనసొప్పక కనకయ్యని తోట కాపలాకి నియమించి తన మకాంని వారింటికే మార్చేడు సింహాచలం,

పదిరోజులు గడిచినా చినబాబు స్థితి మెరుగు పడలేదు పేటనుంచి పేరుమోసిన డాక్టరు గారు ప్రతిరోజూ వచ్చి వెడుతూనే వున్నాడు. మరో వైపు మంత్రాలనీ, పూజలనీ అన్ని తతంగాలూ లోప రహితంగా జరుగుతూనే వున్నాయి కాని ఫలితం మాత్రం కనిపించకపోవటంతో, పిల్లవాడి తాపాన్నీ, బాధనీ గమనిస్తూ అటు శేషాద్రిగారూ యిటు సింహాచలమూ తల్లడిల్లిపోయేరు

ఓ రోజు రాత్రి ఏ ప్రమేయమూ లేకుండానే సింహాచలం మనస్సులో మంగళగిరి స్వామి మెదిలేడు దాంతో శేషాద్రిగారి నా దేవుడికి ఓ వంద రూపాయల ముడుపు కట్టండంటూ కూచున్నాడతను.

కాని శేషాద్రిగారందులకు వ్యతిరేకించేరు. కొడుకు నా స్థితిలో చూస్తూన్న వారికి దేవుడిలో నమ్మకంపోయింది. దేవుడ సేవాడిపై ద్వేషాన్ని పెంచుకుంటూ వచ్చేరాయన సింహాచలం ఎంత బలవంతం చేసినా ఆయనందులకు అంగీకరించక పోవటమే కాకుండా అతనిపై విసుక్కున్నారాయన

"దేవుడూ లేడు! దైవమూ లేడు! మూడుపూ వద్దు! ముళ్లే వద్దు! నన్నాట్టే విసిగించకు! ఎలా జరగాల్సుంటే అలాగే జరుగుతుంది"

కాని సింహాచలానికి మాత్రం ఆ దేవుడి మీద నమ్మకం వుంది. చినబాబు పేర ముడుపు కడితే అతడికి తప్పక నయమవుతుందని అతని విశ్వాసం కాని అశక్తుడిగా వుండిపోయేడతను

సింహాచలం అలా దేవుడి మీద భక్తితో భయపడుతూ వుంటే శేషాద్రి

గారు విరక్తితో దినమంతా గడిపారు.

ఆ రాత్రే చినబాబు కీ ప్రపంచంతో రుణం తీరిపోయింది

* * *

మంచంలో వెంకటేశు కదిలేసరికి గతంలోంచి ప్రస్తుతంలోకి వచ్చేడు సింహాచలం తనకొడుకు వెంకటేశుకి కూడా చినబాబులాంటి గాలే సోకేసరికి అతని నవనాడులూ కృంగిపోయాయి. దేవుడు శేషాద్రిగారికి చేసిన అన్యాయం లాంటిదే యిపుడు తనకి కూడా చేయ కూడదనే భయం కలిపించిన కంగారులో ఆ దేవుణ్ణే స్మరిస్తూ అనాలోచితంగా నాలుగొందలయినా తెచ్చి ముడుపు కడతానని అనేసాడతను కాని ఆ అన్నాక తను పలికిన మొత్తం జ్ఞాపకం వచ్చేసరికి అతని గుండెలు బేజారెత్తిపోయేయి. కడతానన్న ముడుపుని వెంటనే కట్టక పోతే వెంకటేశుని తనకా దేవుడు దక్క నీయడేమోనన్న భయం సింహాచలాన్ని పదిహేను రోజులుగా చిత్రవధ చేస్తున్నది. అంత పెద్ద మొత్తాన్ని ఎలా సమకూర్చాలో అతనికి తెలిసిరావటంలేదు. శేషాద్రిగారరంత డబ్బు నందిస్తారన్న నమ్మకమూ లేదు. ఏ దారీ తోచక మనసులో చికాకునీ, గుండెల్లో మంగళగిరి స్వామిపై భయాన్నీ నింపుకుని సతమతమవుతున్నాడతను.

వీధిలో లారీ చప్పుడు వినిపించేసరికి సింహాచలం ఆలోచనలు పటాపంచలయ్యేవి. నిద్రలోకి జారిన వెంకటేశుకి దుప్పటిని సవరించి నడవాలోకి నడిచేడతను. లోగిలికోనుంచి హాల్లోకి అడుగుపెట్టబోయిన శేషాద్రిగారు వెనుదిరిగి చూచేరు.

"ఎలా వుంది?"

"నిద్రలో వున్నాడండి!"

"నిద్దరోతేనే మంచిదన్నారు డాక్టరుగారు తగ్గిపోతుందిలే సింహాచలం! కంగారుపడకు' ఆయన మందులేవో రాపిస్తే పట్టుకొచ్చాను. వాడు లేచాక వేయాలవి!" అంటూ తమ గదిలోకి వెళ్ళిపోయేరాయన.

సింహాచలం వంటగదివైపు నడిచేడు. సీతాలు కోడిగుడ్ల పులుసు చేస్తోంది కాబోలు, తొక్క తీసిన గుడ్లని గిన్నెలో వేసి కలుపుతోంది

"బాబుగా రొచ్చేరు త్వరగా కానివ్వు!" అంటూ స్నానంకోసం బావి వంక వెళ్ళేడు సింహాచలం.

రాత్రి తొమ్మిదయింది కొడుకుదగ్గరే కూచుని ముడుపు డబ్బుని గురించి తలని బ్రద్దలుకొట్టుకుంటోన్న సింహాచలాన్ని భోజనానికి కేకేసింది సీతాలు

తలెత్తేడు సింహాచలం. గడపలో నుంచునివున్న సీతాలు అప్పుడే స్నానం చేసినట్లుంది. సన్నగా తలని దువ్వుకుని వుంది బొట్టొకటే లోపం. నలభైఏళ్ళ సీతాలు, దీపం వెలుగులో ముప్పయిఏళ్ళ దానిలా కనిపిస్తోంది. దాని చీకటివేళ సింగారం అర్థంకాని సింహాచలం తన వంకలా చూస్తోంటే సీతాలు వింతగా చూచింది

"బాబుగారు భోంచేసారా సీతాలూ?"

"ఇంకాలేదు. సీసాముందెట్టుకూకొను న్నారు నన్నణ్ణం తెచ్చి ఆరి గదిలో పెట్ట



ల్లమన్నారు. మరి నువ్వొచ్చి కానీ!"

సింహాచలం లేచేడు. వెళ్ళి నాలుగు ముద్దలు మ్రింగి వచ్చి కొడుకు మంచం ప్రక్కనే పడకవేసేడు. ఆలోచనలత న్నింకా సతమతం చేస్తూనే వున్నాయి. వెంకటేశు నిద్రలో వుంటంతో మెద డతని ఆలోచనలకి ఆనకట్టవేసింది. సింహాచలం కూడా నిద్రలోకి జారి పోయేడు.

గోడగడియారం పన్నెండు సార్లు మ్రోగడంతో మేలుకున్నాడు సింహాచలం. కొడుకువంక చూడటంతోనే అతని నోట తడారిపోయింది. జ్వర మైకంలో మంచంలో ఎగిరిపడుతూన్నాడు వెంక టేశు. వాడి వొళ్ళు ముట్టుకుని చూచే డతను. కంచులా కాలిపోతోందది. తండ్రి స్పర్శకి కళ్ళు తెరిచి మంచినీళ్ళు కావా లన్నట్టుగా చూచేడా పసివాడు.

సింహాచలం గుండెల్లో రైళ్ళు పరుగు దీయటం ప్రారంభించేయి. దిగ్గున లేచి పోయి గ్లాసుని బిందెలో ముంచబోతూం డగా అతనికి శేషాద్రిగారు చెప్పిన మందుల విషయం జ్ఞాపకం వచ్చింది. వెంకటేశు గొంతుని తడిపి దుప్పటిని సవరించి నడవాలోకి వచ్చేడతను.

శేషాద్రిగారి గది దాపులోకి రాగానే సింహాచలం ఆగిపోయేడు. గదిలో గాజులు గలగల్లాడుతూంటం వినిపించటంతో ఆశ్చర్యపోయేడతను. ఆసక్తిగా కిటికీ సందుల్లోంచి చూచిన అతని వదనం పాలి పోయింది.

గదిలో శేషాద్రిగారి నోటిలో చుట్ట ఎర్రగా వెలుగుతోంది. వారి దృష్టి తమ కెదురుగా నుంచుని చీరని విప్పి పోగు పెడుతోన్న సీతాలుపైన వుంది.

గిర్రున వెనుదిరిగేడు సింహాచలం.

అంతక్రితం సీతాలు చేసుకున్న సింగార మెందుకో తెలిసివచ్చిందతనికి. గత సాయంకాలం తోటలోని లచ్చి వ్యవహారాన్ని చూడగానే శేషాద్రిగారిలో కూడా పురుగు దూరిందన్నమాట! ఆయనకి వత్తాసుగా అందుబాటులో ఈ విధవ సీతాలు జతకూడింది దిక్కూ మొక్కూ లేకుండా వీధులంటా పనిపాటా లేకుండా తిరుగుతూంటే తను వంటమనిషిని చేసిన వెధవ ముండ! సీతాలుకి కూడా పొగరెక్కినట్లుంది అనుకుంటూ తన గదిలోకి తిరిగి వచ్చేడతను

గదిలోకి అడుగిడటంతోనే సింహాచలం గుండెలు కూడా మంచంలోని వెంకటేశుకిమల్లే ఎగిరిపడసాగేయి ఉలికిపడుతూన్న కొడుకు దీనవదనాన్ని చూస్తూనే అతని నయనాలార్ద్రాలయ్యేయి

"ఎలా? ఎలా? ఏం చేయను? ఈ ముడుపునెలా కట్టను?" తలని అరచేతుల్లోకి జార్చేడతను మనసులో మంగళగిరి స్వామి ఉగ్రస్వరూపం విలయంతాండవం చేస్తూంటే మరోప్రక్క తాపంతో ఎగిసిపడుతూన్న వెంకటేశు ఉష్ణశరీరం అతడి హృదయాన్ని కలచివేస్తోంది

తరవాత అరగంటసేపు అతనెంత ప్రయత్నంచేసినా వెంకటేశు జ్వరం తగ్గుముఖం పట్టలేదు "బాబుగారు తెచ్చిన మందులు వేస్తేనన్నా తెరిపిస్తుందేమో?" అనుకుంటూ అనాలోచితంగానే నడవాలోకి వచ్చేడు సింహాచలం కాని యింకా శేషాద్రిగారి గదిలో వినిపిస్తూన్న సీతాలు అలికిడి అతని అడుగుని ముందుకి వేయనీయలేకపోయింది గాఢంగా నిట్టూరుస్తూ వెనుదిరిగేడతను.

"అయినా ఈ మందులేం పని చేస్తాయి? చినబాబు నేమందులాపగలిగేయి? స్వామికి ముడుపుకట్టాలేకాని వెంకటేశు బట్టకట్టకమానడు!" అనుకుంటూ శేషాద్రిగారి ఆనందానికి అంతరాయం కలిగించలేక గదిలోకి అడుగువేసిన అతని వొంటిపై తేళ్ళూజెర్రులూ పాకినట్లయింది. హఠాత్తుగా వెంకటేశులో తాపం అధికమయినట్లు తోచగానే సింహాచలం బెంబేలెత్తిపోయేడు కంగారుతో శేషాద్రిగారిని కేకేయబోయి అతి కష్టంగా ఆ ప్రయత్నాన్ని మానుకున్నాడతను.

చేసేదేమీలేక మళ్ళీ తడిగుడ్డని వాడి నుదుటవేసి విసురుతూ కూచునిపోయేడు ఉన్నట్లుండి వెంకటేశులో కలవరింతలు ప్రారంభమయ్యేయి. దాంతో సింహాచలానికి చెమటలు పట్టసాగేయి.

మరో అరగంట గడిచింది. వెలుపల తొలికోడి కూసింది. కొడుకులో తాపం అధికమవుతూవుండటంతో యిహ ఉపేక్షించలేకపోయేడు సింహాచలం అతనికి శేషాద్రిగారు జ్ఞాపకం వచ్చేరు వారి వెంటే వారి గదిలోని సీతాలూ, సీతాలుని గురించి ఆలోచించగానే లచ్చీ, లచ్చి వెంటే కొబ్బరితోటా, కొబ్బరితోటలోని రాసిపడివున్న బొండాంల గుట్టా! దానికి తాను పెట్టుకుని వచ్చిన హద్దూ అన్నీ వరుసగా అతని స్మృతిపథంలో కదిలి వెళ్ళేయి.

"స్వామీ? నా కొడుకుని కాపాడు! నన్నన్యాయం చేయకు! నేనిపుడే వెళ్ళి నీ పేర ముడుపుని కట్టే ప్రయత్నం



చేస్తాను!" అంటూ రెండు చేతులూ ఎత్తి మంగళగిరి స్వామిని మనసారా వేడుకున్నాడు సింహాచలం

ఆ తర్వాత ఆ దేవుడి మహిమవల్లనో లేదా సింహాచలం రెండు గంటలనుంచి తడిగుడ్డతో పడిన శ్రమవల్లనో వెంకటేశుకి జ్వరం కాస్త జారినట్లయింది. ఎగిసిపడటం ఆగిపోయి నిద్రలోకి జారేడు. సింహాచలానికా సమయంలో మంగళగిరి స్వామిపై ఎనలేని గురి ఏర్పడింది. త్వరపడ్డాడతను. వెంకటేశుకి దుప్పటిని సవరించి గది తలుపుని చేరగిలవేసి నడవాలోకి అడుగువేసేడు. వెలుపల పుష్యమాసపు చలిగాలి స్వైరవిహారం చేస్తోంది

అపుడే శేషాద్రిగారి గదిలోనుంచి యివతలికి వచ్చిన సీతాలు, తనపైన పది మణువుల బరువున్నదానిలా అడుగులో అడుగు వేసుకుంటూ నడవాని దాటి వెనుక పెరట్లోనున్న తన పాకపైపు వెడుతోంది

సింహాచలం నడిచేడు. కొబ్బరితోటలోకి రాగానే ముందు పాకదగ్గరికెళ్ళి తలుపుసందుల్లోంచి చూచేడు లోనికి.

చీకటిలో చిరుదీపం వెలుగుతోంది. ఆ వెలుగులో పాకలోని మంచంలో వంటరిగా వున్న కనకయ్య చేతిలోని చిన్న గుడ్డమూటతో ఏ దేవుడికో మొక్కుతూ కనిపించేడు

"కనకయ్యా!" పిలుస్తూనే తలుపుని తోసేడు సింహాచలం.

"ఓ నువ్వా బావా? రా! రా! నీసేతి సలువన నాకాలు నొప్పి తగ్గుతే బతికినంత కాలమూ నిన్ను నా గుండెల్లో దాచుకుంటాను. వెంకటేసుకెట్లా వుండాది? అన్నట్లు ఆడి నొదిలేసి యింత సందెటాళే ఎందుకొచ్చినట్లూ?"

"వాడికిపుడే కునుకు పట్టింది. లారీని అర్జెంటుగా పేటకి పంపాల్సిన పనుండి పచ్చాను కానీ చేతిలో ఏమిటా మూట"? అన్యమనస్కంగానే ప్రశ్నించేడు సింహాచలం

కనకయ్య సిగ్గుపడి పోయేడు

"నీ దగ్గర దాపరికవే వుండాది బావా? అపుడు సెట్టుమీంచి పడితేనేగద నా మగతనం పోయింది? యిపుడు రెండోతూరి పడ్డా! ఆ పోయింది తిరిగి రావాలని మొక్కుకుని దేవుడికి ముడుపు కట్టా!" అంటూ పాకలోని గోరంత దీపం వంక చూస్తూన్న కనకయ్య కళ్ళలో ఆశాదీపాలు మిణుకు మిణుకు మంటూ వుండటాన్ని గమనించేడు సింహాచలం.

"ముడు పే దేవుడికి కట్టేవ్?"

"సిన తిరపతి సామికి!"

"మంగళగిరి సామికి కాదు కదా? అయితే నీ కోరిక తీరుతుందిలే కనకయ బావా' యింతకీ లచ్చేది?"

అది వింటంతోనే కనకయ్య మొహం పాలిపోయింది అతను తలొంచుకోవటం చూచి విషయాన్ని గ్రహించి తలుపువంక నడిచేడు సింహాచలం,

తోటలోని మసక చీకట్లో ఆగివున్న లారీ లీలగా కనిపిస్తోంది. కేబిన్‌లో పానకాలు పీలుస్తోన్న బీడీనిప్పు రవ్వ ఎర్రగా మెరుస్తూండకం చూచి ఆ వంక నడిచేడు సింహాచలం

"మరి నాతో మా ఊరు రావటానికి నీ కిష్టమే కదా?" పానకాలు గొంతు వినిపించింది.

తను సమాధానం చెప్పకముందే కేబిన్ తలుపు తెరుచుకోవటంతో పానకాలు వొళ్ళోంచి ఉలికిపడి లేచింది లచ్చి. ఎదురుగా సింహాచలాన్ని చూస్తూనే తెల్లబోయి వణికిపోతూ లారీ దిగిపోయి పాక వంక పరుగుదీసింది

"పానకాలూ! మూట'" అంటూ గత సాయంకాలం లారీతో శేషాద్రిగారు వెళ్ళాక రాసి పడిన బొండాల గుట్టవంక నడిచేడు సింహాచలం

రెండు నిముషాలపాటు సింహాచలం చెప్పిందేమిటో పానకాలు చెవికెక్కలేదు వాడు విన్నదల్లా లారీని తీసుకువెళ్ళి పేటలోని షాహుకారుకు సరుకునప్పగించి డబ్బును తేవటం మాత్రమే! వాడి బుర్ర నిండా లచ్చిని లేవదీసుకు పోవాలన్న ఆలోచనొక్కటే నిండి వుందా సమయంలో

ఇరువురూ కలిసి రాసిపడివున్న కాయల్లోని సగభాగాన్ని లారీలో నింపేరు ఆ పని జరుగుతున్నంత సేపూ వారి మనసులు వారి ఆధీనంలో లేవు పానకాలు గుండెనిండా లచ్చి దేవత్తై నిలిచిపోతే సింహాచలం గుండెలనిండా మంగళగిరి స్వామి గర్జిస్తూ నిలిచిపోయేడు.

లారీ కదిలి వెళ్ళగానే సింహాచలానికి భయంతో చలి ముంచుకువచ్చింది చీకటిలో ఏమీ తోచక పాకవంక నడిచేడు

లోనికొస్తోన్న సింహాచలాన్ని చూస్తూనే లచ్చి బిగుసుకుపోయి గోడనానుకు నుంచునిపోయింది

సింహాచలం తన మనస్సుని అదుపులోకి తెచ్చుకోగలిగేడు

"లచ్చీ? కనకయ్య మళ్ళీ చెట్టుపైనుంచిపడి పోయాడు. వాడి మగతనం వాడికి తిరిగి వస్తుంది తొందరపడి ఆ

పానకాలుని నమ్మి వెళ్ళిపోకు!"

లచ్చి బుర్రలో బాణాసంచా ప్రేలింది. కన్ను మలిగిన కనకయ్య వారి సంభాషణని ఆలకించలేదు.

ప్రక్కకి రెండడుగులు వేసి తలుపు వెనకాల వున్న పుల్లల్లోంచి పట్టెడన్ని అందుకుని వెలుపలికి వెళ్ళి చలిమంట వేసేడు సింహాచలం. ఆ మంటలవీ ఏవీ లేకుండానే పాకలోని లచ్చిబుర్ర వేడెక్కిపోసాగింది.

తూరుపు తెల్లవారకముందే లారీ తిరిగి వచ్చింది. పానకాలు ఓనోట్ల కట్టని సింహాచలాని కందించేడు.

"పానకాలూ జాగ్రత్త! ఈ విషయం మూడో మనిషికి తెలియనీయవద్దు! ముఖ్యంగా బాబుగారికి! యింద!" అంటూ కొన్ని నోట్లని వాడి చేతిలో కుక్కేడు సింహాచలం,

"నువ్వంతగా సెప్పాలా సిమ్మాసలం! కాని డబ్బు లెక్క చూచుకో!" అంటూ తన వాటా డబ్బుని జేబులో త్రోసుకుని బీడీ వెలిగించుకుంటూ పాకవంక చూచేడు పానకాలు.

తలుపుని త్రోసి గదిలోకి అడుగు పెడుతూనే వెంకటేశు వంక చూశాడు సింహాచలం. కొడి గట్టిన దీపం వత్తుల్లా వెంకటేశు గాజు కళ్ళు గదిలోని దీపం వెలుగులో మెరుస్తూన్నాయి. వాడు తండ్రి వంక బేలగా చూస్తూ ఏదో గొణిగేడు. వాడి గొంతు గర! గర! మనట వొక్కటే వినిపించింది సింహాచానికి.

మూలనున్న తన రేకు పెట్టె వైపు నడిచేడు సింహాచలం, పెట్టెని తెరిచి తాను వెంకటేశు చొక్కా కోసం కొని వుంచిన కొత్తగుడ్డల్లోంచి యింత ముక్కని బర్రు! మంటూ చింపేడు. తెచ్చిన నోట్లన్ని దాంట్లో కుక్కి ముడి వేస్తూ గోడకి తగిలించివున్న మంగళగిరి స్వామి పటం వంక నడిచేడు.

అంతదాకా తండ్రి ఏవైపు వెడితే అతికష్టంగా తలని త్రిప్పుతూ చూస్తూ వచ్చిన వెంకటేశు కళ్ళు సింహాచలం తన దగ్గరకు రాగానే క్షణం మెరిసేయి.

వాడి రెండు చేతుల్నీ ఎత్తి ముడుపు మూటని వాడి దోసిట వుంచి, అరమోడ్పు కనులతో మోకరిల్లి మంగళగిరి స్వామిని మననం చేసేడు సింహాచలం. కాని క్షణం తర్వాత కళ్ళు తెరిచి కొడుకు వంక చూచి గావు కేక వేసేడతను.

వెంకటేశు కళ్ళు తేలిపోయివున్నాయి. వాడి చిన్ననోరు తెరిచుకుని వుంది. ముడుపు గుడ్డవున్న దోసిలి బిగుసుకుపోసాగింది.

శేషాద్రిగారు గదిలోకి పరుగెత్తుకు వచ్చి నిశ్చేష్టులై నిలిచిపోయేరు.

ఆయన్ని కన్నీటి తెరలమధ్య చూస్తూ బావురుమన్నాడు సింహాచలం.

"బాబుగారూ! దొంగతనం చేసి కూడా ..." అంటూన్న సింహాచలానికి దగ్గుత్తిక పడిపోయింది. వెంకటేశు శరీరాన్ని మంచంలోంచి నేలకు దింపబోతూండగా వాడి దోసిలినుంచి జారిన ముడుపుమూట నేలమీద పడిపోయి దొర్లుతూ వెళ్ళి శేషాద్రిగారి పాదాలనంటి ఆగిపోయింది.

తెరిచివున్న తలుపుగుండా చలిగాలి రయ్‌మంటూ వీచింది. గదిలోని చిరుదీపం గాలికి అల్లల్లాడుతూ ఆరిపోయింది. ***

పురోగమిస్తోన్న ఆంధ్ర ప్రదేశ్
పరిశ్రమలలో పెట్టుబడి పెట్టడానికి
ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను
ఆహ్వానిస్తోంది.

వెనుక బడిన ప్రాంతాలలో ప్రోత్సాహాలు కల్పిస్తున్నది. 89 పంచాయితీ సమితులలో 15 శాతం కేంద్ర సబ్సిడీ, ఆరు సూత్రాల పథకం క్రింద అన్ని తాలూకాలలో 10 శాతం రాష్ట్ర పెట్టుబడి సబ్సిడీ, అన్ని గిరిజన, ఏజన్సీ ప్రాంతాలలో 20 శాతం రాష్ట్ర పెట్టుబడి సబ్సిడీ, దానికి తోడు పైన పేర్కొన్న ప్రాంతాలలో నిర్దిష్ట పెట్టుబడి ధనంపై 10 శాతం వడ్డీలేని అమ్మకం పన్ను రుణం.

ఒక్క మాటలో చెప్పాలంటే, హైదరాబాదు జంటనగరాలు, విశాఖపట్నం, విజయవాడ మినహా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు రాష్ట్ర సబ్సిడీ గానీ, కేంద్ర సబ్సిడీ గానీ, అమ్మకం పన్ను రుణం గానీ లభిస్తున్నది.

ఈ విధంగా మన రాష్ట్రంలో ఎన్నో అపూర్వ అవకాశాలు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఆకర్షిస్తున్నాయి

డైరెక్టరు,
సమాచార, పౌరసంబంధశాఖ,
ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం, హైదరాబాదు.

తీర్పు

నిరంజన్

కోర్టు హాలు లాయర్లతోనూ, ప్రేక్షకుల తోనూ క్రిక్కిరిసి వుంది గుసగుసలు రణగొణ ధ్వని చెలరేగుతున్నాయి. పబ్లిక్ ప్రాసిక్యూటర్, డిఫెన్స్‌లాయరు, మిగతా అందరూ జడ్జీగారి రాకకు ఎదురు చూస్తున్నారు గోడగడియారం పదకొండు గంటలు కొట్టింది.

జడ్జి ధర్మరాజు కోర్టులోకి ప్రవేశించారు డవాలు బంట్రోతు కఱ్ఱ సుత్తితో టేబుల్ మీద కొడుతూ "ఆర్డర్ ఆర్డర్ " అన్నాడు. కోర్టు హాలును నిశ్శబ్దత ఆవరించింది.

ఇద్దరు పోలీసులు వెంటరాగా ముద్దాయి రాజశేఖరం బోనులోకి ప్రవేశించాడు. అతని వయస్సు ముప్పయి సంవత్సరాలుంటుంది. సన్నటి మనిషి కోలముఖం చప్పదవడలు దట్టంగా పెరిగిన గెడ్డం. చెదిరిన క్రాపు. నలిగిన దుస్తులు నిరాశా, నిస్పృహలు గూడుకట్టుకున్న కళ్ళు. దైన్యత నిండిన ముఖం. రాజశేఖరాన్ని చూసిన ఎవరైనా అతను హత్య చేశాడంటే నమ్మలేరు.

రాజశేఖరం మీద అతను తన భార్య రాధను హత్య చేశాడనే అభియోగం మోపబడింది ప్రత్యక్షసాక్ష్యాలు లేకపోయినా, హేతువాదం, సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్ దృష్ట్యా. రాజశేఖరం, రాధను హత్యచేశాడని వెనుకటి దినం పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించి నిరూపించారు. కానీ హతురాలు రాధ శవం మాత్రం దొరకలేదు

"మిస్టర్ రావ్! యుకెన్ ప్రొసీడ్ ." అన్నారు ధర్మరాజు డిఫెన్స్ లాయరు రంగారావు వంకచూస్తూ

రంగారావు కుర్చీలోంచి లేచాడు జడ్జి వంక చూసి చిన్నగా నవ్వాడు. వారిరువురూ లయన్స్ క్లబ్‌లో మెంబర్లు. తరచు కలుసుకునే వారు. రంగారావు క్రిమినల్ లాయర్‌గా పేరుగాంచినవ్యక్తి. ఇంతవరకూ తను చేపట్టిన ఏ కేసులోనూ అపజయం అన్నది ఎరుగడతను అతని ప్రజ్ఞా పటిమలు, వాదన సాటిలేనివి. ధర్మరాజుకు, రంగారావంటే ఒక ప్రత్యేకాభిమానం

రంగారావు తన నల్లగౌను సవరించుకున్నాడు. ముద్దాయివంక, జూరీ సభ్యుల వంక, ప్రేక్షకులవంక పరిశీలనగా చూశాడు గొంతు సరిచేసుకుని తన వాదన ప్రారంభించాడు

"మైలార్డ్! అండ్ ది జంటిల్‌మెన్ ఆఫ్ జ్యూరీ! ఈ కేసులో ప్రాసిక్యూషన్ వారు మరుగు పరచిన కొన్ని ముఖ్యాంశాలను కోర్టువారికి మనవిచేస్తాను ముద్దాయి రాజశేఖరం ఈ నగరంలోని గౌరవనీయ

వ్యక్తులలో ఒకరు. ఆస్తి, అంతస్తు, ఐశ్వర్యము, హోదా కలవారు. సభ్యత, సంస్కారము తెలిసిన వారు. ఉన్నత సాంప్రదాయ కుటుంబంలో పుట్టినవారు. చదువుకున్నవారు. రాజశేఖరం, శ్రీమతి రాధను ప్రేమించి పెళ్ళి చేసుకున్నారు. వారి దాంపత్యం అన్యోన్యమైనది. అనురాగంతో నిండినది. వారి మధ్య పొరపొచ్చాలు, అరమరికలు లేవు. ఈ విషయాలన్నిటికి ప్రత్యక్ష సాక్ష్యాధారాలు వున్నాయి. కాకపోతే చిన్నచిన్న మనస్పర్ధలన్నవి ప్రతి కుటుంబంలోనూ సహజం. ఆ సమయంలో పరస్పరం దూషించుకోవటం పరిపాటి. అలాంటి సంఘటనలను ఆధారం చేసుకుని—రాజశేఖరం తన భార్య శీలాన్ని శంకించి ఆమెను హత్య చేశాడనటం అసమంజసం. అసంబద్ధం. పైగా రాజశేఖరం ఈ హత్య చేస్తుండగా చూసిన వ్యక్తులు లేరు. అన్నిటిని మించి శ్రీమతి రాధ శవం ఇంత వరకూ దొరకలేదు. ఒకవ్యక్తి, కొన్ని రోజులుగా కనిపించనంత మాత్రాన—ఆ వ్యక్తి హత్య చెయ్యబడ్డట్టు భావించటం మిక్కిలి హాస్యాస్పదం. నిజం చెప్పాలంటే— శ్రీమతి రాధ అసలు మరణించనేలేదు... ఆమె బ్రతికేవుంది " అని ఆగి, డ్రమెటిక్‌గా కోర్టు గుమ్మంవైపు చూశాడు రంగారావు.

"యువర్ ఆనర్! రాధ సజీవంగా వుంది. కోర్టులోకి ప్రవేశించటానికి మీ అనుమతికై గుమ్మం వద్ద వేచి వుంది. చూడండి యువరానర్ . చూడండి ." అంటూ గుమ్మం వైపు వేలుపెట్టి చూపించాడు.

ధర్మరాజు, జూరీ సభ్యులు, లాయర్లు, ప్రేక్షకులు కోర్టు గుమ్మంవైపు ఆత్రంగా చూశారు. కానీ అక్కడెవరూ లేరు. డిఫెన్స్‌లాయరు ఏ ప్రయోజనం ఆశించి ఆ అబద్ధం ఆడాడో, ఎవరికీ అర్ధంకాలేదు.

ధర్మరాజు రంగారావు ముఖంలోకి చూశారు.రంగారావు గంభీరంగా నవ్వాడు.

"మైలార్డ్! ఈ కోర్టులోని వారందరూ శ్రీమతి రాధ—మరణించలేదని, సజీవంగా వుందని భావిస్తున్నారు. అందుకే ఆమె గుమ్మంవద్ద వుందనగానే, అందరూ అటువైపు చూశారు. ఈ విషయం కోర్టువారి దృష్టికి తేవాలనే— నేనీ అబద్ధం ఆడాను. ముద్దాయి రాజశేఖరం అమాయకుడని, నిరపరాధి అని అందరూ భావిస్తున్నారు. అందుకని 'బెనిఫిట్ ఆఫ్ డౌట్' మీద ముద్దాయి రాజశేఖరాన్ని నిర్దోషిగా భావించి విడుదల చేయవలసిందిగా కోరుతున్నాను " అంటూ తన వాదాన్ని ముగించి కుర్చీలో కూర్చున్నాడు రంగారావు.

ధర్మరాజు జూరీ సభ్యులవంకచూశారు. వారు పరస్పర సంప్రదింపుల అనంతరం "రాజశేఖరం నిరపరాధి అని మేము భావిస్తున్నాము .." అని తమ ఏకగ్రీవాభిప్రాయాన్ని తెలియజేశారు. కోర్టుహాలులోని ప్రేక్షకులు తీర్పు వినటానికి ఆత్రంగా ఎదురు చూడసాగారు. ముద్దాయి విడుదల చేయబడతాడని చాలామంది భావించారు.

"ముద్దాయి రాజశేఖరం తన భార్య శ్రీమతి రాధను హత్య చేశాడని నమ్ముతూ అతన్ని నేరస్థుడిగా భావిస్తూ ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ 302 ప్రకారం ముద్దాయికి యావజ్జీవ కారాగార శిక్ష

విధిస్తున్నాను...." అంటూ తన తీర్పు తెలియజేశారు ధర్మరాజు.

ధర్మరాజు తీర్పు రాజశేఖరాన్ని, జూరీ సభ్యులను, లాయర్లను, ప్రేక్షకులను, రంగారావును ఆశ్చర్యాంబుధిలో ముంచెత్తింది. ధర్మరాజు ఏ కారణంగా రాజశేఖరం రాధను హత్యచేశాడనే నిర్ణయానికి వచ్చాడో ఎవరికీ అర్థంకాలేదు.

జడ్జి నిష్క్రమించారు. ప్రాసిక్యూటర్ విజయగర్వంతో తన జూనియర్లతో కోర్టు బయటకు వెళ్ళాడు. ప్రేక్షకులు తలో రకంగా మాట్లాడుకుంటూ బయటకు నడచారు. కోర్టు హాలు నెమ్మది-నెమ్మదిగా ఖాళీ అవసాగింది.

రంగారావు కారుపార్క్ వద్దకు వచ్చాడు. ధర్మరాజు తనకారులో కూర్చొని యింటికి వెళ్ళటానికి సిద్ధంగా వున్నాడు.

ధర్మరాజు కారువద్దకు వెళ్లాడు రంగారావు.


"సార్! .మీ తీర్పు సమంజసంగా లేదు" అన్నాడు రంగారావు నిష్ఠూరంగా.

"ఏం? .ఎందుకు? " ప్రశ్నించాడు ధర్మరాజు.

"రాధ-కోర్టు గుమ్మంవద్ద వుందని నేనన్నప్పుడు కోర్టులోని ప్రతి ఒక్కరూ అటువైపు చూశారు. వారంతా రాధ మరణించలేదని సజీవంగా వుందని భావించారు. రాజశేఖరం నిరాపరాధి అని నమ్మారు. అలాంటప్పుడు మీరు మాత్రం అతనే ఈ హత్య చేశాడనే నిర్ణయానికి ఎందు కొచ్చారు?"

"అవును. నిజమే. కోర్టులోని ప్రతి వ్యక్తి రాధ మరణించ లేదనే భావనతోనే మీ మాటలు విని గుమ్మం వంక చూశారు. అందరూ రాజశేఖరం నిర్దోషి అని నమ్మారు. కాదనను. కానీ రాజశేఖరం మాత్రం వంచిన తల ఎత్తలేదు. గుమ్మం వైపు చూడలేదు. అతనికి ఆ అవసరం కలుగలేదు. అతనికి రాధ మరణించిందని దృఢంగా తెలుసు. కారణం అతను రాధను హత్యచేశాడు...." గంభీరంగా నవ్వుతూ అన్నారు ధర్మరాజు.

• ధర్మరాజు మాటల్లోని నగ్న సత్యాన్ని కాదనే ధైర్యం లేకపోయింది రంగారావుకు. అపజయం ఎరుగని లాయరు రంగారావుకు ధర్మరాజు 'తీర్పు'తో అంగీకరించక తప్పలేదు. ***



జైమంగళా

ఎ. శ్యామలారాణి

చివరి భాగం

; దుంధుభులు మ్రోగేలా ఓ ప్రక్క పెళ్ళి జరిగిపోతూంది. మంగళ కళ్ళు ్రరాని ఆత్రంతో ఇంకా నలుదెసలా ుకుతూనే ఉన్నాయి.

'సుముహూర్తం వేళకయినా రాజు) తీరాలి!' అంటున్నాడు చౌదరి, గా మంగళ నోకంట కనిపెడుతూ. ికి చౌదరంటే ఎనలేని గౌరవాభిమా ం. తన కోసం కాకపోయినా. చౌదరి ుపుని గౌరవించటానికయినా రాజు) తీరుతాడని ఏదో పిచ్చినమ్మకముంది ంగళకి, కూడా. చౌదరి కూడా అదే తో ఉన్నాడు.

పెళ్ళి జరిగిపోయింది. రాజు రాలేదు. క్రమ క్రమంగా మంగళకి అదోరకం ఏమావరించటం ప్రారంభించింది. తన ాన్ని ఎవరితో చెప్పుకోవాలి? ఏం య్యాలి? రాజుకోసం తను పిచ్చిదవు ందని నలుగురూ అనుకుంటారేమో ్ల అభిమానం ఓ ప్రక్క అడ్డొస్తోంది.

'రాజెక్కడున్నాడో గోవిందుకి తెలుసు ! పోనీ ఎవరినైనా పంపి ఓసారి చూసి రమ్మంటే?'

'ముఖం చెల్లక రానివాళ్ళకోసం ఎందుకు మంగళా నీకింత ఆత్రం?' అనే అంటాడు పుల్ల విరుపుగా. తనప్పుడు పట్టుపడిపోతుంది. అడక్కూడదు. కాని, రాజుకేమైనా ప్రమాదం జరిగి ఉంటే? అనుకుంటూంటే కాళ్ళ క్రింద భూమి కదిలిపోతున్నట్లుంది.

ఈ అంతర్ఘోష నెవరితోనూ చెప్పుకోలేక, కలివిడిగా అందరితో పాటు తిరగలేక, నలిగిపోతూంది మంగళ.

ఆ అవస్థలో సాయంకాలంనుండి సుబ్బారావు తన వెంట వెంటే తిరుగుతూ తన దృష్టి నాకర్షించడానికి పడరానిపాట్లు పడుతున్నాడని మంగళ గ్రహించలేదు.

ఆ సంగతి గ్రహింపుకి రాకపోయేసరికి ఇంచుమించు అర్ధరాత్రి అయింది. పందిట్లో సందడిలేదు. పనివాళ్ళు, భజంత్రీల వాళ్ళు, వంటవాళ్ళు అక్కడా అక్కడా. పడుకుని ఉన్నారు. ఎక్కడా సవ్వడి లేదు. సంగీతం లేని మూగ నృత్యంలా రంగు రంగుల బల్బుల తోర

ణాలు మాత్రం కనుసైగలు చేస్తున్నట్లుగా వెలిగి, ఆరి, వెలుగుతున్నాయి.

అంతసేపూ ఏదో హడావిడిలో ఉన్నట్లు ఊరికే అదే పనిగా తిరుగుతున్న మంగళ కాళ్ళకి నీరసమావరించి టక్కున ఆగిపోయి, చుట్టూ చూసింది. తనకు క్నొద్ది అడుగుల వెనుకగా పందిరి గుంజ కాను కుని షోగ్గా నిలబడి వున్నాడు సుబ్బారావు.

"అరె, చాలా రాత్రయిందే, ఇంటికి వెళ్ళలేదా?"

"లేదు,మంగళా! అంతా నిద్రావస్థలో ఉన్నారు. వక్కర్తవే మేలుకున్నావని, కాస్త తోడుగా ఉందామని—" నసుగుడుగా అన్నాడు సుబ్బారావు. 'తోడుగా' అన్నప్పుడు ఆమెకు వీలయినంత సమీపంగా వచ్చి కళ్ళలోకి సూటిగా చూసేడు.

సుబ్బన్న కింత ధైర్యం ఎప్పుడొచ్చిందానని విస్తుబోతూ అట్టే చూస్తూ నిలబడింది మంగళ. దానితో అతనికి మరి కాస్త సులువు దొరికింది.

"మంగళా! గుర్తుందా? చిన్నప్పుడు మనం సర్వమంగళాదేవి గుడిముందాడుకునే రోజుల్లో ఎంత సరదాగా ఉండేవాళ్ళమో! రాజు నిన్ను'మగరాయుడి'వని వెక్కిరిస్తూ నీ జట్టు వదిలేసినప్పుడు నేనే నీకు తోడుగా ఉండేవాడిని. జ్ఞాపకముందా?"సుబ్బారావు మరికాస్త చనువుగా ఓ అడుగు ముందుకేసి'అయ్యో పురుగు;' అంటూ పురుగు తోలే నెపంతో మంగళ భుజంమీద చెయ్యి వేసాడు.

మంగళకి వంటిమీద తేళ్ళూ,జెర్రులూ ప్రాకినట్లయింది.

"అవును—జ్ఞాపకముంది. నీకూ గుర్తుందా? నువ్వు పందికొక్కు పనులు చేస్తుంటే రాజు, గోవిందు కలసి నిన్ను చితక తంతున్నప్పుడు నేనే వచ్చి విడిపించేదాన్ని. అందుకే రాజు నన్ను 'మగరాయు'డనేవాడు. రక్షణకోసం నువ్వెప్పుడూ నా వెనుకవెనుకనే తిరిగేవాడివి!" తీక్షణంగా చూసి అదోలా నవ్వింది మంగళ.

ఆ రోజులు గుర్తుచేసుకుని ఇక లాభం లేదని బోధపడింది సుబ్బారావుకి. అయినా తండ్రి కిచ్చిన మాటప్రకారం ఏదో విధాన మంగళను వశపరచుకోవాలి!

"అయ్యో పిచ్చిబావా! ఏదో చిన్నప్పటి సంగతి జ్ఞాపకం చేసినందుకే ఇంత భయపడిపోతున్నావే! ఏం ఫరవాలేదులే! అప్పుడే కాదు, ఇప్పుడైనా సరే నీకలాంటి కష్టమొస్తే నేనూరుకుంటానా?" అంది మంగళ మళ్ళీ నవ్వుతూ.

సుబ్బారావు ప్లేటు ఫిరాయిస్తేగాని లాభం లేదనుకున్నాడు. "మొత్తానికి గట్టిదానివే మంగళా!" అంటూ తనూ శృతి గలిపి నవ్వేడు.

కాసేపు పోయాక "మంగళా! నేనింత కాలం పెళ్ళెందుకు చేసుకోలేదోతెలుసా?" అనడిగాడు గారాలుపోతూ.

"తెలుసు!"

"చెప్పుకో చూదాం!" సుబ్బారావు పై జాగ్రత్తగా సర్దుకున్నాడు.

"ఏ ఆడపిల్లా నిన్ను పెళ్ళాడ్డానికి ఒప్పుకోలేదు కనక!"

సుబ్బారావు వెలగకాయ తిన్నట్లదిరిపడ్డాడు.

"హాస్యాలు చాలించు మంగళా! నేను



సీరియస్‌గా చెప్తున్నా విను! నిన్ను పెళ్ళి చేసుకోవాలని నాకుంది. కాదంటే అంత సులువుగా వదిలిపెట్టను కూడా!"

"సాయంకాలమే చెప్పేను నాకిలాంటి హాస్యాలంటే అసహ్యమని—నే నిప్పుడు కూడా హాస్యానికనలేదు. నిజంగానే అంటున్నాను. అర్థం కాకపోతే అది నీ ఖర్మ! ఇక మరోమాట! అస్తమానం పెళ్ళో పెళ్ళో అని అనవసరంగా నన్ను రెచ్చకొట్టకు. పెళ్ళంటూ చేసుకోకుంటే నిన్ను మాత్రం చేసుకోను. సరేనా ఇకఅటుపైని నీకేం చేసుకోవాలనుకుంటే అదిచేసుకో, అర్ధరాత్రి దాటింది. వెళ్ళిరా!" అంటూ వెనుదిరిగి చూడకుండా వసారాలోని మేడమెట్లు చకచక ఎక్కిపోయింది మంగళ.

సుబ్బారావుకి పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

ఇంటికెళ్తే ఎంతవరకూ సాధించుకొచ్చావురా అంటాడు తండ్రి. జరిగింది చెప్తే 'అడ్డగాడిదా!' అంటాడు!' ఇన్నేళ్లు నెత్తికొచ్చి, డబ్బో పాడో కట్టి చివరికి డాక్టరనిపించుకుంటూ చేతకానివాడుగా మిగలడమా? వీల్లేదు—ఏదో ఆలోచించి ఆ కొరకరానికొయ్యను గుప్పిట్లో పెట్టుకోవాలి!' అనుకుంటూ ఇంటిదారి పట్టేడు సుబ్బారావు.

* * *

మంగళ చేతిలో పెడుతూన్న కాగితాన్ని ఆశ్చర్యంగా చూస్తూ "ఏమిటిదీ?" అన్నాడు కృష్ణ.

"నీకు పెళ్ళి కానుక!"

కాగితం తెరచిచూసిన కృష్ణకు నోట మాట రాలేదు.


వసుమతి నమ్మలేనట్లుగా చూసింది.

చౌదరి చేతులు మీసాలపైకి పోయాయి.

"దీన్లో అంత ఆశ్చర్యపోవడానికేమీ లేదు కృష్ణా! తాతగారి ఆస్థిమీద నా కంత హక్కుందో నీ కంతకు ఎక్కువే ఉంది. ఆయన కష్టంలో, సుఖంలో దగ్గరుండి సేవలు చేసింది నువ్వు, ఆయన చెప్పించిన చదువుని సార్థకం చేసుకుని, తిరిగి ఆ ఫ్యాక్టరీ వ్యవహారాలన్నీ బాగు పరిచింది నువ్వు—ఆయనపోతే కన్నకొడుకు కన్న ఎక్కువగా ఆయనకోసం ఏడ్చింది నువ్వు. నీకే ఆయన ఆస్థిలో హక్కు లేదంటే నాకూ లేనట్టే!" అంది మంగళ సరళంగా.

"మంచితనానికి కూడా కాస్త కట్టడి ఉండనీ మంగళా! నీ పెళ్ళి కాకుండా నేను పెళ్ళిపీటలమీద కూచోవటమే మహాపరాధం చేసినట్టుగా ఉంది నాకు. కాని, నీ సంతృప్తికోసం అది కాదనలేకపోయాను. అది చాలక ఇంకా ఆస్థిలో సగభాగానికి నన్ను ముడివేసి, శిక్షించకు. నువ్వు నాకిచ్చిన కానుక చాలా అపురూపమైనది. అది మనస్ఫూర్తిగా, అగ్నిసాక్షిగా నే నప్పుడే స్వీకరించాను" అన్నాడు కృష్ణ.

"నీలాంటివాళ్ళు చాలా అరుదుగా కన్పిస్తారు. ఏదైనా సత్కార్యం జరిగితే నీ వలనే జరగాలి. డబ్బు అప్పుడే సార్థకమవుతుంది. నేను ఎంతో ప్రేమతో



స్తూన్నదాన్ని నువ్వు కాదనకూడదు ృష్ణా!"

"నిజమే బాబూ! కూడబెట్టి, కూడ ట్టి వాళ్ళు తినక, ఒకరికి పెట్టక చ్చేవాళ్ళ దగ్గరున్న డబ్బుకంటే ం డబ్బు చాలా విలువైనది పవిత్ర ునది మీరు చేసే మంచి పనులే ుమ్మల్ని కాపాడతాయి అందుకు ఉదా ారణ మన మంగళే' అది ఎంత మంచి ునసుతో ఇస్తూందో అంతమంచి మనసు ేనూ నువ్వు దాన్ని సదుపయోగం య్యి నాయనా—కాదనకు!" అన్నాడు ాదరి.

కృష్ణ చెమరుస్తూన్న కళ్ళతో కాగి ాన్ని ఆప్యాయంగా పట్టుకుని గుండెలకు ాత్తుకున్నాడు

"నేనింత వున్నత స్థితిలో వుండటానికి ంతమంది మనుష్యులమధ్య మసలగలగ ానికి కారణం బాబుగారు.ఆయన ఎంతో ధర్మాతులు-ఎప్పుడూ అంటిపెట్టుకునుండే నాకు కూడా తెలియకుండా గుప్తంగా ఆయనెన్నో దాన ధర్మాలు చేసారని నాకు తెలుసును అయితే ఆయన జీవితంలో తీరని కోరిక ఒకటుండిపోయింది. అది, ఆయన కూతురి పేరుతో కట్టించాలను కున్న స్కూలు! ఆమెకు చదువంటే ప్రాణ సమానమట. బాబుగారి ఆత్మశాంతికోసం ఆమె పేరుతో స్కూలు కట్టిద్దాం దాని కోసం నేనింకా ఎంత కష్టపడైనా సరే డబ్బు సంపాదిస్తాను సరేనా, మంగళా!" అన్నాడు కృష్ణ

'శుభం' అన్నాడు చౌదరి

ఆ రోజే అల్లుడినీ, కూతురినీ తిరుపతి ప్రయాణం చేయించాడు చౌదరి.మంగళను రమ్మంటే మౌనంగా ఊరుకుంది

మంగళకు ఏనాటి మాటలో జ్ఞాపకం వచ్చేయి.

'కన్నకి మొక్కు తీర్చాలి గౌరీ,



ఎప్పటికప్పుడే డబ్బు సర్దుబాటు కావడం లేదు' అని రామం అంటే, 'ఫరవా లేదు మరికాస్త ఆగండి. మన రాజునీ మంగళనీ పసుపు బట్టలతో తీసుకొని తిరుపతికొండకు వెళదాం' అంది గౌరి.

అవి, జ్ఞాపకం వచ్చి మంగళ ముఖం ఉదాసీనంగా అయిపోయింది.మంగళ మనసును చదవగలిగే చౌదరికి ఆమె మౌనం అర్థమైంది.

మొత్తానికి మంగళ ప్రయాణంకాలేదు.

"నాకు డ్యూటీయే దేవుడు నాన్నా! వీలయినంత తొందరగా వస్తానని మురళి బాబుకి మాటిచ్చాను కూడా," అంటూ గోవిందు కూడా కృష్ణవేణితో సహా ప్రయాణమయ్యాడు.

అందరూ వెళ్ళిపోతున్నారు. మంగళ వక్కర్తేమిగులుతూంది ఇంట్లో. ఆ మాటే అంటే 'ఇది మరీ బాగుంది. వచ్చే పోయే వాళ్ళ సందడింకా తగ్గనే లేదు. పెళ్ళిల్లా? మరొకటా?' అంది ఆరిందాలాగ.

అంతా వెళ్ళిపోయారు. పెళ్ళయి అప్పటికి సరిగ్గా వారం రోజులయింది. సహాయానికి వచ్చిన ఒకటీ అరా దూరపు చుట్టాల్లాంటి వాళ్ళుకూడా సెలవు పుచ్చుకున్నారు. నౌకర్లు, మంగళ మాత్రమే మిగిలారింట్లో.

* * *

అంతవరకూ ఆ వంటరితనాన్నే కోరుకుంటూన్న మంగళ కొక్కసారి ఇల్లంతా నిశ్శబ్దమయిపోగానే భయ మావరించటం ప్రారంభించింది. వాకిలి తలు పేమాత్రం చప్పుడయినా రాజే వచ్చి వుంటాడన్న భ్రమ. ఆశ మంగళకింకా చావలేదు. ఆ ఆశతోనే ఆ ఇల్లు వదల్లేకపోయింది.

గేటు తలుపు చప్పుడయింది. 'చూసే దేమిటిలే? ఏ కేశవులు తాతో, పాపయ్యో అలా తిరుగుతూనే ఉంటార'నుకుంటూనే లేచి డాబా పిట్టగోడమీదనుండి చూసి, సంతోషాన్నాపుకోలేకపోయింది.

"లలితా!" అంటూ కేకవేసి క్రిందకు పరుగెత్తింది.

'ఎన్నాళ్ళ తర్వాత కలుసుకున్నాం? నువ్వెంత మారిపోయావ'నుకుంటూ పలకరింపులయ్యాక లలిత తన ప్రక్కనున్న యువకుడిని పరిచయం చేసింది.

"మా బావ-అత్తకొడుకు ఇప్పుడు..." అంటూ లజ్జగా నవ్వింది.

పచ్చని పసుపుబొందులు, నల్లపూసల చేరూ, కాలి మట్టెలు, అన్నిటినీ మించి ముఖంలో కొట్టొస్తూన్నట్లున్న ఆనందపు తళుకులతో కొత్త పెళ్ళికూతురు లలిత— ఒకప్పుడు కణతలంట చెమటలు కారుతూంటే మాటి మాటికీ చెంగుతో అద్దుకుంటూ జీవచ్ఛవంలా తిరుగుతూ బ్రతుకీడ్చే గ్రామసేవిక లలితలా మాత్రంలేదు.

ఆమె కళ్ళలో భయం, బెరుకుదనం, దీనత్వం అన్నీ ఎటో మాయమై ప్రపంచంలోని సంతోషమంతా నాదేనన్నట్లుంది.

"సరిగ్గా వసుమతి పెళ్ళినాడే రిజిస్ట్రారాఫీసులో మా పెళ్ళికూడా జరిగింది. మామయ్యకు ఇష్టంలేకపోయినా బావే పట్టుపట్టి ..." అని క్రీగంట భర్తకేసి చూసి అర్థవంతంగా నవ్వింది లలిత.

"చాలా సంతోషం లలితా, రండి" అంటూ లోపలికి తోడ్కొని వెళ్ళింది.

ఆమాటా, ఈమాటా అయ్యాక "ఇన్ని పెళ్ళిళ్ళు చేయిస్తున్నావు. మరి నీ పెళ్ళెప్పుడు?" అని హఠాత్తుగా ఒక్కసారి ఆగింది లలిత.

"అన్నట్టు- రాజు గురించి ఏమైనా తెలుసా మంగళా?"

తను భయపడినంతా ఏదో జరిగి ఉంటుందని గుండె దడదడ కొట్టుకుంటూంటే, బేలగా తల అడ్డుగా తిప్పింది మంగళ.

"మా పెళ్ళిరోజున నా స్నేహితురాలు విజయ అనే అమ్మాయికూడా పెళ్ళి చేసుకుంది. చాలారోజుల తర్వాత కలిసేము. సంతకాల తంతులు ముగుస్తూనే కనీసం నాతోనయినా అట్టే మాట్లాడకుండా హడావిడిగా వెళ్ళిపోతూన్న విజయ చెప్పింది. వాళ్ళ ప్రక్కపోర్షనులో అద్దెకున్నతనికి ఒంటిమీద తెలివిలేని జ్వరమట. చూసే చేసే దిక్కులేరట - తనే వెళ్ళి చూడాలని చెప్తూ 'మీ పాలెంనుండి వచ్చినాయనే - పేరు రాజు' అని కూడా చెప్పింది. నాకొక్కసారి వెళ్ళి చూడాలనే అన్పించింది పాపం, రాజు ఆ స్థితిలోపడి ఉన్నాడంటే. కాని, మేం వెళ్ళే బండికి కూడా అట్టే టైములేదు. అంచేత వెళ్ళలేకపోయాను" లలిత ఇంకేమేమో చెప్తూంది.

మంగళ చెవుల్లో సముద్రపు ఘోష ప్రారంభమయింది. గడచిన రోజులు, తను రాజుకోసం కన్నకలలు, జరిగిన సంఘటనలు నిష్కారణంగా తమ మధ్య రేగిన వాగ్వివాదాలూ, చివరికీ ఒంటరి బ్రతుకు, రాజు పరిస్థితి తల్చుకుంటూన్న కొద్దీ మంగళకి ఏడుపు తన్నుకొస్తూంది. అయినా ఎలాగో నిగ్రహించుకుని, అతి కష్టంమీద వాళ్ళతో ఏవో ముక్తసరిగా మాట్లాడింది,

తర్వాత లలిత భర్తతో వెళ్ళిపోయింది.

మంగళ శిలావిగ్రహంలా కూచునే ఉంది. చీకటిపడిపోయింది. కేశవులొచ్చి లైటు వేసేవరకూ పరిసరాలు కూడా గమనించలేదు.

"ఏటి మంగమ్మా! దిగాలుగా కూకున్నావ్! అందరితోపాటు నువ్వూ ఎల్లిపోతేనే బాగుండేది. నీకేటి తోస్తాది సెప్పిక్కడ? ఎవురిమాటా ఇన్నావుకాదు-పోన్లే, బువ్వ తిందువుగాన్లెగు" అన్నాడు కేశవులు.

దిగ్గున లేచింది మంగళ.

"తాతా, నే నర్జంటుగా పట్నం వెళ్లాలి" అంతసేపుగా పడుతూన్న బాధకి ఆ రెండు మాటలే చాలు తెలుసుకోగలిగితే. 'రాజు దగ్గరికి' అని చెప్పలేదు మంగళ.

"ఏటేటీ" విస్తుబోతూ చూసేడు.

"అవును - వెళ్ళాలి. ఈ రాత్రికే" అంది స్థిరంగా.

కేశవులికి బుర్ర పనిచెయ్యటం మానేసింది.

"అటు మీ ఊరూగాక, ఇటెక్కడా ఉండక ఇయ్యాలప్పుడు నీకు పట్నమెందుకెల్లాల్సొచ్చింది మంగమ్మా" అన్నాడు విసుగ్గా.

"నన్నేం అడక్కు తాతా ఇక! నేను వెళ్ళి తీరాలి అంతే! ఇక్కడ ఇంకొక్క క్షణం కూడా ఉండలేను. నువ్వు వెంటనే వెళ్ళి గంగుల్ని బండి తెమ్మని చెప్పు.



వెళ్ళు వేగం!" అని తొందర పెట్టింది.

చేసేదిలేక సణుక్కుంటూ కదిలాడు కేశవులు.

తోవలో రంగనాథం ఎదురుపడ్డాడు. "చీకట్లో ఎటు బయల్దేరావయ్యా?" అంటూ.

"గంగులుగాడింటికి బాబో, మంగమ్మ ఊరెళ్తుంది."

"ఏ ఊరూ?" ఆత్రం చంపుకోలేక పోయాడు.

"బస్తీనే!" విసుగ్గా చెప్పి వెళ్ళిపోయాడు కేశవులు.

తలుపు చప్పుడు విని సన్నగా ఒణుక్కుంటూ వచ్చి తలుపు తెరిచాడు గంగులు.

"నీకేటయిందిరా?" చిరుచీకట్లో గుచ్చి గుచ్చి చూసాడు కేశవులు.

"నిన్న సంతలో సెడతిరిగి పిన్నజొరవొచ్చిందయ్యా! నా మాటకేంగాని, నువ్వేందిలా ఒచ్చినావ్ ఇయ్యాలప్పుడు?"

"నన్నేటి సెయ్యమంతవ్, ఆ మంగమ్మకి యాలాపాలా నేకపోతే - నేడికి నేచిందే పయాన వంటాది. ఆ యమ్మతీరే అంత సిన్నప్పట్నుంచీ - ఈ రాత్రికే ఊరెల్లాల్ట! నిన్ను బండొట్టుకు రమ్మని సెప్పమని నన్ను దగిలింది - నువ్వు సూస్తే ఇలాగున్నవ్ - రాగలవా?"

"పర్నేదునే! మన మంగమ్మ పిలడం, నాను రాకపోడం ఏటి? వస్తానన్చెప్పు" అన్నాడు గంగులు.

* * *

పైమీద కండువా నెత్తి మీదేసుకుని తండ్రి ఇంట్లో కొస్తూంటే అదోలా చూసేడు సుబ్బారావు. "నాన్నా ఏమైంది?" అని ఆదుర్దా ప్రకటిస్తూ.

"ఇంక అవడాని కేముందిరా? నెత్తి మీదికి చెంగొచ్చింది!" అన్నాడు రంగనాథం పొడుపుడుగా.

సుబ్బారావు అన్నాళ్ళుగా మంగళ గురించి ఆలోచిస్తూనే ఉన్నాడు. 'పెళ్ళంటూ చేసుకుంటే నిన్నుమాత్రం చేసుకోను. అటుపై నీ ఇష్టం వచ్చినట్టు చేసుకో!' అని తనను పిసరంత ఖాతరు చెయ్యకుండా ఫో పొమ్మన్న మంగళ ఏ అస్త్రానికి దిగివస్తుందో సుబ్బారావు కెప్పటికీ అంతు పట్టటంలేదు.

"నువ్వుండు నాన్నా, నీ కంతా తొందరే ఇప్పుడందుకే కదా నేను కిందా మీదా పడి ఆలోచిస్తున్నది!" అన్నాడు రుంజుకుని.

"ఒరే సుబ్బిగా! డాక్టరు సీటంటే డబ్బెట్టి కొన్నానుకాని తెలివితేటలు కొనడం నా తరమటరా? నువ్వలా చవటలా ఆలోచిస్తూనే కూచో ఇక్కడ, అది చల్లగా చెప్పా పెయ్యకుండా ఊరినుండే దాటేస్తూంది. ఇంకేం చేస్తావురా నీ మొహం!" కండువా దులిపి చిలక్కొయ్యకి తగిలించాడు రంగనాథం.

"ఏమిటీ? మంగళ వెళిపోతూందా? ఎక్కడికి?"

"ఎక్కడికయినా వెళ్తుందిరా! ఏమైనా చేస్తుంది - ఇప్పటికే మూడో వాడితో సంప్రతించకుండా సగానికి సగం ఆస్థి ఆ కిష్టిగాడి పేర రాసేసిందా! ఆ ఉన్న సగం ఇంకెవరి కప్ప చెప్పేడానికో! నీకు

బదులో ఆడపిల్ల పుట్టినా సంతోషించే వాడిని రా నేను" అంటూ విసురుగా కాళ్లు కడుక్కోండికి పెరట్లోకి నడిచాడు.

ఎటుచూసినా తన బతుకు అవమానకరంగానే ఉంది. ఎన్ని సంవత్సరాలయినా విసుక్కోకుండా తనను డబ్బుపెట్టి చదివిస్తూన్న తండ్రి మెప్పుకోసమయినా, మగవాడ ననిపించుకుందికైనా కనీసం ఒక సాహసకృత్యం చేసిలేరాలని నిశ్చయాని కొచ్చిన సుబ్బారావు, ముందు వెనుక లాలోచించకుండా, బట్టతీసుకుని ఏతవాళ్ళ కొండడికోసం పరుగెత్తేడు.

25

అర్ధరాత్రివేళ జరగబోయే విచిత్రాన్ని చూడడానికి కళ్ళు మరింత విశాలంగా చేసుకుని కటకటాల తలుపుల్లోంచి తొంగి చూస్తున్నట్లుంది సర్వమంగళాదేవి విగ్రహం.

గిల్-గిల్‌మని మువ్వలు సవ్వడి చేసుకుంటూ మెల్లగా నడుస్తూంది బండి కున్న ఒంటెద్దు. 'ఎహేయ్!' అని గట్టిగా అరవడానిక్కూడా శక్తి లేని గంగులు ఎద్దుమీద విసుక్కొని, తిట్టుకుంటూ తలగుడ్డ చెవులమీదనుండి జాగ్రత్తగా కప్పుకుని బండి తోలుతున్నాడు.

"నిన్ను బాధపెడుతున్నానురా గంగులూ!" నొచ్చుకుంది మంగళ.

"సె—నాకేటయినాదనిప్పుడు?"

"ఏమీకాకపోతే ఎప్పుడూ హుషారుగా పాటపాడుతూ బండి తోలేవాడివి ఇలా తిట్టుకుంటూ తోలుతావా?"

"తప్పయిపోయినాది మంగమ్మా— బండిలో నువ్వున్న సంగతే మర్సిపోయి నోటికొచ్చినట్టు ఓగేసినాను! నా మాటకేం గాని నువ్వే కబుర్లు సెప్పు—దూరం ఇట్టే తరిగిపోతాది!"

"నా కబుర్లేవీ వినతగినవి కావురా— ఆఁ—పోనీ ఒక కథ చెప్పనా?" తన దిగులుని మరచిపోటానికి మంగళ కబుర్లు ప్రారంభించింది.

"కతలంటే నాను మరీ సెవి గోసుకుంటాను. సెప్పు-సెప్పు-ఇంతకీ ఏం కతది?" గంగులుకి కొంచెం హుషారు పుట్టుకొచ్చింది.

"సర్వమంగళాదేవి కథరా! అదే—మంగమ్మ కథ!" మంగళ కంఠం బరువుగా పలికింది.

"ఏఁటేటీ, మన మంగమ్మకో కత కూడా వుందా! సెప్పు మరీ!" కుదురుగా కూర్చున్నాడు గంగులు.

"నా కెప్పుడూ ఒక అనుమాన మొచ్చేది—సీతారాములు, రాధాకృష్ణులు, శివపార్వతాలు అంటారే! మరి, మన సర్వమంగళాదేవి ఒక్కతే ఉందేమని. ఆ సంగతే మన కోవిల పంతులుగారి నడిగానోమారు. ఆయనేం చెప్పేరో తెలుసా, గంగులూ?"

గంగులు 'ఊఁ' కొడ్తూంటే మంగళ దీనంగా కథ ప్రారంభించింది.

"పార్వతీదేవి హిమవంతుడనే కొండ రాజు కూతురట. తన తపస్సుతో ఈశ్వరుడ్ని మెప్పించి పెళ్లి చేసుకుని కైలాసానికి వెళ్ళిందట. అక్కడామె ఎంత ఆనందంగా గడుపుతూన్న సమయంలోనైనా తనవాళ్ళ ఆక్రందన చెవిన



పడితే తక్షణం భూలోకానికి తరలివచ్చేసి కష్టాల్లో ఉన్న వాళ్ళ నాదుకొనేదట. ఈశ్వరుడెప్పుడూ అంతగా పట్టించుకోలేదు. కాని కైలాసంలో గుసగుస లెక్కువయ్యాయట. 'పార్వతీదేవికి పుట్టిల్లే స్వర్గంలా ఉంది — మాటి మాటికి భూలోకానికి వెళిపోతూంటుంది' అని. ఈశ్వరుడప్పుడు కొంచెం బాధపడి అలా వెళ్ళటానికి వీలులేదని భార్యను శాసించాట్ట.

భర్త మాట జవదాటటం ఇష్టంలేకపోయినా, భక్తుల మొర పెడచెవిని పెట్టలేక ఓమారు పార్వతీదేవి శివుడికి తెలియకుండా వచ్చిందట ఈ లోకానికి.

తనమాట మీరి వెళ్ళిందన్న కోపంతో ఆవేశంగా వచ్చిన ఈశ్వరుడు పార్వతిని ఎన్నోమాట లన్నాడట. "కొండవాడి కూతురికి కైలాసం ఎందుకు నచ్చుతుందిలే!" అంటే మాత్రం పార్వతి ఊరుకోలేదట. ఆమెకూ రోషం వచ్చింది.

"అవును—నువ్వెక్కిన ముసలి ఎద్దు కన్నీటినే తుడవలేని నువ్వు ఈ భూలోకంలో వాళ్ళ కన్నీరేమి తుడవగలవులే!" అందట.

ఇలా మాటా మాటా పెరిగి ఇద్దరూ పంతాలకు పోయారట. తనను ఎదిరించిందన్న కోపంతో ఈశ్వరుడు, పార్వతీదేవిని పిలవకుండా తను వక్కడే తిరిగి కైలాసానికి వెళ్ళిపోయాడట.

అది పార్వతీదేవికి చాలా అవమానమనిపించిందట. అహోరాత్రులు తపస్సు చేసి తనను తప్ప మరొకరిని పెళ్ళాడనన్న భార్యను అలా నిర్లక్ష్యంచేసి వదిలిపోవటం ఆమె సహించలేకపోయిందట. తనంత తానుగా పరమేశ్వరుడు వచ్చి తీసుకెళ్ళేవరకూ కైలాసానికి తిరిగి వెళ్ళనని భీష్మించుకుని భూలోకంలోనే, సర్వమంగళాదేవి పేరుతో, సార్ధక నామురాలై ఉండిపోయిందట.

ఆ సర్వమంగళాదేవేనురా గంగులూ, ఈ సుంగమ్మ!"


"బలే కత సెప్పినావే మంగమ్మా!" అన్నాడు గంగులు సంబరంగా.

అంతలోనే వాడికొక సందేహమొచ్చింది.

"మంగమ్మా! నాకు తెలీకడుగుతాగానీ, మరీ కత పూర్తయే దెట్టా? ఈసొరుడూ రాడు. ఈసొరుడొత్తేగాని మంగమ్మ ఎల్లదు. బలే సిక్కొచ్చిందే! ఆఁ-అది! కత పూర్తవ్వాలంటే నాస్సెప్పినట్టే అవ్వాల మంగమ్మ! మరేమో, ఈసొరుడు సగం దూరం రావాల. మంగమ్మ సగం దూరం ఎల్లాల" తన తెలివితేటలకు తనే పొంగిపోతూ "ఏటంటవ్?" అంటూ తలెగరేసాడు.

వాడికయితే కనిపించలేదు కాని మంగళ కళ్ళనిండా నీళ్ళు నిండిపోయాయి. మెల్లగా తుడుచుకుంటూ, వణుకుతూన్న కంఠాన్ని అదుపులో పెట్టుకుంటూ అంది మంగళ.

"లేదురా గంగులూ! పట్టుదలలూ పంతాలూ అన్నీ మరచిపోయి మంగమ్మే వెళ్తుంది. ఈశ్వరుడు పాపం రాలేడు,



నిన్ను విడిచి నేను బతకలేనంటూ మంగమ్మే వెళ్తుందిరా! ఈ మంగమ్మే వెళ్తుంది."

ఒంటెద్దుబండి సర్వమంగళా దేవి ఆలయం దగ్గరకొస్తూంది. "గంగులూ కాస్త ఆపరా ఓసారి. అమ్మవారి దర్శనం చేసుకొస్తాను" అంది మంగళ. గంగులు బండి ఆపేడు.

మంగళ బండి దిగి చకచకా నడిచింది. చిన్న నూనె దీపపు వెలుగులో గుడిలో నుండి అమ్మవారి విగ్రహం సన్నని మందహాసంతో చేతులు సాచి పిలుస్తున్నట్లుంది.

చెమ్మగిల్లిన కన్నులతో, ముకుళిత హస్తాలతో సాష్టాంగ పడబోతూన్న మంగళకి "కెవ్వున" భయంకరమైన కేక వినిపించింది.

విభ్రాంతిగా వెనుతిరిగి చూసింది.

రెండు మూడు ఆకారాలు కనిపిస్తున్నాయా మసక చీకట్లో,

ఆ కేక వేసింది గంగులే—సందేహం లేదు. ఎవరు వాళ్ళు ఏమిటిదంతా! మంగళ గుండె దడదడలాడింది.

"బాబోయే నాయనోయ్ నన్నొగ్గండి దేవుడోయ్!" అంటూ బొబ్బలు పెడుతున్నాడు గంగులు. ఒక ఆకారం వాడిని చావబాదుతూంది. గుమ్మటంలాంటి వాడొకడు గంగులు మూతికి గుడ్డబిగించి అవలీలగా ఎత్తుకుని పారిపోతున్నాడెటో.

భయంతో కొరడు బారిపోతున్న మంగళకి అడుగు ముందుకు పడలేదు. మరో ఆకారం పరుగులాంటి నడకతో తనకేసే వస్తూంది. పొడారిపోతున్న పెదవుల్ని నాలుకతో తడుపుకుంటూ గుడి కటకటాలనానుకుని నిలబడింది.



ఆ ఆకారం చకచక గుడి మెట్లెక్కివస్తూంది. గుడిలోని దీపపు వెలుగులా ఆకారం మీద పడ్డాయి. మంగళ నంతవరకూ పీల్చిపిప్పి చేసిన భయం మటుమయమై పోయింది.

"ఎవరూ?సుబ్బన్నా!" అంది నమ్మలేనట్లుగా.

"అవును మంగళా, నేనే ఊరి కెళిపోతున్నావని తెలిసి నిన్ను కలవాలనొచ్చాను!" అన్నాడు సుబ్బారావు విలాసంగా చేతిలో హంటరూ ఊపుకుంటూ.

మండిపడింది మంగళ

"సుబ్బన్నా! ఏమిటి నాటకం? గంగుల్నేంచేసారో చెప్పు ముందు!" అంది రౌద్రంగా

"మనమధ్య ఆ వెధవకూడా ఎందుకని పంపించేశాన్లే కొండడి చేత!"

"సుబ్బన్నా" గట్టిగా అరచింది మంగళ ముందుకు వచ్చి

"మంగళా! నువ్విక ఎంత గోల పెట్టినా, అరిచి చచ్చినా నీ కెవ్వరూ ఇక పలకరిక్కడ. 'ఛస్తే పెళ్ళి చేసుకోను, నీ యిష్టం వచ్చినట్టు చేసుకో!' అని చెప్పావే! నీ పొగరణగాలనే వచ్చేను మంచిగా నాదారి కొచ్చావా సరేసరి, లేదా నేనొకనాటి సుబ్బన్నవి మాత్రం కాదని గుర్తుంచుకో!" అంటూ మరికాస్త సమీపాని కొచ్చాడు సుబ్బారావు.

మంగళ చుట్టూ చూసింది. అంతా నిశ్శబ్దం.

గుళ్ళో అమ్మవారు ఎప్పటిలా మందహాసం చేస్తూనే ఉంది

"ఏం? ఏంచేస్తావేమిటి?" తలెత్తి బిరుసుగా అడిగింది మంగళ

"అంత పొగరుగా ఉందా? ఏం చేస్తానో చూడయితే!" అంటూ పశుబలంతో మీదకొచ్చాడు సుబ్బారావు. చేతిలో హంటరు పక్కన పడేసి బలంగా మంగళ రెండు జబ్బలూ పట్టుకున్నాడు.

సుబ్బన్న వట్టి అరుపులగొట్టేనని అంతవరకూ అనుకుంటూన్న మంగళ అతని చర్యకు బిత్తరపోయి, దిక్కుతోచక కెవ్వున కేకవేసింది

* * *

ఊడల మర్రికి కుడివేపు ఫర్లాంగు దూరంలో టీ కొట్టు దగ్గర ఆగిందొక లారీ రాజు అందులోంచి దిగేడు. లారీ కదిలింది

సన్నని మసక వెన్నెల్లో నలువైపులా ఓమారు చూసి ఊళ్ళోకి పోయే బాట వెంబడి తొందరగా నడక సాగిస్తున్నాడు. అలసటతోను, ఆత్రంతోనూ అతని అడుగులు తడబడుతున్నాయి కాని కాసేపట్లో మంగళను చూడగలనన్న సంతోషం అతన్ని ముందుకి లాక్కుపోతూంది.

కృతజ్ఞతగా చౌదరిని మరోమాటు తలచుకున్నాడు.

'ఎంత మంచి మనసు!'

'అయిపోయింది - తానొకటి తలిస్తే దైవమొకటి తలచినట్లు పెళ్ళికి కూడా వెళ్ళలేకపోయాడు. పెండ్లిముగిసి, అంతా ఎక్కడి వాళ్ళక్కడ వెళ్ళిపోయుంటారు, ఇక మంగళను చూసేదెలా?' అని దిగులు

పడుతూన్న సమయంలో. సందె చీకటి వేళ దేవుడిలా తన ఇంట్లో అడుగుపెట్టిన చౌదరిని చూస్తే ఆనందం పట్టలేక పోయాడు రాజు. కాని కళ్ళెత్తి చౌదరి ముఖంలోకి చూడటానికి కూడా జంకు కలిగింది.

అయితే చౌదరిమాత్రం నిండు కుండ లాగే వ్యవహరించాడు.

"వసుమతీ, అల్లుడూ తిరుపతి వెళ్లేరు. వాళ్ళతోనే బయలుదేరిన నేనుమాత్రం వెళ్ళలేకపోయానయ్యా రాజూ! అందుకే గోవిందు ద్వారా నీ అడ్రసు తెలుసుకుని అలా వచ్చేసాను. అక్కడికెళ్తే దేవు డడుగుతాడు? ఈ కూతుర్నీ, అల్లుడినీ వెంటబెట్టుకుని చాలా ఆనందంగా వచ్చావు గాని, ఆ కూతురి సంగతేం చేసావని? నేనేమి సమాధానం చెప్పే దయ్యా?

"రాజూ! పరుల మంచినే తప్ప, తన మంచి చూసుకోలేకపోయిన ఆ వెర్రి బాగులపిల్ల తరపున, ఆడపిల్ల తండ్రిగా నిన్ను రెండు చేతులూ పట్టి బ్రతిమాలు తున్నాను - మంగళవలన ఏమైనా పొర పాట్లు జరిగాయనుకుంటే అవి నావిగా భావించి, మన్నించి, దానిని వెళ్ళి కలు సుకో! నాకు ఇంతకంటే ఆనందకరమైన సంగతి మరొకటుండబోదు!" అనేసరికి ఖిన్నుడవుతూ రాజు గౌరి రాసిన ఉత్త రాన్ని కూడా వివరించాడు.

"పిచ్చిపిల్ల!" కళ్ళు చెమ్మగిల్లుతూంటే మంగళని తలచుకొని చౌదరి ఉప్పొంగి పోయాడు.

మంగళ పాలెంలోనే ఉందని తెలి సింది. సమయానికి బస్సుకూడా లేదు. రాజు ఇక ఒక్కక్షణం కూడా ఆగలేక, కంపెనీ సరుకులు తీసుకుపోయే లారీ వస్తూంటే ఎక్కి వచ్చేసాడు.

సర్వమంగళాదేవి గుడిదారి పట్టిన రాజుకి గుండె చిత్రంగా కొట్టుకుంటూంది. 'మంగళ ఇప్పుడెలా ఉందో? తనను గురించి ఏమనుకుంటూందో? తను కళ్ళ పడగానే పాతరోజులన్నీ జ్ఞాపకమొచ్చి ఏమంటుందో? ఏమన్నాసరే తను పడి తీరాలి!

ఏదో ఆలోచించుకుంటూ చకచకా నడుచుకుపోతూన్న రాజు కాళ్ళు ఠక్కున ఆగిపోయాయి.

ఎదురుగా ఎవరో రోడ్డుమీద దొర్లు తున్నారు. ఆత్రంగా దగ్గరికి పరుగెత్తు కొచ్చాడు. కాళ్ళకి, చేతులకి, నోటికి, కళ్ళకి, కళ్ళకి బిగించిన గుడ్డలు విప్పి "గంగులూ, నువ్వా! ఏమైందిరా?" అన్నాడు విస్మయంగా.

అసలే జ్వరంతో సగం చచ్చి ఉన్న గంగులు ఏడ్చుకుంటూ చెప్పేడు. "నువ్వా రాజు బాబూ! సంపేసినారెవరో దొంగ ముండా కొడుకులు - నా కళ్ళకి గంతలు కట్టి - మంగమ్మ ఊరెల్తానందని బండి కడితే అమ్మోరి గుడికాడ కాపి, ఇద్ద రెదవలు నన్ను సితక్కొట్టేసి ఇక్కడ తోసేసి ఆలమానాన ఆలు ఎలిపోనారు బాబూ!"

"మంగళేమయింది చెప్పరా ముందు!"

"ఆ గుడికాడ పాపం ఏటయినాదో తెల్దు, నువ్వు బేగెల్లు బాబూ!" అన్నాడు దండం పెడుతూ గంగులు.



రాజు గుడికేసి పరుగు పెట్టేడు.

*　　*　　*

సుబ్బారావు పట్టు నుండి విడివడటానికి మంగళ గింజుకుంటూంది

"సుబ్బన్నా! విడిచిపెట్టు నన్ను. పాపం, పుణ్యం లేకుండా ప్రవర్తించావంటే కళ్లు పోగలవ్! ఇది అమ్మవారి గుడన్న సంగతైనా జ్ఞాపకముంచుకో! వదులు - వదులు నన్ను?"

"అమ్మవారేం చేస్తుందిలే నన్ను? నాకలాంటి భయాలేం లేవు!" అంటూ బలంగా మంగళను గర్భగుడి కటకటాల కాన్చి, రెండు చేతులూ నొక్కిపట్టి, ముఖంమీద ముఖం ఉంచబోయాడు సుబ్బారావు

అరచి అరచి, గింజుకుని అలసిపోయిన మంగళకి ఎవరూ వచ్చి తనను కాపాడలేరన్న సంగతి సుస్పష్టమయిపోయింది

ఒక్కసారి కళ్ళుమూసుకుని అమ్మవారిని తలచుకుంటూ, ఉన్న శక్తినంతటినీ కూడగట్టుకుని, తలతో బలంగా కటకటాల నొక్క వూనువూని రెండు చేతులూ విదుల్చుకొని ఒకే ఊపుతో, వెల్లకిలా పడేలా సుబ్బారావు నొక్క తోపుతోసింది.

మంగళ శౌర్యప్రతాపాలు చిన్ననాడు సుబ్బారావు ఎరిగినవే అయినప్పటికీ కామోద్రేకంలో మరచిపోయాడు ఒక ఆడపిల్ల అంత బలంగా తంతుందని అతననుకోలేదు

ఇప్పుడు హంటరు మంగళ చేతిలో ఉంది.

మంగళ వీరావేశమెత్తిన భద్రకాళిలా అతన్ని చెండాడుతూంది సుబ్బారావు చివరికి నేలమీదనుండి లేచే ప్రయత్నం కూడా చెయ్యలేని హీనస్థితి కొస్తున్నాడు.

"ఏరా—సుబ్బన్నా' ఇప్పుడొదిలిందా తిమ్మిరి? అమ్మవారేం చేస్తుందన్నావు కదరా, గాడిదా! ఇప్పుడు బాగా చూశావా, ఏం చేసిందో? ఇంకా బాగా కళ్ళు తెరుచుకు చూడరా! నేనే నీపాలిటి అమ్మవారిని! నీ ప్రాణంతీసి " అంటూ మరోసారి హంటరెత్తిన' మంగళ ఎదురుగా కనుపించిన రాజుని చూసి శిలా ప్రతిమలా ఉండిపోయింది

ఆమెకు ఒకే క్షణంలో ఆనందం, ఆశ్చర్యం, భయం, లజ్జ నాలుగుపొరల మోకుతాడుగా పేనుకుపోయి చలన రహితంగా చేసాయి.

మహిషాసురమర్దని సాకారమై నిలచి నట్లున్న మంగళరూపాన్ని కళ్ళింతింత చేసుకుని చూస్తూ భీకరంగా అన్నాడు రాజు.

"ఎత్తిన చెయ్యి దింపకు మంగళా, తగల్నీ, నీ కసితీరా తగల్నీ!"

ఆ మాటతో ఎత్తి ఉంచిన చెయ్యి క్రిందకు దిగిపోయింది

'ఛీ ఛీ—ఏమిటిలా అయింది? రాజు కిష్టంలేని మగరాయుడి పనులు మానేసి, ఎంతగా అందరాడపిల్లల్లా ఉండాలని ప్రయత్నించిందో చివరికా 'మగరాయుడి' గానే అతని కళ్ళముందు పడవలసొచ్చిందా? ఇంతకాలమైనా తనలో ఏ మార్పు రాలేదనే కాబోలు రాజు అలా

అంటున్నాడు.

మంగళ నీరుగారి నిల్చుండిపోయింది.

ఇదే అదనని సుబ్బారావు మెల్లగా లేచి చల్లగా జారుకోబోతూంటే చొక్కా కాలరు దొరకబుచ్చుకుని ఆపేడు రాజు.

"ఏరా సుబ్బన్నా! ఇలాంటి నీచపు పనికి మనసెలా ఒప్పిందిరా నీకు? నీ చదువెందుకురా తగలెయ్యను! ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని కాళ్ళమీద పడరా వెళ్ళి!" అని చీవాట్లేసాడు

అప్పటికే దెబ్బలతో, అవమాన భారంతో రగులుకుపోతూన్న సుబ్బారావు ఇంతవరకూ తనని రెచ్చకొట్టిన తండ్రినేం చెయ్యాలి? తననేం చేసుకోవాలి? ఎవరినేం చెయ్యాలని కొట్టుకుపోతూ "హుం" అంటూ విసురుగా రాజు నొక్క తోపు తోసాడు.

దానితో రాజుకి పిచ్చికోపం చెలరేగింది. "రాస్కెల్! వెధవ పని చెయ్యటానికి లేని జంకు ఇప్పుడొస్తుందిరా నీకు? ముందు వెళ్ళి కాళ్ళమీద పడతావా? లేదా?" అంటూ నాలుగు తగల్నిచ్చాడు

సుబ్బారావు విదిలించుకుని పారిపో జూస్తున్నాడు రాజు అతని పీక దొరకబుచ్చుకుని బలంగా గుడి స్తంభాని కాన్చి పట్టుకున్నాడు సుబ్బారావుకి నిలబడ్డానికి కూడా పట్లు తప్పిపోతున్నాయి చేతులు వ్రేలాడేసి నిస్సహాయంగా చూసేడు

త్రుటిలో వచ్చి అడ్డుపడింది మంగళ

"ఒదిలెయ్! సుబ్బన్న నొదిలెయ్! హాస్యానికో, పరాచానికో నేను మాటిచ్చాను. చిన్నప్పటిలా తన్నులు తిన్నా మళ్ళీ విడిపిస్తానని—పోనీయ్—ఎవరి పాపాన వారు పోతారు-ఇదంతా సుబ్బన్న సాహసమే కాదని నాకు బాగా తెలుసు. ఇన్నేళ్ళొచ్చినా, ఏదో చదువులు వెలగబెడుతున్నా, స్వతంత్రంగా ఆలోచించుకోలేని మనిషి' ఆ తండ్రే గడ్డికరవమంటే ఆ గడ్డే కరుస్తాడు'" అనేసరికి రాజు వదిలేసాడు

సుబ్బన్న ఇంకా నిలబడే ఉన్నాడు

"పో, సుబ్బన్నా! పో—చిన్నప్పుడిదే గుడి ముందు, అందరూ తంతూంటే నిన్ను విడిపించి, ఈవాళిదే గుడి ముందు నేనే తన్నువలనొచ్చినందుకు నాకు చాలా బాధగా ఉంది పో—నీకేమైనా సిగ్గు, లజ్జ మిగిలుంటే పోయి మీ నాన్న నోట గడ్డిపెట్టు వెళ్ళి నువ్వేం నా కాళ్ళమీద పడనక్కర్లేదు. మీ నాన్నకి తగిన గుణపాఠం చెప్తే నా కంతే చాలు— వెళ్ళు." అంది మంగళ

సుబ్బారావు తల దించుకుని వెనుతిరిగాడు

"మంగమ్మా'" అని పిల్చుకుంటూ రాబోయాడు గంగులు.

గుడి ముందర ఒకరిముకంలో కొకరు చూస్తూ నిల్చున్న మంగళ రాజుల్ని చూసి, గొంతు నొక్కేసుకుని, నోటికి చెయ్యడ్డం పెట్టుకుని, ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ వెనుతిరిగాడు.

ఆ దృశ్యం చూసిన ఆనందంలో వాడికి తగిన దెబ్బలు-నొప్పులు, జ్వరం, నీరసం అన్నీ ఏటో ఎగిరి పోగా హుషారుగా ఈలవేసుకొంటూ 'నా సామి రంగ—మనకిక పప్పన్నం దొరుకుద్దిరా బీఁవన్నా — పరిగెత్తెహేయ్" అంటూ

ఒంటెద్దుబండి దౌడు తీయించాడు

*   *   *

ఒకరి మనస్సంఘర్షణ నొకరు అర్థం చేసుకుంటున్నట్లుగా రాజు, మంగళ అలా ఎంతోసేపు మాట, పలుకు లేకుండా నిల్చునే ఉన్నారు

ఆ మౌనాన్ని భరించలేనట్లుగా రివ్వున ఓ గాలి తెర వీచి ఆలయ ధ్వజ స్తంభపు చిరు గంటలను లింగ్ లింగ్‌మని పించింది.

రాజు నెమ్మదిగా కదిలాడు. మెల్లగా ఓ అడుగు ముందుకేసి నేలమీద పడున్న హంటరు తిరిగి మంగళ చేతికిస్తూ అన్నాడు·

"దీని అవసరమింకా తీరిపోలేదు మంగళా! పుచ్చుకో! నాకు వదిన ఉత్తరం ద్వారా అన్నీ తెలిసాయి, క్షమాపణ కోరే అర్హత కూడా లేని నాకు తగిన శిక్ష పడితే కాని మనసు శాంతించదు కానీయ్!"

మంగళ తదేకంగా రాజుని చూసిచూసి గభాలున అతని గుండెలపై వాలి వెక్కి వెక్కి ఏడవడం ప్రారంభించింది

రాజు దిగ్భ్రాంతి చెందేడు కలా? నిజమా? అన్న సందిగ్ధంలో పడి పోయాడు

తమ మధ్య ఎప్పుడూ పంతాలూ, పట్టుదలలూ, పేచీలే తప్ప ఏనాడూ ఒకరి కొకరింత సన్నిహితంగా రాలేదు మంగళ తనకు తానుగా అలా వస్తుందని రాజు ఊహించనూలేదు.

మంగళ పసిపిల్లలా వెక్కుతూంటే ఆ కదలికకు, ఆ స్పర్శకు రాజు గుండెల్లో నుంచీ ఏంత ధ్వని తరంగాలు వెలువడుతున్నాయి. మరో ఆలోచన లేకుండా హంటరు పక్కన పారేసి, రెండు చేతుల్తో బలంగా, ఇంకా దగ్గరగా మంగళను గుండెలకు హత్తుకున్నాడు మంగళ మెత్తగా గువ్వలా అతని కౌగలిలో ఒదిగిపోయింది.

ఆ కలయిక కున్న మాధుర్యం తొలి సారిగా అనుభూతమైన వాళ్ళిద్దకీ కాలగమనమే తెలియలేదు.

మళ్ళీ ఓగాలి కెరటం వీచింది.

ధ్వజ స్తంభపు చిరు గంటలు మధురంగా మ్రోగుతున్నాయి.

"మంగళా!" లాలనగా పిలిచాడు రాజు

ఆ నీరత నిశీధిలో చుట్టు ముడుతూన్న పొన్నపూల పరిమళాన్ని తనివి తీరా ఆఘ్రాణిస్తూ మత్తుగా ఏమిటన్నట్లు తలనూగించింది మంగళ.

"నన్ను క్షమించగలవా?" ముఖాన్ని పైకెత్తి కనుల తడి చేతిలో తుడుస్తూ వేలగా అడుగుతూన్న రాజు ప్రశ్నకు సమాధానంగా అతని మెడ చుట్టూ చేతులు పెనవేసింది

"వదిన చెప్పినదే నిజం! అందరికీ మంచి చెయ్యాలని నువ్వు లోకాన్నెదిరించావు. లోకానికి జడిసి నన్ను నేను మధ్యపెట్టుకుని, చేజేతులా నిన్ను దూరం చేసుకున్నాను. అకాలం విలువ నాకిప్పుడు తెలుస్తూంది మంగళా! ఇంకెప్పుడూ ఎలాంటి కటువైన మాటా అని నిన్ను నొప్పించను—నన్ను నమ్ముతావా?"

"ఒద్దు రాజూ! ఇంకేమీ చెప్పకు. అంతా మరచిపోదాం. నీతో పేచీలూ,

పంతాలూ నాకొక్కప్పుడు సరదాలుగా ఉండేవి. కాని, చివరకు అవే మనని విడదీసాయి నేను పూర్తిగా అలసిపోయాను. నువ్వు లేకుండా నేను బతకలేనని బాగా తెలిసింది. అందుకే నీకోసం బయలుదేరాను నన్నింకెప్పుడూ విడిచి వెళ్ళకు రాజూ! నాకు విశ్రాంతి కావాలి!" అంటూ లతలా అతని నల్లుకుపోయింది మంగళ.

పొన్నపూలు జలజల రాలుతూనే ఉన్నాయి

పారిజాతాలు గుబాళిస్తూనే ఉన్నాయి.

చుక్కలు నిక్కినిక్కి చూస్తూనే ఉన్నాయి

గుడిలో సర్వమంగళాదేవి మందస్మితం చేస్తూనే ఉంది.

రాజుకి మంగళకి కబుర్లంతం కావటం లేదు

తూరుపు ఎర్రబడటంప్రారంభించింది మంగళ గుసగుసగా అంది "ఈవాళ నాకెంత ఆనందంగా ఉందో తెలుసా రాజూ?"

రాజు అలిగి దూరంగా జరిగాడు "నన్నలా పిలవ"కంటూ.

మంగళ ముఖం చిన్నబోయింది "మరెలా పిలవాలి?"

"మా అన్నయ్యనేమని పిలిచేదానివి?"

"బావా అని!"

"మరి ఆ అన్నకు తమ్ముడు మాత్రం నీకేమవుతాడు?"

సిగ్గుతో మంగళ ముఖం ఎర్రబడింది రాజు ఈవేళ ఆ అరుణిమ వెనుకనున్న

జ్యోతి

భావాల్ని చదవగలుగుతున్నాడు.

"పిలూ! మంగళా! అలా పిలూ!"

"బావా!" అంటూ భుజం మీద తలాన్చింది మంగళ.

"మరొక్కసారి!"

"బా వా!"

"ఇంకొక్కసారి "

"బా వా !"

"ఇంకో " అనబోతున్న రాజు పెదవుల్ని అందంగా మూసేసింది మంగళ,

తూర్పు మరింత అరుణరాగ రంజితమైంది

సన్నని వెలుగు చీకటుల సమయంలో పక్షుల కిలకిలా రావాలతో ప్రకృతి మహాశోభగా ఉంది.

రివ్వు రివ్వున గాలి తెరలు వీస్తున్నాయి.

లింగ్ లింగ్ంగ్ లింగ్ మంటున్నాయి చిరుగంటలు

"మంగళా! గంటలేమంటున్నాయో విన్నావా?"

"ఏమంటున్నాయి?!"

"జై మంగళా—జై మంగళా

సమాప్తం



మానవతా జ్యోతి

శ్రీ తిలక్

వెండి మబ్బులు—తొలకరి చినుకులు
పౌర్ణమి రాత్రి—చల్లని గాలి
బంగరు చంద్రుడు—సముద్ర తీరం
సన్నని చినుకులుగా కురుస్తున్నది చీకటి
సంగీతం గంభీరంగా వినిపిస్తున్నాడు సాగరుడు
చంద్రునితో ఆడుకొంటున్నాయి తారకలు
మంద మలయ మారుతంతో మెలమెల్లగా పయనిస్తున్నాడు మేఘుడు
అల్లంత దూరంలో ఎవ్వరూ చూడకుండా
సాగరుణ్ణి అరుణాధరాలతో
వెచ్చగా ముద్దిడుకొంటున్నది ఆకాశం!
ఆ సమయంలో ఆమె
దివి నుండి భువి కవతరించి
తరంగాల మీద కురంగం వలె
చెంగు చెంగున కదిలి వచ్చింది!
కలువ రేకులు కావు ఆమె కనులు
సంపెంగ మొగ్గ కాదు ఆమె నాసిక
అరుణ గులాబీలు కావు ఆమె అధరాలు
పగడాల కుప్పలు కావు ఆమె కపోలాలు
నీల మేఘాలు కావు ఆమె కుంతలాలు
ఇసుక తిన్నెలు లేవు—అరటి బోదెలు లేవు
'అస్తి నాస్తి విచికిత్సా హేతు శాతోదరి' కాదు ఆమె
ఉజ్జ్వల సౌందర్య రాశి కాదు ఆమె!
కాని ఆమె మనోహర మూర్తి!
ఆమె ఊపిరిలో ఊపిరి నయి—తనువులో తనువు నయి
పుష్పం లాంటి ఆమెలో భ్రమరంలా నేను
లీనమయి ఏకమయి పోవాలని నేనెపుడూ కాంక్షించ లేదు!
ఆమె నా స్వప్న జగత్తులోనికి ప్రవేశించి
నన్నెపుడూ వేధించ లేదు!

నా టెక్ని కలర్ ఊహాచిత్రంలో
రొమాంటిక్ హీరోయిన్ కాలేదెపుడూ ఆమె!
కాని నేను ఆమెను ప్రేమిస్తున్నాను
నిజంగా—నూటికి నూరు పాళ్లు ప్రేమిస్తున్నాను
నా ప్రేమ భౌతికం కాదు—మానసికమూ కాదు!
నా ప్రేమ లౌకికం కాదు—అలౌకికమూ కాదు!!
నా దసలు ప్రేమే కాదు!
హృది నుత్తేజ పరిచే మృదువయిన భావం అది!
మనసు నాహ్లాద పరిచే మనోహర సుగంధం అది!
హృదయాన్ని స్పందింప జేసే మహత్తర దివ్యానుభూతి అది!
మనిషిని అత్యున్నత శిఖరాలకు తీసుకొని పోయే
అలౌకిక తన్మయ భావం అది!
అదే ఆరాధన అంటారేమో నాకు తెలియదు!
సెలయేటి నీటిలోని స్వచ్ఛత కన్పిస్తుంది ఆమె నయనాలలో
సుధాకరుని సుతి మెత్తని స్పర్శ ఒత్తుగా ఉంది ఆమె దృగంచలాలలో
పసిపాప నవ్వులోని అమాయకత గోచర మవుతుంది ఆమె చిరునగవులో
సంజ వెలుగు శోభ అత్యంత రమణీయంగా
ప్రదీప్తమవుతుంది ఆమె దరహసిత వదనంలో
అపుడే వికసించిన కుసుమంలోని
మార్దవం ఉంది ఆమె తనువులో
ఊహకందని ఉజ్జ్వల పవిత్రత
ప్రస్ఫుట మవుతుంది ఆమె అణువణువులో
ఆమెలో ఏదో మహిమాన్విత మధురిమ ఉంది
సముద్ర మంత గాంభీర్య ముంది
హిమాలయ మంత మనస్థైర్య ముంది
ఈ మనీషులలో నిద్రాణమయి ఉన్న మానవతకు
సుప్రభాతం పలికే చిలుకుల కొలికి ఆమె
ఈ యువకులలోని ప్రథమ యౌవన విశృంఖలత్వాన్ని
అణగ ద్రొక్కే అన్నుల మిన్న యామె!
ఏదో మహిమాన్విత భావానికి మారు రూపం ఆమె!
ఉజ్జ్వల మయిన పవిత్రతకు ప్రతి రూపం ఆమె!

ఉద్యోగ కల్పనా కేంద్రాల విధిగా ఖాళీల ప్రకటన చట్టం 1959 ప్రకారం

1. ఉద్యోగ పరిస్థితికి సంబంధించిన త్రైమాసిక-నివేదికను సకాలంలో పంపించాలి.

2. మీకు సంబంధించిన ఉద్యోగ కల్పనా కేంద్రానికి మీ సంస్థలోని ఖాళీలను తెలియబరచాలి.

3. ఉద్యోగ పరిస్థితికి సంబంధించిన ఏ సమాచారానైనా అడిగినప్పుడు అందజేయాలి.

చట్ట ప్రకారం నడుచుకుంటే శిక్షలుండవు.

వివరాలకు,

మీ దగ్గరలో వున్న ఉపాధి కల్పనా కేంద్రానికి వెళ్లి సంప్రదించండి.

ఉపాధి కల్పన, శిక్షణ డైరెక్టరు, ఆంధ్ర ప్రదేశ్,

హైదరాబాదు.

బెదురు

వి. రాజారామమోహనరావు

నేలమీదకి దిగొచ్చి నిలబడ్డ నల్లటి మబ్బులా వున్నాడు గంగన్న అసలే మనిషి నల్లటి నలుపు దానికి తోడు గన్నేరు చెట్టు నీడలో వున్నాడేమో మరింత నల్లగా కనపడ్డాడు ప్రయాణం హడావిడిలో వున్న ఆనందరావుకి

పిలుపు విని బయటికొచ్చిన ఆనందరావుని చూడగానే "టౌను కెల్తున్నారా" అన్నాడు గంగన్న గొంతు మొద్దుగా కాకపెట్టటానికి ముందు డప్పు చప్పుళ్ళా వుంది

అవునన్నట్టు తలూపాడు ఆనందరావు

అన్ని పల్లెల్లాగే ఆ పాలెం కూడా చాలా అవసరాలకి దగ్గర్లో వున్న టౌనుమీద ఆధారపడి వుంది. ఊళ్ళో ఎవరికి ఏ అవసరం వచ్చినా టౌను కెళ్ళేవాళ్ళకి చెపుతుండటం రివాజు గంగన్నకి టౌనులో ఏం అవసరం వచ్చిందో ఆనందరావు వూహకందలేదు

"మీరు బైల్దేరండి బస్సుకెళ్ళేంది రోడ్డుదాకా నేనూ వస్తా" అన్నాడు గంగన్న ఆనందరావు తయారయి ఇంటికి తాళం వేశాడు

ఇద్దరూ కలిసి నాలుగడుగు లేశారు. నలభై ఇళ్లు దాటారు అప్పటికీ గంగన్న నోరు కదపలేదు చివరకి ఆనందరావే అడిగాడు "సంగతేమిటి గంగన్నా" అని

"మరేం లేదండి" అన్నాడు గంగన్న ముందు. అని మరో అడుగు పడ్డాక. "అదేనండి మావోడు. నారిగాడు. వారం రోజుల్నించి కాపట్టం లేదండి." అన్నాడు

గంగన్న కొడుకు నారాయణ వారం రోజులుగా స్కూలుకి రావటంలేదన్న సంగతి అప్పుడు గుర్తొచ్చింది ఆనందరావుకి

"ముందు కంగారుపడి మనూరంతా ఎతికానండి టౌనుదాకా ఎల్తాడనుకో లేద రాత్రి మన పెద్ద పంతులుగారికి టౌనులో లక్ష్మీటాకీసు కాడ కనిపించాడంటండీ అసలు నేనే బైలుదేరి టౌను కెడదామనుకున్నాను పంతులుగారే వొద్దన్నారు నాగిగాడెందుకో బెదిరిపోయాడు ఆడితో నెమ్మదిగా మాట్లాడి మంచీ చెడూ ఎవరేనా తెలుసుకుంటే మంచిదన్నారండీ" అన్నాడు గంగన్న ఇద్దరూ వూరుదాటి నాగులడొంకదాకా వచ్చారు డొంక దాటితే రోడ్డు ఎండ కొద్దికొద్దిగా పెరుగుతోంది.

"మీరు ఎలాగేనా వోసారి ఆడిసంగతి

చూపిరండి. ఆడెళ్ళిన దగ్గర్నుంచీ మా పెద్దది తిన్నగా కూడు తింటం లేదండీ ... తమ్ముడూ, తమ్ముడూ అని వొకటే గోల. ఆళ్ళమ్మ పోయినకాణ్ణించీ అదే తల్లిలా పెంచిందండాడ్ని." అన్నాడు గంగన్న. ఆతృతని, బాధని బలవంతంగా అదుపులో పెట్టుకుంటున్నట్టుంది గంగన్న గొంతు.

"ఇల్లొదిలి ఎందుకెళ్ళిపోయాడు. ఏమేనా చెయిచేసుకున్నావా." అన్నాడు ఆనందరావు.

"అబ్బే లేదండీ. ఆణ్ణెవరం ఏం అనలేదండీ. ఎందుకెళ్ళిపోయాడో.... ఏంటో తెలియకుండా వుంది." అన్నాడు గంగన్న.

గంగన్న ముఖంచూస్తే జాలేసింది ఆనందరావుకి. సాధారణంగా వూళ్ళో ఎవరితోటి ఎక్కువగా మాట్లాడ్డు గంగన్న. మరీ తప్పనిసరైతే జంకుతూ మాట్లాడతాడు. దానికి తోడు ఇప్పుడు తండ్రి మనసు తాలుకు బాధ.

తప్పనిసరిగా లక్ష్మీటాకీసు దగ్గరకెళ్ళి నారాయణని కలుసుకుని విషయమేమిటో కనుక్కుంటానని చెప్పాడు ఆనందరావు. అయినా ఒకటికి రెండుసార్లు ఆనందరావు ఆ విషయంలో భరోసా ఇచ్చేవరకు తృప్తి పళ్ళేదు గంగన్న. పెద్దపంతులు ద్వారా విన్న వివరాలు, నారాయణ వున్న చోటు గుర్తులు ఆనందరావుకి పదేపదే చెప్పాడు.

అప్పటికే రోడ్డుమీద చింతచెట్టుకింద అయిదారుగురు బస్సుకోసం ఎదురు చూస్తున్నారు. నెమ్మదిగా వాళ్ళదగ్గరికి నడిచాడు ఆనందరావు. అసలే ప్రయాణమంటే చిరాకు. దానికితోడు బస్సెప్పుడొస్తుందో తెలియదు. వచ్చిన బస్సు ఆగుతుందో లేదో తెలియదు.

"పొద్దున్నేలకదండీ. కాయగూరాళ్లతో నిండిపోయుంటది. కార్ల చిట్టిగాడితో చెపుదామాండీ .." అన్నాడు గంగన్న.

ఆ దరిదాపులో వున్న అయిదారు పల్లెల్నించి పొద్దునే కూర తీసుకుని టౌను కెళ్ళి వ్యాపారం చేసేవాళ్ళెక్కువ. అందువల్ల పొద్దున్న బస్సులు రద్దీగా ఉంటాయి. ఆ విషయం ఆనందరావుకీ తెలుసు. గంగన్నమాట విన్నాక కార్ల చిట్టితో చెప్పడమే మంచిదనిపించింది. అక్కడి టీ బడ్డీలోనే వుంటాడు వాడు. వాడికీ కార్ల వాళ్ళకీ మంచి కాంటాక్ట్సు ఉన్నాయి. ఎంత రద్దీగా వున్నా బస్సెక్కించగలడు వాడు. పోతే వో రూపాయి ఫీజివ్వాలి.


గంగన్న వెళ్ళి కార్ల చిట్టితో చెప్పొచ్చాడు. వాడు సరేనన్నట్టు టీ బడ్డీలోంచే ఆనందరావు వేపు చూస్తూ సైగచేశాడు.

చెప్పాల్సిందంతా అయిపోయినట్టు చేతులు కట్టుకు నిలబడ్డాడు గంగన్న. ఆనందరావుకేం తోచక దిక్కులూచాశాడు. చెట్టుకిందవాళ్ళలో నలుగురు కూరగాయల వాళ్ళు. నలుగుర్లో ఇద్దరాడాళ్ళు. మోకాళ్ళపైదాకా కచ్చాపోసి కట్టారు. 'బస్సు రావటం ఆలిశ్యం' అన్నట్టు కొంగులు బిగించి నిలబడ్డారు.

అనుకోకుండానే ఆనందరావు కళ్ళు చూస్తున్నాయి. నున్నటి బలమైన వొళ్లు. నల్లగా నిగనిగలాడే పిక్కలు. మోటు పనులవల్ల పుచ్చి గట్టిగా వున్న పాదాలు. వెండి కడియాలు. ఇంకా చూపులు పైపైకి పాకుతుంటే బలవంతంగా తల తిప్పు

కున్నాడు. వయసు తాలూకు కోరిక ఎంత కాదనుకున్నా నేనూ వున్నా నంటోంది ఆనందరావులో. ముప్పై ఫ దాటుతున్న వయసు. కోరిక తెలిసిన ఆనందరావు ఆలోచనకి అప్పుడే పదేళ్ళు పైపడ్డాయి.

చదువయ్యాక నాలుగేళ్ళు నిరు ద్యోగంతో బాధపడి చివరికి యీ పల్లెటూళ్ళో టీచరుద్యోగానికి వచ్చా



డు. ఇది దొరకటమే మహాభాగ్య మనిపించింది. చేరింతర్వాత ఇబ్బందు లేమిటో తెలిసొచ్చాయి. పల్లెటూళ్ళో టీచరంటే, అందులో మేనేజి మెంటు స్కూల్లో మాస్టరుద్యోగ మంటే పిల్లలకి పాఠాల్చెప్పటం ఒక్కటే కాదని తెలియటానికి, ఎన్నాళ్ళో పట్టలేదు ఆనందరావుకి.

రాజకీయపు పార్టీలు .. కులాల పార్టీలు ..అంతస్థుల పార్టీ లు....అని పార్టీల నుంచీ వేరుగా వుంటూ....ఊళ్ళోని పెద్దమనుషుల ముందు అనేకరకాల కప్ప దాట్లు దాటుతూ బతకటం మహా ఇబ్బందిగా వుంది. ఎవరికి ఏ క్షణంలో ఏం తిక్క

పుడుతుందో ఎప్పుడు వుద్యోగం వూడుతుందో అన్న అనుమానం అనుక్షణం ఆనందరావులో కదుల్తూనే వుంది. అందుకని యీ వుద్యోగం భరోసాతో పెళ్ళి విషయం ఆలోచించటం అనవసరం అని నిర్ణయించుకున్నాడు.

ఆలోచన ఆడతనం మీదకి, కోరిక మీదకి మళ్ళినప్పుడల్లా ఆనందరావులో చిరాకు మరింత పెరుగుతోంది. గాలిరాని గదిలోపెట్టి బంధించిన జంతువులా వుంటోందతనికి.

"బస్సొస్తోందండీ... " అని గంగన్న చెప్పేవరకు ఆలోచనల్లోంచి తేరుకోలేదు ఆనందరావు. కార్ల చిట్టికూడా రోడ్డుమీద కొచ్చాడు.

ఆనందరావు బస్సెక్కాక.... "మళ్ళీ ఎప్పుడొస్తారండీ తిరిగి ." అనడిగాడు గంగన్న.

"రేపు సాయంత్రం ." అన్నాడు ఆనందరావు.

"నారిగాడికెలాగేనా సెప్పి ఎంటెట్టుకు రండి. అడొచ్చేవరకు మాకు కూడొంటట్టదు." అన్నాడు గంగన్న బస్సు కదుల్తుండగా.

ఆనందరావు 'సరే' నన్నట్టు తలూపాడు.

బస్సు రద్దీగా వుంది. ఓ పావుగంట తర్వాత బస్సులో ఓ చిన్న వూరు దగ్గర ఆగాక ఆనందరావుకి సీటు దొరికింది. బైటకి చూస్తూ కూచున్నాడు.

పచ్చటి పొలాలు, కాలవ. కాలవలో గేదెల్తో కలిసి చిన్నపిల్లల దిగంబర స్నానాలు. ఒక్కొక్కటే కదుల్తూ వెనకపడుతున్నాయి. ఉన్నట్టుండి బస్ స్పీడ్ తగ్గింది. ఎవరిదో శవం. డప్పుల మోత.

అది చూడగానే తిరిగి గంగన్న గుర్తొచ్చాడు ఆనందరావుకి. ఎనిమిదినెలల క్రితం పాలెంలోకి మొదటిసారి అడుగు పెట్టినప్పుడు నాగుల డొంకదగ్గర ఎదురొచ్చాడు గంగన్న. ఊళ్ళోకి దారి అదేనా అని అడిగి మునసబుగారిల్లు అడిగాడు ఆనందరావు. గంగన్న కూడా వుండి మునసబుగారిల్లు చూపించాడు. దార్లో వాడు మాట్లాడినవి రెండే మాటలు.

"నన్ను మాదిగ గంగన్నంటారండి." అని చెప్పుకోటం.

"మీ ఇళ్ళోనే మా నారిగాడు సదూతున్నాడండీ " అంటం. ఆ రకంగా పాలెంతాలూకు మొదటి పరిచయస్తుడు గంగన్న. ఆ తర్వాత గంగన్న పనిపాటల గురించి తెలిసింది. చావులకి, దండోరాలకి డప్పుకొడతాడు. ఖాళీ సమయంలో చెప్పులు కుడతాడు. గొడ్డూగోదా పోతే వాటి ఆఖరిప్రయాణం చేయించు సొంతదారుల ఇబ్బంది తగ్గిస్తాడు. ఇదీ గంగన్న బతుకు.

ఆ తర్వాత చాలాసార్లు గంగన్నని చూశాడు ఆనందరావు. ఎప్పుడు చూసినా నిరుత్సాహంగా కనిపించేవాడు. ఏనాడూ గంగన్న సంతోషంగా నవ్వగా చూళ్ళేదు ఆనందరావు.

ఎప్పుడో మాటల సందర్భంలో ఎవరో చెప్పగా తెలిసింది ఆనందరావుకి దానికారణం. భార్య బతికున్న రోజుల్లో గంగన్నకి, ఈ గంగన్నకి పోలికే లేదని. గంగన్న భార్య చావుకి కారణం ఇదంటూ

సుభాషితాలు

వివేకం కలవాడెప్పుడూ క్షమార్పణ కోరదు. —ఎమర్సన్



వో కథ కూడా ప్రచారంలో వుంది. ఎవరో కామందు బలవంతంగా లోబరుచుకున్నాడని, ఆ తర్వాత జీవితంలో సర్దుకోలేక మంచమెక్కి తీసుకుని, తీసుకుని పోయిందని, కాదు ఏదో మింగిందని దానివల్లే కోలుకోలేక పోయిందని. ఏది ఏమైనా భార్యపోయాక గంగన్న పూర్తిగా జంకిపోయాడు.

ఇప్పుడు గంగన్న ప్రపంచం చీకటి పడేసరికల్లా రెండు ముంతల కల్లు. వాడి కూతురు, కొడుకు.

గంగన్న సంగతంతా గుర్తొచ్చాక అశ్రద్ధ చెయ్యకుండా నారిగాడి సంగతి కనుక్కోవాలనుకున్నాడు ఆనందరావు. పన్నెండేళ్ళవాడు ఇల్లొదిలేసి అంతదూరం పారిపోయాడంటే ఏదో బలమైన సంఘటనే జరిగుండాలనుకున్నాడు ఆనందరావు.

* * *

తన పనులు చూసుకుని ఆనందరావు లక్ష్మీటాకీసు దగ్గరికెళ్ళేటప్పటికి రెండో ఆట మొదలైంది. గంగన్న చెప్పిన గుర్తుల ప్రకారం వెతుక్కుంటూ టీకొట్టు చేరాడు. సినిమా హాలుకి పందగజాల్లో వుంది. నారిగాడి గురించి అడిగితే ...

"ఎవడు నల్లగా, సన్నగా ఉంటాడు. చీకిరికళ్ళు .. వాడేనా ." అన్నాడు, చిన్న రాగి బాయిలర్ ముందు నిలబడి టీ కలుపుతున్నతను. అవున్నన్నట్టు తలూపాడు ఆనందరావు. కొట్టుకి అతనే యజమాని కాబోలు అనుకుంటూ.

లోపల కప్పులు తీస్తున్న కుర్రాడివేపు తిరిగి "మన నర్లోడురా" అన్నాడు అతను.

"కూచోండి బైటికి టీ పట్టికెళ్ళాడు. వచ్చేస్తాడు." అన్నాడు.

లోపల గోడలవారగా మూడు పొడు గాటి చెక్కబల్లలున్నాయి. బాయిలర్‌కి పక్కగా వున్న టేబుల్‌మీద వో పెద్ద సిల్వర్ బేసిన్‌లో జంతికలు, మరో బేసిన్‌లో మిరపకాయ బజ్జీలు వున్నాయి. వాటి పక్కగా గాజు అద్దాల పెట్టెలో బన్‌రొట్టెలున్నాయి.

ఓ బల్ల చివరగా కూచున్నాడు ఆనంద రావు.

"టీ తాగుతారా" అన్నాడు బాయిలర్ మనిషి.

'అక్కర్లేదన్నట్టు' తలూపాడు ఆనంద రావు.

కొట్టుకి అనుకునే పెద్ద మురిక్కాల వుంది. ఎవరేనా కొట్లోకి రావాలంటే దాన్ని దాటేరావాలి. కొట్లో అయిదారుగురు టీలు తాగుతూ గట్టిగా మాట్లాడుకుంటు న్నారు. యాభై అరవై మంది కలిపి అరిచినట్టుంది వాళ్ళ సంభాషణ. మిరప కాయ బజ్జీలు తింటూ విరివిగా బూతులు నంజుకుంటూ టీ తాగుతూ

"ఆ లక్ష్మి తిన్నగా వుండదు కానీ... డబ్బులు మటుకు తెక్కావాలిరా ..." అంటున్నాడు వొకతను.

"మీ ప్రొప్రయిటర్ మరో బెంజి కొన్నాడటగా." అంటున్నాడు ఇంకొ కతను.

మురిక్కాలవ ముక్కులు బద్దలు చేస్తోంది. 'వాళ్ళందరికీ అలవాటైపోయి వాసన తెలియటం లేదులా వుంది ..' అనుకున్నాడు ఆనందరావు.

వచ్చి పావుగంటైనా నారిగాడి జాడ లేదు. ఇంక వుండబట్టలేక "వాడు రావటానికి ఇంకా బాగా ఆలిశ్యమవు తుందా ..." అనడిగాడు ఆనందరావు కొట్టతన్ని.

"వచ్చేయాలండీ. ఒకోసారి అక్క డోళ్ళు ఆలిశ్యం చేస్తారు డబ్బులివ్వ టానికి. కుర్రాణ్ణి పంపి పిలిపించమంటారా" అన్నాడు.

ముందు 'సరే' అందామనుకున్నాడు ఆనందరావు. ఎవరో వచ్చారని తెలిస్తే నారిగాడు అసలు రాకపోవచ్చని అను మానం వొచ్చి.

"కుర్రాణ్ణి పంపండి. కూడా నేనూ వెడతాను." అన్నాడు.

"అబ్బే మీరెల్లే చోటు కాదులెండి. కుర్రాడెళ్ళి పిలుస్తాడు" అంటూ లోపల బల్లలు తుడుస్తున్న కుర్రాణ్ణి పిలిచాడు.

ఆనందరావు పరవాలేదని ఒకటి రెండుసార్లు అన్నాక వొప్పుకున్నాడు కొట్టతను.

ఆ కుర్రాడు కొట్టుకి ఎడంచేతివేపుగా వున్న సందులోకి తీసుకెళ్ళాడు. పెద్ద వెలుగ్గాలేదు సందు. పెంకుటిళ్ళు పాకలు కలగాపులగంగా వున్నాయి. ఇంచుమించు అన్ని ఇళ్ళల్లోనూ లైట్లు వెలుగుతూనే వున్నాయి.

"మీరిక్కడే వుండండి. నేచూసొస్తా" అంటూ కుర్రాడు వోయింట్లో కెళ్ళాడు. వెళ్ళిన ఇంట్లోంచి వెంటనే తిరిగొచ్చి . "ఇక్కడలేదండీ ఆ ఇల్లు చూద్దాం రండి" అంటూ మరో పెంకుటింటివేపు నడిచాడు. చీకటి.. .గుమ్మాల దగ్గర ఆడాళ్ల తార ట్లాటం .ఆ సందు వాతావరణం కొంత వరకు గ్రహింపుకొచ్చింది ఆనందరావుకి.

సుభాషితాలు

నడచినా పరుగెత్తినా నౌకలో వెళ్ళినా ఎవరు మాత్రం ఎక్కడకు పోగలరు? ఎవరూ తమ స్వభావాల నుంచి ఎడంగా పోలేరు. —శ్రీశ్రీ



ఆనందరావు ఆ ఇంటి ముందు కొచ్చే టప్పటికి ఏదో రిక్షా కదిలి వెళ్ళిపోయింది. గుమ్మంవరకూ వచ్చిన ఆ మనిషి "రండి రండి" అంటూ ఏదో గొణిగింది. ఆనంద రావు కూడా వున్న కుర్రాడు.

"ఆయన అందుక్కాదులే మీకుటీలు తెచ్చే నల్లోడికోసం వచ్చారు" అన్నాడు.

ఆనందరావు బలవంతంగా అణిచి పెడుతున్న కోరిక వొక్కసారి స్వల్పంగా స్పందించింది. ఒక్కదుటున ప్రవాహంలా బుర్రలోకి ఏవేవో వూహలు తోసుకొచ్చాయి. తటపటాయిస్తూ మెట్లదగ్గరే నిల బడ్డాడు.

లోపలకెళ్ళిన కుర్రాడు తిరిగొచ్చాడు "నల్లాడొస్తున్నాడండీ" అంటూ.

లోపలనుంచి ఏవేవో మాటలు విని పిస్తున్నాయి. నారిగాడు నత్తలా లోపలి గదిలోంచి నడుచుకుంటూ వొస్తున్నాడు. చేతిలో ఖాళీ గ్లాసులున్నాయి. సరిగ్గా వాడు వీధిలోకి రాబోతుండగా లోపల్నించి పరిగెత్తుకుంటూ వొచ్చింది అంతకు ముందు ఆనందరావుని పిలిచిన మనిషి.

"వొరే నల్లోడ అరిజంటుగా మంచి టీ రెండు బజ్జీలు పట్రా ఆలిసంచెయ్యకు" అంది.

సరే అంటూ వచ్చేయబోయాడు నారిగాడు.

"ఎప్పుడూ అలాగే అని గంటక్కాని రావు. ఇప్పటికే ముగ్గురయ్యారు. ఇవాళ గిరాకీ బావుంది. ఇంకొక మడిసి కూచు

మన్నాడు. నీరసం వొస్తోంది తొందరగా రాయే" అంది.

ఆనందరావు వొళ్ళు వొక్కసారిగా చల్లబడింది.

పని హడావిడిలో ఖంగారుగా టీ తాగే రిక్షా వాళ్ళలాగా, లారీ వాళ్ళలాగ వీళ్ల కూడా వోపిక్కోసం .ఇంక ముందుకి సాగలేదు. ఆనందరావు ఆలోచన.గబగబా చాలా విషయాలు గుర్తొచ్చాయి. వాటిలో తిన్నగా రిఖాణాలేని తన బతుకు ...పెళ్ళి ...రోజు రోజుకి వొళ్ళు పెంచుకుంటున్న కోరిక. యీ చీకటిసందు ఈ వాతావరణం లోనా నారిగాడుంటున్నది అనుకున్నాడు.

"మీరా మాస్టారు." అని నారిగాడు అనేవరకు ఆనందరావు తేరుకోలేదు.

"నేనేలే రా" అంటూ ముందుకి నడిచాడు.


ఇద్దరూ టీకొట్టు దగ్గరికొచ్చారు. నారిగాడితో కాస్సేపు మాట్లాడేపనుందని కొట్టతనితో చెప్పి వెంటపెట్టుకుని సినిమా కేంటిన్‌లోకి తీసికెళ్లాడు.

టిఫెన్ తెప్పించి నారిగాణ్ణి తిన మన్నాడు ఆనందరావు. వాడు కట్టుకున్న బట్టలు బాగా మాసిపోయాయి. టీమరక ల్తోటి అలుగ్గుడ్డలా వున్నాయి. వంచిన తలెత్తకుండా తింటూ కూచున్నాడు.తలెత్తి

సుభాషితాలు

కొందరు మననుంచి విమర్శ కోరుతారు కాని, వారికి కావలసింది పొగడ్త.

—మామ్



ఆనందరావు వేపు చూళ్ళేకపోతున్నాడు.

"మీనాన్న ఏమేనా అన్నాడేరా." అన్నాడు నెమ్మదిగా ఆనందరావు.

లేదనట్టు తలూపాడు నారిగాడు.

"మరి ఎందుకు పారిపోయొచ్చినట్టు." అనడిగాడు.

ఆనందరావు ఒకటికి రెండుసార్లు అడిగినా నారిగాడేం బదులు చెప్పలేదు. నెమ్మదిగా నచ్చచెప్పి అనేక రకాల భరోసా యిచ్చాక అరగంటకి నెమ్మదిగా నసుగుతూ చెప్పాడు.

"నాకు భయం వేసిందండీ" అని నెమ్మదిమీద నారిగాడు చెప్పిన వివరాలు విన్నాక ఆనందరావుకి ఆశ్చర్యంవేసింది.

"అలా శావాలకూడా డప్పువాయించటం నాకు బయమండి. అయ్యాకి ఎన్ని సార్లో చెప్పాను. ఇనడు. 'బయమేంటిరా కూడా నేను లేను.' అని తిట్టి తీసికెడుతున్నాడండి." అన్నాడు

"పోనీలే నిన్ను డప్పువాయించటానికి తీసికెళ్ళద్దని మీ నాన్నకి నేను గట్టిగా చెపుతాను రా మనూరెళ్ళిపోదాం. హాయిగా చదువుకుందువుగాని" అన్నాడు ఆనంద రావు.

ఏమేనాసరే రానన్నట్టు తల అడ్డంగా వూపాడు నారిగాడు. వాడిలో భయం బాగా పాతుకుపోయిందని గ్రహించాడు ఆనంద రావు. బలవంతంపెట్టి తీసికెళ్ళినా ప్రయోజనం వుండేలా తోచలేదు.

"టీలు మోసే ఈ పనేం బావుందిరా.

శుభ్రంగా చదువుకునే వయసునీది. అసలు చదువుకోవాల్నిలేదా." అన్నాడు ఆనంద రావు.

"చదువుకుంటానండి కానీ మనూరు రాను." అన్నాడు నారిగాడు.

"సరేలే మనూరు రావద్దులే కానీ నే చెప్పినట్టు చేస్తావా." అన్నాడు ఆనంద రావు.

'సరే' అన్నట్టు తలూపాడు నారిగాడు.

బిల్లుకట్టేసి నారిగాడితో కలిసి టీ కొట్టు వేపు నడిచాడు ఆనందరావు.

* * *

మర్నాడు సాయంత్రం పాలెం తిరి గొస్తున్న ఆనందరావుకి తృప్తిగా వుంది. ఆ పసివయసులో, అటువంటి దారుణమైన వాతావరణంలో చీకటి సందులో నలుగు తున్న నారిగాడి జీవితాన్ని మరోదారికి మళ్ళించగలిగినందుకు ఆనందంగా వుంది. అన్నింటికన్నా తను చేసినపనికి గంగన్న మురిసిపోతాడని తలుచుకోగానే ఎంతో హాయి అనిపించింది ఆనందరావుకి. ఈ రకంగానేనా గంగన్న ముఖంలో సంతో షం చూడచ్చు అనుకున్నాడు. ఉత్సా హంలో గంట ప్రయాణం అరగంటలా తోచింది ఆనందరావుకి. పాలెంలో బస్సు దిగుతుండగానే ఎదురుగా గంగన్న కని పించాడు. ముఖంలో ఆతృత కొట్టొచ్చి నట్టు కనిపిస్తోంది. ఆనందరావు బస్సు దిగినా. మునిగాళ్ళ మీద లేచి బస్సంతా కలయచూస్తున్నాడు గంగన్న.

"నారిగాడికోసమేనా వాడు రాలేదు గంగన్నా." అన్నాడు ఆనందరావు. అయోమయంగా చూశాడు గంగన్న ఆనందరావువేపు.

"అయినా వాడికేం పరవాలేదు. అన్ని ఏర్పాట్లు చేసొచ్చాను చెపుతాను పద." అన్నాడు అయిష్టంగానే ఆ బస్సుని వొదల్లేనట్టే చూస్తూ ఆనందరావుతో నడిచాడు గంగన్న.

ఇద్దరూ నాగుల డొంకచేరే లోపల వివరాలన్నీ చెప్పాడు ఆనందరావు. నారిగాడి భయానికి కారణం. వాడు చేస్తున్నపని,వాతావరణం అన్నీచెప్పాడు.

"వాణ్ణిప్పుడు బలవంతంగా తీసుకొచ్చి వుపయోగం లేదు గంగన్నా అందుకని టౌన్లో నా స్నేహితుడు నాలాగే మాస్టరు వున్నాడు. అతని దగ్గర వుంచాను. అతనూ వొండుకుతింటున్నాడు వోకుర్రాడి అవసరం అతనికీ వుంది. నారిగాణ్ణి మన కన్నా జాగ్రత్తగా చూసుకుంటాడు. అక్కడే స్కూల్లో చేరుస్తాడు. నువ్వేం బెంగపెట్టుకోకు. ఇక్కడి గొడవల్లోకన్నా అక్కడే శుభ్రంగా చదువుకోని" అన్నాడు ఆనందరావు.

అన్నీ విన్నాక గంగన్న ముఖం మరింతగా మాడిపోయింది తప్ప ఏ మాత్రం ఆనందం కనపడలేదు. ఆనంద రావు అడక్కముందేనెమ్మదిగా చెప్పాడు.

"అదిపోయిన కాడ్నించి పిల్లల్ని సూసుకునే బతుకుతున్నాను బాబు.ఇప్పుడు ఈడూ దూరమైపోయాడు." అన్నాడు.

నిండుగా నీళ్ళు దాచుకున్న మబ్బులా వుంది గంగన్న ముఖం.

"అలా ఇదైతే ఎలా గంగన్నా. నారి గాడు చదువుకుని బాగుపడుతున్నందుకు

సంతోషించక ఇలా బాధపడితే ఎలా." అన్నాడు.

"ఏం చదువో బాబు. ఆడు నాకు దూరమైపోయాడనే కాదు బాబు. ఈ చదువులమీద నమ్మకం ఏంటి బాబు. మునసబుగారబ్బాయి, సౌదరీగారబ్బాయి అంతపెద్ద చదువులు చదివి మనూళ్ళో వూరికేతిరగటంలా. సదువుకున్నాళ్ళందరూ ఎంత సుఖపడుతున్నారో మీకు తెలవదా బాబు." అన్నాడు గంగన్న.

ఆనందరావుని కొరడాతో కొట్టినట్టు వులిక్కిపడ్డాడు ఆ మాటలకి. "తనూ చదువుకున్నాడు. తన బతుకు సుఖంగా వుందా." ఇంకా ఆనందరావు ఆలోచన ముందుకి సాగకముందే.

"అందుకనే బాబూ ఆడు బయమన్నా డప్పు వాయించటం నేర్పుదామనుకున్నా చెప్పులు కుట్టటం నేర్పుదామనుకున్నా ఏదో పని చేతిలోవుంటే ఎక్కడోఅక్కడ గంజినీళ్ళైనా తాగుతాడు." అన్నాడు గంగన్న తిరిగి.

ఆనందరావుకి ఏమంటానికీ తోచలేదు. గంగన్నకి ఎలా నచ్చ చెప్పాలో తెలియ లేదు.

ఇంకా ఎంతమంది తల్లి తండ్రులకి పిల్లల చదువుల విషయంలో ఇలాంటి బెదురుందో అనిపించింది. వోదార్పుగా గంగన్నకి ఏవేవో చెపుదామనుకున్నాడు. కానీ గొంతు పెగల్లేదు.

చదువుని వుద్యోగంకోసం. బతుకు తెరువు కోసమేకాకుండా విజ్ఞాన సాధనంగా జీవితంలో చాలా సమస్యల్ని ఎదుర్కొనే ఆలోచనకి అవసరమైందానిగా గంగన్న ఆలోచించలేడని ఆనందరావుకి తెలుసు.

చివరికి ఎలాగో నానాయాతనాపడి అనేక రకాలుగా గంగన్నకి నచ్చచెప్పాడు. ఊళ్ళోకి వచ్చేదాకా చెపుతూనే వున్నాడు. గంగన్న సమాధానమేం చెప్పలేదు. తప్పనిసరై వొప్పుకున్నట్టు తలాడించాడు తప్ప....

ఆనందరావు ఇంటిదగ్గర కొచ్చేవరకు ఇద్దరూ అలా మాట్లాడుతూనే వున్నారు.

అక్కడ ఆనంధరావుని వొదిలి వెళ్ళే ముందు నెమ్మదిగా తలెత్తి "ఎల్తానండి" అని దణ్ణం పెట్టాడు గంగన్న. గంగన్న వేపు చూస్తూ సరేనన్నట్టు తలూపాడు ఆనందరావు.

అన్ని రకాలుగా ధైర్యంగా చెప్పినా గంగన్న కళ్ళల్లో ఇందాకటి బెదురు పూర్తిగా తొలగలేదన్నది స్పష్టంగా కనపడింది ఆనందరావుకి.

ప్రోగ్రెస్ అవుతున్న సొసైటీలో నమ్మకం పెరగాలి ధైర్యం పెరగాలి. కానీ బెదురు అనుమానం పెరుగుతున్నా యనిపించే టప్పటికి గంగన్నకన్నా ఎకు వుగా కుంగిపోయాడు ఆనందరావు.



భూమి గుండ్రంగా వుందా,

చతురస్రంగా వుందా?

అభ్యుదయ వాదులు భూమి గుండ్రంగా వుందన్నారు. సంఘ వ్యతిరేక శక్తులు చతురస్రంగా వుందన్నారు. ఎవరి మాట నమ్మేది మనం! ఇంతలో 20 సూత్రాల పథకం వచ్చి రూపం ఎలా వున్నా భూమి మీద హక్కు, అనుభవమూ అందరికీ వుండాలన్నది.

భూస్వాములనీ, భూమి లేని పేదలనీ వ్యత్యాసం యిక తగ్గిపోతుంది. మన రాష్ట్రంలో భూసంస్కరణల ఉద్యమం వేగంగా జరుగుతున్నది. ఇప్పటికే 22 లక్షల ఎకరాల మిగులు భూమి పేద వారికి పంచారు.

దేశంలో అదనంగా 50 లక్షల హెక్టార్ల భూమిని సాగులోకి తేవాలని ప్రధాని ప్రకటించారు. మన రాష్ట్రంలో నీటి పారుదల సౌకర్యాలు విస్తరించి, మరో 7 లక్షల హెక్టార్లకు పైగా సాగు చేసే ప్రయత్నం జరుగుతున్నది.

వ్యవసాయ కార్మికుల కష్టాలు గట్టెక్కాయి. వారే రైతులై పంటలు పండించే శుభదినాలు వచ్చాయి. స్వంత భూమి సేద్యం చేసుకునేందుకు ఋణాలు యిస్తారు. అన్ని సౌకర్యాలు కల్పిస్తారు.

సమాచార పౌరసంబంధశాఖ,

హైదరాబాదు.

కృష్ణా ఎక్స్‌ప్రెస్సులో దిగింది విమల.

సికిందరాబాద్ రైల్వేస్టేషన్ మహా రద్దీగా వుంది. విమలకి భాగ్యనగరం కొత్త. అందుకే భయం భయంగా దిగి స్నేహితురాలు జలజ కోసం వళ్ళంతా కళ్ళు చేసుకుని చూసింది. అయిదూ పది నిమిషాలు అయిపోయింది. అందరూ వెళ్ళిపోతున్నారు. చాలామంది వెళ్ళి పోయారు కూడా.



జలజ ఇంటి అడ్రెస్ దగ్గర వుంది. ఎలా వెళ్ళాలో కూడా వాళ్ళ నాన్న ప్లాన్ వేసి చూపాడు కూడా. తను వస్తున్నట్లుగా వుత్తరం రాస్తే జలజ స్టేషనుకి రాకుండా వుంటుందని అనుకోలేదు. తనకి పిచ్చి భయంగానే ఇదే మన్నా ఫారెనా! తెలుగు దేశం. ఛీ భయపడకూడదు అనుకుని తనకి తనే ధైర్యం చెప్పుకుని స్టేషన్ బయటికి వచ్చేసింది విమల.

'ఆటో' పెద్ద తెల్సినదానిలా ఆటోని పిల్చి సూట్‌కేస్ లోపల పెట్టుకుని కూర్చుని జలజ అడ్రెస్ చెప్పింది. ఆటో అతను మాట్లాడ కుండా ఆటోని పోనిస్తున్నాడు. జలజని నాలుగూ దులిపెయ్యాలి అన్న కోపంతో కూర్చుంది. ఆటో వేగంగా వెడుతూ వుంది. విమల ఆలో చనలూ అంతకంటే వేగంగా వెనక్కి వెళ్లాయి. జలజా విమలా చిన్నప్పటి స్నేహితులు. ఇద్దరూ హైస్కూలు చదువు ముగించారు. విమలని తండ్రి కాలేజీలో చేర్పించాలని ప్రయత్నిస్తుంటే అతి సామాన్యుడైన జలజ తండ్రి ఇంక నేను చెప్పించలేను అనటంతో జలజ విమల దగ్గరకి వచ్చి భోరుమంది. విమలకే కాక విమల తల్లిదండ్రులకి కూడా జలజ అంటే అభిమానం. అందుకే ఆ అమ్మా

యిని ఓదార్చటమేకాక "ఇద్దరూ కల్సి చదువుకుంటారుగా. బుక్స్ కల్సివస్తాయి ఇంక జీతం విషయం నే కొంత సాయం చేస్తానులే" అని ధైర్యం చెప్పి జలజనీ కాలేజీలో జాయిన్ చేశారు. దాదాపు డిగ్రీ చదువు అయేవరకూ ఆయన తన మాట నిలబెట్టుకున్నారు. అయితే కాలేజీలో చేరిన తర్వాత జలజలో ఏదో తెలియని మార్పు రాసాగింది. విమల అంటే అసూయపడటం ప్రారంభించింది. ఈ భావం బైటపడకుండా చాలా జాగ్రత్తగా వుండాలని ప్రయత్నిస్తోంది. విమల అసలు ఇదేమి పట్టించుకోని అమాయకురాలు. జలజని అభిమానించడం మాత్రమే తెల్సు. సహజంగా విమల అందంగా వుంటుంది. అందులోనూ తండ్రికి మంచి వుద్యోగం కావటంవల్ల మంచి బట్టలూ అవీ వేసుకుని చూసేవాళ్ళని ఇట్టే ఆకర్షించేది.

అబ్బాయిలు విమల అంటే పడి చచ్చే వాళ్ళు. కానీ విమల అదేం పట్టించుకునేది కాదు. తన చదువూ ఇల్లూ స్నేహితురాలు జలజా. ఇదే ప్రపంచం. ఇద్దరూ ఇలా చదివి బి.ఏ., పాస్ అయారు. జలజ అన్నగారు భాగ్యనగరంలో వుండటంతో సిటీకి వచ్చి వుద్యోగం చేస్తూ ఎం.ఏ., పాస్ అయింది. లెక్చరర్ వుద్యోగం సంపాదించుకుంది. విమల తండ్రి పోవ టంతో సంసార పరిస్థితి తారుమారై చదువు ఆపేసి ఖాళీగా వుండిపోయింది. తల్లి పెళ్ళిప్రయత్నం చేస్తూంది. కానీ ఒక్కటీ కల్సిరాలేదు. విమల గాభరా పడి పోయింది. ఇటు చదువూ లేదు, అటు వుద్యోగమూ లేదు. పోనీ పెళ్ళి కల్సి రావటంలేదు. ఎన్నాళ్ళని వచ్చిపోయే పెళ్ళి కొడుకుల ఎదుట ప్రాణంలేని బొమ్మలా కూర్చుంటుంది. కట్నాలు ఇవ్వలేని తన కూతురికి పెళ్ళి అవదా! అని దిగులు పడింది విమల తల్లి. విమల ఆలోచించి జలజకి వుత్తరం రాసింది. "నే వచ్చేస్తు న్నాను నీ దగ్గరికి. ఓ చిన్న వుద్యోగం చూపిపెట్టు" అని.

జవాబుకోసం చాలారోజులు ఎదురు చూసి విసిగి తనే బయలుదేరి వస్తూ ఫలానా రైల్లో వస్తూన్నా అని రాసింది. అయినా స్టేషనుకి రాలేదు జలజ.

"నా వుత్తరాలు అందలేదా! ఒకవేళ ఇల్లు మారివుంటారా! అలా జరిగితే నేనేం చేయాలి."ఎన్నెన్నో ఆలోచనతో సతమత మౌతుంది విమల.

ఇల్లు తెల్సుకోవటం కాస్త కష్టమైనా మొత్తానికి దొరికింది. 'అమ్మ య్య' కొండంత ధైర్యం వచ్చేసింది విమలకి. జలజ ఎం.ఏ., అన్న బోర్డు చూసేసరికి ఆటో మీటర్ చూసి డబ్బు ఇచ్చేసి సూట్ కేస్ తీసుకుని మూసి వున్న తలుపు తట్టింది. చెదిరిపోయిన జుత్తు సరిచేసు కుంటూ కర్చీఫ్‌తో ముఖాన పట్టిన చెమట తుడుచుకుంటూ.


రెండు నిమిషాల్లోనే తలుపు తెరుచు కుంది. ఎదురుగా లావుగా పొట్టిగా వున్న ముప్పై ఏళ్ళ యువకుడు నిల్చుని 'ఎవరి కోసం' అన్నట్లుగా చూశాడు. విమలనీ విమల చేతిలోవున్న సూట్ కేస్‌నీ.

"నాకూ.... నాకు ... జలజ కావాలి!' జలజ భర్త కాబోలు అనుకుంటూ.

వెళ్ళింది. మూడింటికి కానీ రాదు. అన్నట్టు

సుభాషితాలు

సాటి మానవుల కష్టాన్ని ఏ మేరకు తొలగించగలిగినా ఆ మేరకు ఆ వ్యక్తి ఘనవిజయాన్ని సాధించినట్టే. —మహాత్ముని సూక్తి



మీరు "

"నేనూ నేను జలజ ఫ్రెండ్ విమలని నేవస్తూన్నట్లుగా వుత్తరం కూడా రాశానే "

''అలాగా! రండిలోపలికి గోవిందూ ఇలారా" కేకపెడుతూ పక్కకి తప్పుకున్నాడు విమలకి యేంచేయాలో తోచలేదు. బైట యెండ మాడ్చేస్తోంది అది భరించలేక లోపలికి వచ్చేసింది. నౌకరు కుర్రాడు వచ్చి సూట్‌కేస్ అందుకున్నాడు 'రండమ్మా' అంటూ పిల్చాడు యజమాని ముఖంలోకి చూసి అర్థమైనట్లుగా తలవూపుతూ.

"ముందు మంచినీళ్ళుఇచ్చి కాఫీఇవ్వు తర్వాత స్నానం భోజనంచూడు" అతను మర్యాదచేస్తూన్నందుకు తృప్తిగా వుంది కానీ కొత్తకావటంవల్ల చాలా బెరుగ్గా వుంది. గోవిందు అయిదునిమిషాల్లోనే వేడి కాఫీతెచ్చి యిచ్చాడు విమల కాఫీ తాగుతూ ఇల్లు అంతా పరీక్షగా చూసింది.

ఇల్లు అంతా నీట్‌గా సర్దివుంది సోఫాలో కిటికీలకి దర్వాజాలకీ తెరలూ వగైరా చూస్తే జలజ ఆడంబరంగానే బ్రతకగల్గుతోంది అన్పిస్తోంది ఈయనకి యేం వుద్యోగమో తెలియదు. జలజ ఇతని వివరాలు తెల్పలేదు బహుశా పెద్ద వుద్యోగమే అయివుండచ్చు

ఆలోచనల్లోనే స్నానంచేసింది. కాస్త హాయిగా అన్పిస్తోంది.

"అమ్మా భోజనం వడ్డించాను"విమల

భోజనం చేస్తూండగా జలజ భర్త శంకర్ కర్టెన్ తప్పించుకుంటూ వచ్చి.

"మీరు భోజనం చేసి విశ్రాంతి తీసుకోండి జలజకి ఫోన్‌చేశాను త్వరగా వచ్చేస్తుంది నాకు అర్జెంట్‌పని వుంది. బైటకి వెళ్లాలి మీకు యేంకావాలన్నా గోవిందు వుంటాడు.''

'సరే'అన్నట్లుగా తలవూపింది విమల అతని మర్యాదకి మాత్రం చాలా తృప్తి పడింది పరిచయం లేకున్నా గౌరవించినందుకు శంకర్ వెళ్ళిపోయాడు అందగాడు కాకపోవచ్చు కానీ మంచివాడులా వున్నాడు జలజ అదృష్టవంతురాలు అనుకుంది

గోవిందు వీధితలుపు వేసి లోపలికి వచ్చాడు విమల భోజనం కాగానే ఓ గది చూపించి "లగేజి పెట్టి అక్కడ పెట్టాను ఏంకావాలన్నా పిలవండి"అంటూ హాలులోకి వెళ్ళి యేదో పుస్తకం చదువుకుంటూ కూర్చున్నాడు పచ్చాలుగేళ్ళ గోవిందు. విమలకి చాలా అలసటగా వుంది నిద్రముంచుకు వస్తోంది ఆ గది అంతా పరీక్షగా చూసింది ఓ మంచం దానిమీద తెల్ల దుప్పటీ రెండు దిళ్ళూ చిన్న టేబిలూ ఓ రెండు కుర్చీలూ బట్టల స్టాండు వున్నాయి అంతే.

మంచంమీద కూర్చుని ఆలోచిస్తోంది జలజ లేకుండానే దాని ఇంట్లో ఇలా వచ్చి కూర్చుంటానని ఎప్పుడూ అనుకోలేదు ఇంక అది ఎలావుందో! చాలా మార్పు వుండివుంటుంది! నేనిలా వచ్చేయటం మంచిదా! చెడ్డదా! ఏమో! సరే' వచ్చేశాను ఇంక ఆలోచించటం అనవసరం అనుకుని దిండు మీదవాలింది విమల. ఆ గదిలో గోడకి జలజ చిన్నప్పటి ఫోటో ఒకటి తగిలించి వున్నది చూస్తూ అలాగే పడుకుంది విమల

తెలియకుండానే నిద్రముంచుకు వచ్చేసింది.

2

"ఏవ్' మొద్దు! లే " అన్న జలజ పిలుపుకిగానీ మెలుకువ రాలేదు విమలకి. కళ్ళు తెరిచి జలజని చూసి గభాలున లేచి కూర్చుంది

"ఎంతసేపైంది వచ్చి "

"పావుగంటపైన అయింది. కుంభకర్ణుడి చెల్లెలులా నిద్రపోతున్నావు' పాపం లేపటం ఎందుకులే అనుకున్నాను కానీ ఈ వెధవ మనస్సు వుంది చూశావూ ఇది ఆగదే!" అంటూ మంచంమీద విమలని ఆనుకుని కూర్చుని కబుర్లు చెప్తూన్న జలజని రెప్పవాల్చకుండా చూస్తోంది విమల.

చదువుకునే రోజులకంటే ఇప్పుడు కాస్త లావు అయింది ఖరీదైన బట్టలు వేసుకుంది చేతులకి నాలుగు జతల బంగారు గాజులూ మెడలో ముత్యాల హారం, చెవులకి పెద్దవిగా వున్న కమ్మలూ వగైరా ఆమె స్థితిని చెప్పక చెప్తూన్నాయి

'ఏయ్ గోవిందూ వేడి టీ పట్టుకురా!' అని కేకపెట్టి ఇటుతిరిగి "విమలా అరె వుత్తరమైనా రాయకుండా ఇలా వూడిపడ్డావేమిటీ" అంది.

'ఒకటి కాదు రెండు వుత్తరాలు రాశాను' చిరుకోపంగా అంది విమల.

"ఏమీ!"

"అందలేదా."

" 'అబద్ధం చెప్తానా!' విమలా నువ్వు కొత్తగా మారినట్లు లేవుకదూ."

విమల పేలవంగా నవ్వింది. "ఉండు బట్టలు మార్చుకు వస్తాను" అంటూ తన గదిలోకి వెళ్ళిపోయింది జలజ విమల అలాగే మంచంమీద కూర్చుంది దిక్కులు చూస్తూ. జలజ ముస్తాబు ముగించు కుంటూనే కేకపెట్టింది.

"విమలా ముఖం కడుక్కుని బట్టలు మార్చుకో. అలా బైటకి వెళ్ళివద్దాం."

విమలకి బద్ధకంగా వున్నా లేచింది. జలజలో తను ఆశించినంత ఆత్మీయత కన్పించటంలేదు ఎందుచేతనో విమల మనస్సు అదోలా అయిపోతూన్నా ఛీ నేను తప్పుగా ఆలోచిస్తూన్నానేమో! అనుకుని గబగబా తయారయింది. జలజ భర్త మళ్ళీ కన్పించలేదు. రెండురోజులు సిటీ అంతా తిప్పి చూపించి ఆఖరుకి అంది

"విమలా నాకింక లీవులేదు కాలేజీ వుంటే అస్సలు తీరుబడి వుండదు "

ఈ రెండురోజుల్లోనూ విమల తను వచ్చిన విషయం చెప్పాలని ప్రయత్నిం చింది. కానీ జలజ సంభాషణ మార్చేస్తూ విమలకి అవకాశం ఇవ్వలేదు.

విమల ఇంక లాభంలేదని యిప్పుడు చెప్పింది

"నాకో చిన్న వుద్యోగం కావాలి జలజా. నీ దగ్గర వుండి యీ వూళ్ళో ఎక్కడన్నా ప్రయత్నిస్తాను. నాకు వుద్యోగం చాలా అవసరం "

పారం అప్పగించినట్లు గబగబా అనే సింది.

"నీకా! వుద్యోగమా! కావాలా!"

"ఔను. నేను నా కాళ్ళమీద నిలవాలి. ఆపైన మా అమ్మకి సాయంచేయాలి. ఇలాంటి పరిస్థితి వచ్చింది ఇంక వివరాలు చెప్పలేను "

"నీకెవరు తెల్సునని ప్రయత్నిస్తావు?"

"ఎవ్వరూ లేరు నువ్వు తప్ప "

జలజ పెద్దగా నవ్వేసింది. "అలా అన్నావు బాగుంది నేనిప్పిస్తాను ఉద్యోగం "

"నిజంగా "

"అక్షరాలా "

"ఎక్కడ?"

"మా శ్రీవారు పనిచేసే కంపెనీలో! అప్లికేషన్ ఇచ్చి నువ్వు నిశ్చింతగా ఇంటికి వెళ్ళిపో! ఆర్డర్స్ పంపిస్తాం "

"నన్ను చూడకుండానే ఇస్తారా! అదెలా సాధ్యం?"

"అవన్నీ నీ కనవసరం నువు నిశ్చిం తగా వెళ్ళిపో."

జలజ ఇస్తూన్న భరోసాకి విమలకి సంతోషంతో కన్నీళ్ళు తిరిగాయి

"జలజా! నాకీ సాయం చేశావంటే నీకు చాలా రుణపడి వుంటాను "

"అంత పెద్దమాటలు వద్దులే "

"అదికాదు ఆర్థిక యిబ్బందులువల్ల ఒకటికి రెండుసార్లు యీ వూరుకి రాలేను కూడా. అందుకు చెప్తూన్నాను "

"మరేం ఫర్లేదు అంత అవసరం రానీయనుగా "

'సరే' నిశ్చింతగా నిద్రపోయింది విమల.

3

ఊరికి బయలుదేరి మరోసారి జలజని హెచ్చరించి మరీ ఆటో ఎక్కింది విమల బస్‌కిటికెట్ రిజర్వేషన్ అంత టైములేక క్యూలో నిల్చుంది టికెట్ కోసం క్యూ చాలా పొడుగ్గా వుంది పెట్టె బరువుకి చెయ్యి లాగుతోంది అసలే విసుగ్గా వుంది. టికెట్లు ఇవ్వటం మొదలుపెట్టారు విమల మెల్లగా నడుస్తోంది

'అరె విమలా! నువ్వా! ఈ వూరు యెందుకు వచ్చావ్?' పరిచయమైన గొంతువిని తలతిప్పి చూసింది చిన్నప్పటి స్నేహితురాలు అరవింద తమ్ముడు పదహారేళ్ళ శ్యామలరావు పల్కరించడం చూసి "అరె నువ్వీ వూళ్ళో వున్నావా!" అంది ఆశ్చర్యంగా చూస్తూ శ్యామలరావు అరవిందతోబాటు విమలనీ అక్కా అని పిలిచేవాడు ఆత్మీయంగా వుండేవాడు

"అక్కకి పెళ్ళి అయి అత్తవారింటికి వెళ్ళిందిగా మా నాన్నారికి యీ వూరు బదిలీ అయింది ఇక్కడే వుంటూన్నాం. అన్నట్లు నీకు తెలియదుకదూ! సరేగానీ ఈ వూరు ఎందుకు వచ్చినట్లు?"

విమల తల్లిదండ్రులకీ అరవింద తల్లి దండ్రులకీ చాలాసంవత్సరాల స్నేహితం. ఇరుగుపొరుగున వుండేవాళ్ళు ఒకరంటే ఒకరు ప్రాణం ఇచ్చేంత సన్నిహితంగా వుండేవారు. విమలా అరవిందా మరీ కల్సి వుండేవాళ్ళు అరవింద తండ్రికి ఆ వూరు నించి బదిలీ కావటంతో ఇరుకుటుంబాల వారూ చాలా బాధపడిపోయారు అరవింద చాలారోజులు వుత్తరాలు రాస్తూ క్షేమం తెల్పుతూ వుండేది రానురాను అవి కాస్త తగ్గాయి. అరవిందకి పెళ్ళి అయిపోయిందని తెల్సుకూడా విమలకి.

శ్యామలరావు చాలా పెద్దవాడిలా అయిపోయాడు అనుకుంటూ అతన్ని పరీక్షగా చూస్తూ 'ఏం చదువుతున్నావ్?' అంది.

'బీయస్సీ' కానీ ముందా క్యూలోనించి ఇవతలకి రా అమ్మా నాన్నా దగ్గరకి వెడదాం' అంటూ విమల వద్దు అంటూన్నా బలవంతపెట్టి ఆటో పిల్చాడు

అరవింద తలిదండ్రులు విమలనిచూసి చాలా సంతోషపడిపోయారు శ్యామలరావు ఓ స్నేహితుడిని పంపటానికి బస్ స్టాప్‌కి వెళ్ళడంవల్ల నువ్వు కన్పించడం గమ్మత్తుగా జరిగింది కదూ. అంటూ విమల కుటుంబ విషయాలు తెల్సుకుని విచారపడ్డారు.

"నీకు వుద్యోగం కావాలంటే మరి వూరికి వెళ్ళకు మేం వున్నాంగా" అని బలవంతం చేసి ఆపేశారు.

"అక్కా, అలా సినీమాకి పోదాం. షికారు పోదాం" అంటూ శ్యామలరావు స్వంత అక్కని చూసినంతగా సంబరపడిపోతూ విమలని తిప్పుతూన్నాడు.

శ్యామల తండ్రి 'నేనూ చూస్తానమ్మా' అంటూ ప్రయత్నం ప్రారంభించాడు.

వారంరోజులు ఇట్టే గడిచిపోయింది. జలజ ఇంటికి వెళ్ళి వూరు వెళ్ళలేదు అని చెప్పాలని ప్రయత్నించింది కానీ వీలు కాలేదు

శ్యామలరావు తండ్రి ఒకరోజు అన్నాడు "నీ ఫ్రెండ్ ఏం చేసిందో తెల్సుకో " అని

విమల జలజ ఇంటికి బయలుదేరింది. జలజ ఇంట్లో నౌకరుతప్ప మరెవరూలేరు. అలవాటు అయిన ఇల్లు కావటంవల్ల సరా

పరి లోపలికి వెళ్ళి కూర్చుంటూ "మీ అమ్మగారు ఎప్పుడు వస్తారు ఇంటికి గోవిందూ" అడిగింది.

"సాయంకాలం సినీమాకి వెళ్ళిగానీ రామన్నారు "

"అలాగా! సరే మళ్ళీ వస్తానులే. నేను వూరికి వెళ్ళలేదు అని చెప్పు మీ అమ్మగారు అన్నట్లు నా జాకెట్ ఒకటి ఇక్కడ మార్చిపోయాను వున్నదా "

'వుంది' తెచ్చియిచ్చాడు.

"గోవిందూ ఓ కాయితం ఇవ్వు ఇది కట్టి తీసుకుపోతాను "

గోవిందు కాయితం పట్టుకువచ్చాడు. తను కుంపటి వెలిగించుకునేందుకు వుంచుకున్న కాయితాల్లోంచి మంచిది ఏరి మరీ పట్టుకువచ్చాడు

జాకెట్ చుట్టేయబోతూ తన సంతకం కన్పించి ఆశ్చర్యపోయి కాయితం పరీక్షగా చూసింది ఆశ్చర్యపోయింది. ఇది ఇది గోవిందు వాడుకునే చిత్తు కాయితాల్లోకి యెలా వచ్చిందీ! నిర్ఘాంత పోయి అలాగే కూర్చుంది. ఇంతలో జలజ భర్త వచ్చాడు. విమలని చూసి ఆశ్చర్యపోయి "అరె! మీరు వూరువెళ్లారని చెప్పింది జలజ? యెప్పుడొచ్చారు మళ్ళీ."

"వెళ్ళాలనుకున్నాను కానీ వెళ్ళలేదు" నీరసంగా ఇచ్చింది జవాబు

"మరి మీ మేరేజ్ సెటిల్ అయిపోయిందని చెప్పింది జలజ"

"అలాగా?"మరీతెల్లబోయింది విమల

"గోవిందూ రెండు కప్పులు వేడి కాఫీ పట్టుకురా" అంటూన్న అతన్ని వారిస్తూ "వద్దండీ! నేను మరోసారి వస్తాను అలా చెప్పండి జలజకి" అంటూ లేచింది.

"అహా కూర్చోండి. కనీసం కాఫీ అయినా తాగి వెళ్ళండి "

విమల ఏం జవాబు చెప్పలేక కూర్చుండిపోయింది. జలజ భర్త బట్టలు మార్చుకుని లుంగీ కట్టుకుని వచ్చి డైనింగ్ టేబిల్ ముందు కూర్చుంటూ అలసటగా వున్న ముఖాన్ని పైమీది తువ్వాలుతో ముఖం తుడుచుకుంటూ ఇంక తన ఆఫీసు కబుర్లు చెప్తూ "అబ్బ! ఇవాళ కొన్ని ఇంటర్వ్యూలు జరిగాయి నాలుగు ఖాళీలకి నలభై మంది కాదు నాలుగు వందలమంది వస్తున్నారు పాపం నిరుద్యోగ సమస్య యెప్పటికి సమసిపోతుందో అర్థంకాకుండా వుంది. అరె! మీకు బోర్ కొట్టే విషయాలు చెప్తున్నాను కదూ!" అంటూ నౌకరు తెచ్చిన కాఫీ తాగేసి కప్పు టేబిల్ మీద పెట్టేసి కాఫీ ఇంకా తాగకుండా అలాగే కూర్చున్న విమలని పరీక్షగా చూస్తూ.

"అరె! అలా వున్నారేం అవునూ నా ప్రశ్నకి జవాబు ఇవ్వలేదు. కంగ్రాజులేషన్స్ చెప్పినా "

"చూడండి నా పెళ్ళి సెటిల్ కాలేదు. నేను యెంత చిన్నదైనా సరే ఒక ఉద్యోగ ప్రయత్నం చేసుకునేందుకు యీ వూరు వచ్చాను ఇంతే మరి వెళ్ళివస్తాను "

"ఆ అలాగా!" అతను ఆశ్చర్యం నుంచి తేరుకోకుండానే ఇవతలకి వచ్చేసింది విమల.

"అడ్రెస్ ఇవ్వండి జలజ మిమ్మల్ని కల్సుకుంటుందేమో "

వాకిలివరకూ వచ్చి అన్నాడు శంకర్.

"అక్కరలేదు కావాలంటే నేనే

కలుస్తాను" అనేసి చకచకా అడుగులు లేసింది.

ఇల్లు యెలా చేరిందో విమలకే తెలియదు. వస్తూనే వాలుకుర్చీలో వాలి పోయి కళ్లు మూసుకుంది. జలజ ఇలా యెందుకు చేసింది! అన్న ప్రశ్నకి జవాబు దొరకకపోగా ఆవేదన, ఉక్రోషం, కోపం, దుఃఖం ఒకేసారి వచ్చి వుక్కిరి బిక్కిరి చేసేశాయి రెండు చేతుల్లోనూ ముఖం దాచేసుకుని వుండి పోయింది.

'అరె అక్కాయేమైంది' శ్యామల రావు ఆదుర్దాగా అడిగాడు

విమల చెప్పిందంతా విని నవ్వేస్తూ "ఛా యింత చిన్న విషయానికి అంత బాధపడాలా! పోనివ్వు నాన్నారు ప్రయత్ని స్తారు నీకు వుద్యోగం వచ్చి తీరుతుంది"

విమలకి శ్యామలరావు మాట విన్పించ టం లేదు వెక్కి వెక్కి యేడ్చేసింది.

"నమ్మించి ఇలా మోసం యెందుకు చెయ్యాలి, 'కాదు' అని చెప్పినా నా కింత బాధ కల్గదు"

"అబ్బబ్బా ఇంక ఆ విషయం వదులు పద సినీమాకిపోదాం. నీ మనస్సుకి కాస్త శాంతి కల్గుతుంది" అని బలవంతంగా తీసుకు వెళ్ళాడు.

అప్పటికే పిక్చర్ ప్రారంభమైంది టికెట్లు కొనుక్కుని ఇద్దరూ లోపలికి వెళ్ళి కూర్చున్నారు శ్యామలరావు సినీమా చూడడంలో మునిగిపోయాడు కానీ విమల మనస్సు మనస్సులో లేదు

ఇంట్రవెల్ లో లైట్లు వెలిగాయి. ముందు వరుసలో కూర్చున్న జలజ కోకోకోలా వాడిని కేకవేస్తూ విమలని చూసింది విమలా అప్పుడే జలజని చూసి గుర్తించింది.

"అరె! విమలా!" అంటూ లేచి వచ్చి ఖాళీగా వున్న కుర్చీలో కూర్చుని కబుర్లు చెప్పేస్తోంది.

"నీ అప్లికేషన్ మావారు తన బాస్‌కి ఇచ్చారు నీకు తప్పకుండా వుద్యోగం వస్తుంది. ఆర్డర్స్ త్వరలోనే వస్తాయి. యింతకీ "


విమల నోట్లోనించి ఒక్కమాటా బైటకి రావటంలేదు. ఆవేశంతో ముఖం జేవురించిపోయింది. ఇది గ్రహించిన శ్యామలరావు తనే జవాబు చెప్పాడు తను బస్‌స్టాండ్ లో కల్సియింటికి తీసుకు వచ్చినట్లుగా అంతా చెప్పి "విమలక్కకి వెళ్ళి సెటిల్ అయిందిగా వుద్యోగం. అక్కర్లేదు"

జలజ ముఖం నల్లగా మాడిపోయింది "అలాగా" అంది యెలాగో తిరిగి పిక్చర్ ప్రారంభం కావటంలో వెళ్ళి తన సీట్లో కూర్చుంది. పిక్చర్ పూర్తి అవుతూండ గానే విమల శ్యామలరావు చెయ్యిపట్టు కుని హాలుబైటకి తీసుకువచ్చేసి "పద పోదాం" అంది అంతే ఇద్దరూ ఇల్లు చేరారు

4

రెండు నెలల తర్వాత విమలకి నూట పాతిక రూపాయిల వుద్యోగం దొరికింది. మూడు బస్సులు మారి వెళ్ళటం చాలా ప్రయాసగా వున్నా విమల ఉద్యోగం వదులుకోలేదు శ్యామలరావు తల్లి దండ్రులు విమలని యెంతో ఆత్మీయంగా చూసుకుంటూన్నారు, యీ అభిమానానికి

—అరవిందయోగి



కృతజ్ఞత మాటల్లో చెప్పలేకపోతోంది

తల్లి ఆరోగ్యం బాగులేదని వచ్చిన వుత్తరం చూసుకుని శలవుపెట్టి వెళ్ళేసరికి ఆమె యీ లోకాన్నే వదిలిపోయింది. వెంటనే తిరిగి రాలేకపోవటంలో యీ చిన్న వుద్యోగమూ వూడిపోయింది. విమల శోకదేవతే అయింది శ్యామలరావు ధైర్యం నూరిపోశాడు. మరో వుద్యోగం దొరికింది అలా కాలం దొర్లిస్తూండగా సూర్యారావుతో పెళ్ళి జరిగిపోయింది. ఇద్దరూ వుద్యోగాలు చేసుకుంటూ ఇంటికి కావల్సిన వస్తువులని అమర్చుకున్నారు. విమల ఇద్దరు పిల్లల తల్లి అయింది. భర్త ఇంక వుద్యోగం మానేసేయి. 'నాకు ప్రమోషన్ వచ్చింది' అన్నప్పుడు తృప్తిగా నిట్టూర్చి వుద్యోగాన్ని వదిలి ఇల్లునీ భర్తనీ పిల్లలనీ శ్రద్ధాప్రదంగా చూసుకుంటూ కాలం వెళ్ళదీస్తోంది

ఒకసారి రైలు ప్రయాణంలో కాలేజీ నాటి ఫ్రెండ్ ఒక అమ్మాయి కన్పించి జలజ వుద్యోగం పోగొట్టుకున్నట్లూ అస్తమానం భర్తని అనుమానించటం వల్ల అతను వేగలేక వదిలేసినట్లూ చెప్పింది

"అయ్యో! అలా ఎందుకు జరిగింది." బాధపడిపోతూ అంది విమల.

"జలజ ఎమ్.ఎ పాసు అయిన తర్వాత చాలా మారిపోయింది. తన ఫ్రెండ్స్ యెవరూ ఎమ్.ఎ చదివి లెక్చరర్ కాకూడదనీ ఆప్రత్యేకత తన ఒక్కదానికే

FREE !! ఉచితం ! !

తెరచిన నేత్రాలు

7 సంవత్సరాల వెనుక "లారెన్స్ అనే వ్యక్తికి కనుచూపు మందగించడం ఆరంభమైంది. అతడు తన పెంపుడు కుక్క సహాయంతో అటూ ఇటూ తిరుగ గలిగేవాడు. ఈమధ్య పొరపాటున కుక్కమీద కాలువేసి జారి క్రిందపడగా అతనికి గట్టి దెబ్బలు తగిలాయి. కాని ఆ క్షణములోనే కనుచూపును తిరిగి పొందగలిగేవాడు.

నేను క్రిందపడ్డ వెంటనే నా కుక్కను మనసారా తిట్టిపోసాను, గాని అది నాకు చూపు ప్రసాదించిందని ఎంతో బాధతో పలికాడు. మానవుని జీవిత ప్రయాణములో తటస్థపడే కష్టాలు, మన గ్రుడ్డి నేత్రాలను తెరచుటకు దేవుడు పంపే సాధనములని, అనేకమంది గుర్తించరు. దేవుడు లోకములోని మనుష్యులను ఎంతగానో ప్రేమిస్తున్నాడు. మానవుడు తన సత్యాన్ని చూచి గుర్తుపట్టినట్లు వారి గుడ్డిపోయిన నేత్రాలు తెరచి తనవైపుకు త్రిప్పుకోవాలని ఆయన ఆశిస్తున్నారు.

ఏది ఎలాగున్న, దేవుడు ఏ వ్యక్తిని గూడా తానేర్పరచిన మార్గములోనే నడచిపొమ్మని బలాత్కారము చేయడు. ఎందుకంటే, బిడ్డలనేవారు ప్రేమతో కట్టుబడి తండ్రి గృహములో నివసించాలిగాని, బలాత్కారముతోగాదు. బలాత్కారముగా ఒక వ్యక్తికి విధించే దండనలు వాని దుష్టత్వాన్ని మార్చలేవు. హృదయములో మార్పు కలుగదు. ఒకడు క్రొత్తగా జన్మించితేనేగాని దేవుని రాజ్యము చూడలేదని పలికిన క్రీస్తును గూర్చి తెలుసుకున్నారా!

—చదలవాడ చంద్రమతీదేవి

వుండాలన్న ఆరాటంతో పిచ్చిదానిలా వ్యవహరించేది. అన్నీ అబద్ధాలు చెప్తూ యేదేదో చేసేది. అలా చేయటంతో అందరూ దూరమై ఏకాకి అయింది. చివరికి భర్తకి కూడా యీ ప్రవర్తన నచ్చక వదిలేశాడు అంటూన్నారు.

విమలకి మొదట కోపం వచ్చినా తర్వాత జాలి ముంచుకు వచ్చింది. తర్వాత చాలా రోజులవరకూ జలజ విషయాలు తెలియలేదు విమలకి కానీ యివాళ హఠాత్తుగా జలజ వుత్తరం రాసింది చూసి ఆలోచనలో పడింది జలజవుత్తరం మళ్ళీ మళ్ళీ చదువుకుంది.

''విమలా మనం చిన్ననాటి స్నేహితులం. మీ శ్రీవారితో చెప్పి నాకు కాలేజీలో లెక్చరర్ జాబ్ వచ్చేలా సాయం చెయ్యాలి. మీవారి పలుకుబడి నాకు తెల్సింది. నేనే ఇంటర్వ్యూకి వస్తూన్నాను. నీ ఇంటికే వస్తాను.

జలజ.

విమల ఆ రాత్రి అంతా అశాంతిగా గడిపింది. జరిగినదంతా భర్తకి చెప్పింది. ఆయన నవ్వి నిద్రపోయాడు. జలజ వచ్చింది. వెళ్ళిపోతూ 'నీ వుత్తరంకోసం యెదురు చూస్తూంటాను' అంటూ చెప్పి వెళ్ళిపోయింది.

ఒకరోజు రాత్రి సూర్యారావు చెప్పాడు "విమలా! నీ నెచ్చెలికి ఆర్డర్స్ పంపాలా" అని. విమల రెండు నిమషాలు ఆలోచించి అంది.

''మీ వల్ల అయితే తప్పక సాయం చెయ్యండి."

'గుడ్ ' అంటూ మెచ్చుకోలుగా నవ్వాడు సూర్యారావు. మరుసటిరోజు జలజకి విమల వుత్తరం రాసింది యిలా.

''విమలా

మానవ జీవితం క్షణభంగురమైనది. ఇది తెల్సుకుని 'అంతరాత్మ'ని చంపుకోకుండా బ్రతకటం ప్రతివాళ్ళకీ అవసరం. నాకు అంతరాత్మ వుంది. నీకు చేయగల్గిన సాయం చేశాను.

ఇంతే

విమల.

ఇలా వుత్తరం ముగించి తేలికపడిన మనస్సుతో కుర్చీ వెనక్కి వాలిన భార్య భుజంమీద చెయ్యివేస్తూన్న సూర్యారావుని అప్పటికి చూసింది విమల.

"అరె! ఎప్పుడొచ్చారు. ఎంత సేపయింది వచ్చి. వుండండి వడ్డిస్తాను" అంటూ కుర్చీలోనించి లేస్తూన్న భార్యని ప్రేమగా దగ్గరకి తీసుకుంటూ.

"విమలా నువ్వెంత మంచిదానివి. నీ మనస్సెంత మంచిది. నీలాంటి భార్య దొరకటం నా అదృష్టం." అంటూంటే అతని చేతిని ఇంకాస్త గట్టిగా పట్టుకుంటూ "కాదు...నాది అదృష్టం." అంటూ డైనింగ్ టేబిల్ దగ్గరకి నడిచింది విమల.



సీరియల్



మనిషికి ఏం కావాలి?

— కొమ్మూరి వేణుగోపాల రావు

అలానే కొన్ని రోజులు గడిచిపోయాయి.

పెద్దమ్మ తండ్రిగారికి సీరియస్‌గా వుందని ఒకసారి వైర్ వచ్చింది. వెంటనే ఆవిడ పెద్ద పెట్టున రాగాలు తియ్యటం మొదలుపెట్టింది. వేదాద్రి నరసింహస్వామికీ, భద్రాద్రి రాములవారికీ, తిరుపతి వెంకటేశ్వరస్వామికీ మొక్కులు మొక్కేసింది. భర్తతో, పిల్లలతో పుట్టింటికి ప్రయాణం కట్టింది. వెళ్ళేటప్పుడు ఇంటి తలుపులన్నీ తాళాలు పెట్టుకుని మాకు వారం రోజుల గ్రాసం తూచినట్లు యివ్వటం మరిచిపోలేదు.

వాళ్ళు వచ్చేటప్పటికి వారమే పడుతుందో, పదిహేను రోజులే పడుతుందో, ఆ 'గ్రాసా'న్ని ఒక పూట తినీ, ఒక పూట తినకా మేమిద్దరం పదిలంగా కూడు కుంటున్నాము.

నాలుగు రోజులన్నా గడవకుండానే పెదనాన్నగారు ఒక్కరే తిరిగి వచ్చేశారు.

మేము కారణం అడక్కుండానే "ముసలాడు వెంటనే చచ్చేలా కనబడలేదు. ఇక్కడ నాకు వ్యాపారం దెబ్బతింటోంది. అందుకని వచ్చేశాను" అన్నారు.

జరిగిన కథ :

సునీతికి చిన్నతనం నుంచీ సాహసకృత్యాలంటే ఇష్టం. హఠాత్తుగా యాక్సిడెంట్‌లో సునీతి తండ్రి చనిపోయాడు. తల్లితోసహా పెదనాన్న పంచన చేరింది సునీతి. సునీతి తల్లి ఆ ఇంట్లో పనిమనిషిలా చూడబడుతోంది.

నేనుగానీ, అమ్మగానీ ఏమీ మాట్లాడలేదు. కాని ఆయన ఇంట్లో మిగతా వాళ్ళెవరూ లేనప్పుడు రావటంవల్ల అమ్మ చాలా యిబ్బంది పడుతున్నట్లు గ్రహించాను.

ఆయన అమ్మకు ఇంటి తాళంచెవులు యిచ్చారు. ముఖంలో నవ్వు కనబరుస్తూ "చూడూ! ఆవిడ ఇంట్లో లేదని మొహమాటపడకు. నీకేం చెయ్యాలని వుంటే అన్నీ చెయ్యి. తెలిసిందా?" అన్నారు.

అమ్మ జవాబేమీ చెప్పకుండా వంటింట్లోకి వెళ్ళిపోయింది. ఆయన కూడా ఏమేమో మాట్లాడుతున్నారు.

"తమ్ముడంటే నాకెంత ప్రేమో నీకు తెలీదు. విధివశంవల్ల మేమెప్పుడోగాని కలుసుకోలేకపోయినా ఎప్పుడూ వాడి గురించే ఆలోచిస్తూ వుండేవాణ్ణి. ఇహ .వాడు పోయాక గుర్తు రాని రోజు లేదు."

నేను అమ్మ అవస్థ కనిపెట్టి ప్రక్కప్రక్కనే తిరుగుతున్నాను.

"ఇవేళ షాపుకు వెళ్ళను. తలనొప్పిగా వుంది" అంటూ కాసేపున్నాక తన గదిలోకి వెళ్ళి మంచంమీద పడుకున్నాడు.

అమ్మ నన్ను దగ్గరకు లాక్కొని ఆ రోజు స్కూలుకి వెళ్ళవద్దని చెవిలో మెల్లగా చెప్పింది

కొంతసేపటికి "సునీతీ! సునీతీ!" అని పిల్చారు పెదనాన్న

"ఓయ్!" అంటూ గదిలోకి వెళ్ళాను

"బడికి వెళ్ళవేం?"

"ఇవేళ వెళ్ళటంలేదు "

"ఏం?"

"నాక్కూడా తలనొప్పిగా వుంది "

ఆయన నావైపోసారి ఎర్రగా చూసి గోడవైపు తిరిగి పడుకున్నారు.

ఆ సాయంత్రం బయటకు వెళ్ళి ఓ గంటలో అరడజను మంది స్నేహితులతో వచ్చారు.

అంతా చేరి హాల్లో పేకాడటం మొదలుపెట్టారు తర్వాత ఎవరు వెళ్ళి తీసు కొచ్చారోగాని విస్కీసీసా, సోడాలు, గ్లాసులు అన్నీ వచ్చాయి

ఆయన లోపలకు వచ్చి అమ్మతో "ఏమీ అనుకోకు ఆటవిడుపు కదా! కొంచెం మజా వేసుకుంటున్నాము" అన్నారు

అమ్మ ఏమీ మాట్లాడలేదు

"విస్కీలోకి నంజుకోవటానికి ఏమయినా కావాలంటున్నారు. ఇప్పుడు చిప్సూ అవీ తయారుచెయ్యటం కష్టం అప్పడాలేమయినా వున్నాయా?"

"ఉన్నాయి."

"ఇంకేం? ఫస్టుగా వుంటాయి వాటిని వేయించి చిన్నచిన్న ముక్కలుచేసి ప్లేట్ లో వుంచి సునీతితో పంపించు" అని చెప్పి స్నేహితుల దగ్గరకు వెళ్ళిపోయారు.

పేకాట జోరుగా వుంది

పార్టీ పసందుగా సాగుతోంది.

నేనక్కడే నిలబడి వాళ్ళ తీరుతెన్నులని గమనిస్తున్నాను అన్నం తినటానికని అమ్మ నన్ను రెండుమూడుసార్లు పిలిచింది కాబోలు. వినిపించలేదు చివరకు అమ్మ అక్కడికే వచ్చి "సునీతీ! పిలుస్తూంటే వినబడటంలేదూ?" అన్నది

నేను గతుక్కుమని అమ్మవెంట లోపలకు వెళ్ళాను.

వాళ్ళంతా ఆమెను చూశారు ఆమె అందాన్ని పొగుడుతూ వాళ్ళ భాషలో మాట్లాడే మాటలు లోపలకు వినిపిస్తున్నాయి

కొంతసేపటికి మా పనులు ముగించుకుని మా గదిలోకి వెళ్ళి పడుకున్నాము అమ్మ తలుపు గడియ జాగ్రత్తగా పెట్టింది.

హాల్లోంచి వాళ్ళ కేకలు, కేరింతలు మధ్య మధ్య వినవస్తూన్నాయి

నా కెప్పుడు నిద్ర పట్టిందో తెలీదు.

తలుపు మీద ఏదో చప్పుడవుతున్నట్లు తోస్తే కళ్ళు తెరిచాను.

"టక్ టక్ టక్" తలుపు మీద చిన్నగా చప్పుడవుతోంది

ఏం జరుగుతోంది? నేను చెవులు రిక్కించి వింటున్నాను

"ఎవరూ?" అంది అమ్మ గొంతు నా ప్రక్కనుంచి

"నేను" బయటనుంచి పెదనాన్నగారు

"ఎందుకు?"

"తలుపు తియ్యి చెబుతాను?"

"తియ్యను వెళ్ళండి "

"అదికాదు. అర్జంటుగా మాట్లాడాలి "

"నాతో ఏం మాటలుంటాయి అయినా రేపు పగటి పూట మాట్లాడొచ్చు వెళ్ళండి "

"ఏమీ భయంలేదు వేరే విషయం తలుపు తియ్యి "

అమ్మ ఏమి మాట్లాడలేదు నా మీద చెయ్యివేసి పడుకుంది ఆమె చెయ్యి వొణుకుతూన్నట్లు కనిపెట్టాను

కాని బయటనుంచి ఆయన విడిచిపెట్టలేదు. తలుపులు గట్టిగా బాదుతున్నాడు. విరిగిపోతాయేమో ననిపించింది. గట్టిగా పేరుపెట్టి పిలుస్తున్నాడు. ఇరుగు పొరుగు అంతా నిద్రలేస్తారేమోననిపించింది

ఈ పీడ విరగడయేలా కనిపించలేదు

ఏమనుకుందో అమ్మ లేచి కూర్చుంది అమ్మ చాలా ధైర్యస్తురాలని తెలుసు. ఆమెను బెదిరించి ఎవరూ జయించలేరన్న నమ్మకం నాకుండేది

లేచి వెళ్ళి మెల్లగా తలుపులు తీసింది.

గుమ్మం అవతల ఆయన నిలబడి వున్నాడు హాల్లోంచి పడుతోన్న వెల్తుర్లో చెదిరిన జుట్టూ, ఎర్రబడ్డ కళ్ళూ, లుంగీ చొక్కాతో ఏదో రకంగా కనబడ్డాడు.

మళ్ళీ తలుపులు వేస్తేస్తుందేమో అన్నట్లు రెండు చేతులూ గుమ్మానికి అడ్డంగా జాపి అన్నాడు

"మనిషై పుట్టింది. సుఖాలను భరించటానికి గాని కష్టాలలో యీదులాడటానికి కాదు ఆ పర్వతాన్ని చూశావుగా దాని దగ్గర నాకు సుఖంలేదు నువ్వూ మొగుడ్ని పోగొట్టుకున్నావు. ఈ సంఘంలో వంటరిగా నెట్టుకురాలేవు నిన్ను నేను చేరదీస్తాను. వేరే చోట పెడతాను. నీది మాత్రం శరీరం కాదా? రా"

"నా కవన్నీ తెలియవు. వెళ్ళండి "

"బాగా ఆలోచించుకో "

"నా గురించి నాకు తెలుసు. కొత్తగా ఆలోచించుకోవల్సింది ఏమీ లేదు. వెళ్ళండి."

"అంతేనా?"

అమ్మ జవాబు చెప్పకుండా రాయిలా నిలబడింది.

తర్వాత జరిగిన సంఘటన మెరుపులా దూసుకు వచ్చింది. ఆయన గభాలున అమ్మని రెండుచేతుల్లో పట్టుకుని తప్పించుకోవటానికి వ్యవధి లేకుండా రివ్వున హాల్లోకి లాక్కుపోయాడు ఆయన చేతుల్లో అమ్మ వ్యర్థంగా పెనుగులాడుతోంది.

నాకు గుండె దడదడ కొట్టుకుంది. వంట్లోంచి చరచరమని వేడి ప్రవహించింది. ఒక్క ఉదుటున లేచి నిల్చుని హాల్లోకి వెళ్ళాను.

అక్కడ వాళ్ళిద్దరూ లేరు.

ఆయన గదివైపు నుంచి పెనుగులాట వినబడుతోంది. అటుకేసి పరిగెత్తాను. తలుపులు వేసి వున్నాయి దబదబ బాదాను. ప్రయోజనం లేక పోయింది కిటికీ తలుపులు తెరిచి వున్నాయి అటు వెళ్లాను

అమ్మకు పయిట జారిపోయివుంది ఆయన బలమైన చేతుల్లో నిస్సహాయంగా కొట్టుకుంటున్నది

అమ్మని మంచంమీద పడవేశాడు లేచే ప్రయత్న చేస్తోంటే నిర్దాక్షిణ్యంగా అదిమిపట్టాడు ఆమెను కదలకుండా చేసి మీదకు వ్రాలుతున్నాడు

ఏం చెయ్యను?

ఒకవైపు ఆ దృశ్యం చూస్తోంటే రక్తం వుడికిపోతున్నది మరోవైపు మనసులో ఏదో నీరసం ఆవహిస్తున్నట్లు అయిపోతున్నది.

తెలివి తెచ్చుకుని ప్రక్కకి పరిగెత్తాను మూసివున్న తలుపులు గట్టిగా త్రోశాను ప్రయోజనం లేకపోయింది. అవతలివైపు గడియ వేసివున్నాయి

మళ్ళీ కిటికీ దగ్గరకు పరిగెత్తి "అమ్మా' అమ్మా!" అని పిలిచాను బిగ్గరగా

ఆ రాక్షసుడి కబంధ హస్తాలలో నలిగిపోతున్న అమ్మ నావైపు చూసింది

నా మనసు ఏడుస్తోంది "వాడ్ని చంపెయ్యి అమ్మా పొడిచి పారెయ్యి" అని అరవాలనుంది—మాట రావటం లేదు

నన్ను చూడగానే అమ్మకేదో ధైర్యం వచ్చినట్లుంది బలమంతా వుపయోగించి మీద పడబోతోన్నవాడ్ని ఒక్క తోపు తోసింది. అనుకోని యీ పరిణామానికి తట్టుకో లేక వాడు వెనక్కి తూలాడు. ఈ అవకాశాన్ని వుపయోగించుకుని అమ్మ మెరుపు లాగా తలుపువైపు పరిగెత్తింది. వాడు తేరుకొని అమ్మని అందుకోవటానికి మళ్ళీ ముందుకు దూకాడు అమ్మ తప్పించుకుని, వాడ్ని మళ్ళీ ఓ త్రోపు తోసి గుమ్మం దగ్గరకు ఒక్క వుదుటున పరిగెత్తింది నేనూ ఆతృతగా అటువైపు వెళ్ళేసరికి తలుపులు తెరుచుకున్నాయి అమ్మ బయటకు వచ్చేసింది.


"రా సునీతీ పోదాం" వగరుస్తూ అని నా చెయ్యి పట్టుకుని మా గదివైపు లాక్కు వెళ్ళింది

మొదట అమ్మ గదిలోకి అడుగుపెట్టింది మరో క్షణంలో నేనూ లోపలికి వెళ్ళిపోతాను వెనుకనుంచి ఓ బలమైన హస్తం నన్ను గుంజినట్లయింది కళ్ళు తిరిగి

సుభాషితాలు

పంటి నొప్పిని ప్రశాంతంగా భరించగల వేదాంతి ఎక్కడా వుండడు.

— షేక్‌స్పియర్



నట్లయి నేను క్రింద పడటం, నా కళ్ళకు ఆ రాక్షసుడు నన్ను వొదిలి గదిలోకి పోబోతూ వుండటం కనిపించింది. అమ్మ కళ్ళలో భయం. ఏం చెయ్యటానికీ నిర్ణయించుకోలేని సందిగ్ధావస్థ....వాడు గుమ్మంలోకి అడుగు పెట్టబోయేసరికి తెగించి తలుపులు గభాలున మూసేసుకుంది.

వాడు తలుపులు బాదుతున్నాడు. "తీస్తావా? తియ్యవా? ఇవేళ నన్ను తప్పించుకు పోలేవు. నీ అంతు చూస్తా .."

లోపల్నుంచి సమాధానం లేదు.

"మళ్ళీ మళ్ళీ చెబుతున్నా. తీస్తావా? తియ్యవా?"

"...   .."

"సరే," వాడు వెనక్కి తిరిగి నా దగ్గరకు వచ్చాడు. అమాంతం నన్ను పైకి లేపి, నా మెడ రెండు చేతుల్లో పుచ్చుకున్నాడు.

"నేను పగబట్టానంటే మనిషిని కాదు. మొదట నీ ముద్దుల కూతురు చావు చూస్తావు."

నా మెడ వాడి చేతుల్లో నలిగిపోతున్నది. ఊపిరాడటం లేదు.

"అమ్మా! అమ్మా!!" అని పిలవాలనిపించింది. పిలవలేకపోయాను. కళ్ళు

మూతలు పడుతున్నాయి.

నా చెవులకు తలుపులు తెరుచుకున్న చప్పుడు వినిపించింది.

అమ్మ గొంతు "ఆగు దుర్మార్గుడా! దాన్ని విడు. నీక్కావల్సింది నేనేగా. తీసుకో."

వాడు నన్ను వొదిలి విజయగర్వంతో అమ్మవైపు నడిచివెళ్ళటం తెలుస్తోంది

అమ్మ వాడి చేతుల్లో ఆహుతి కాబోతోంది

తెలివితెచ్చుకున్నాను మళ్ళీ రక్తం ఉడుకుతెత్తింది. అటూ ఇటూ చూసేసరికి ఓ మూలనున్న యినప కడ్డీ కనిపించింది. రెండో ఆలోచన లేకుండా గభాల్న దాన్ని అందుకుని అమ్మని సమీపించి తన రెండు చేతులూ ఆమె భుజాలమీద వేయబోతున్న వాడి తలమీద బాదేశాను.

"అమ్మా!" అని చావుకేక పెట్టాడు వాడి తలనిండా రక్తం. మళ్ళీ మీద కొస్తాడేమో, యింకో దెబ్బ వెయ్యటానికి సిద్ధంగా నిలబడ్డాను!

ఒక్క నిముషం రెండు చేతుల్తో తల పట్టుకుని నిలద్రొక్కుకుంటున్నట్లుగా కనబడ్డాడు అంతే తర్వాత శవంలా క్రింద పడ్డాడు

అమ్మ నా దగ్గరకు పరిగెత్తుకు వచ్చింది

"చంపేశాను" అన్నాను

"పద యిక్కడ్నుంచి పారిపోదాం?"

అమ్మ గబగబ చీరె కట్టుకుంది అయిదు నిమిషాల్లో మా చిన్నపెట్టె నిండా సామాను సర్దేసుకున్నాం వాడు ఏమయినాడోనని అటుకేసి చూడనన్నా చూడలేదు. ఇద్దరం ఆ చీకట్లో బయటకు వచ్చేశాం

సచ్చామన్న మాటేగాని అర్థరాత్రప్పుడు ఎక్కడికి పోతాం? బయట విపరీతంగా చలి టైమెంతయిందో తెలీదు ఊరూ వాడా నిశ్శబ్దంగా వుంది చలికి గజగజమని వొణుకుతూ ముందుకు నడుస్తున్నాం

ఇద్దరం మాట్లాడటంలేదు అయోమయంగా, నిద్రావస్థలో వున్నట్లు, ఈ సంఘటనే ఎవరికో జరుగుతూంటే ఎక్కడో ఎత్తుగా నిలబడి చిత్రంగా తిలకిస్తున్నట్లు అనుభూతిగా వుంది.

బస్‌స్టాండ్ దగ్గరకు వచ్చాం. పేరుకు బస్‌స్టాండేగాని, ఆ రాత్రివేళ అక్కడ అలాంటి సూచనలు కూడా లేకుండా స్తబ్దంగా, వెలవెల పోతూవున్నది ఏం చెయ్యటానికి తోచక ఓ మూసివున్న దుకాణం మెట్లుమీద కూర్చున్నాం నా ధైర్యమంతా ఎగిరిపోయి భయంతో గడ్డకట్టుకు పోతున్నాను పోలీసులు మాకోసం వెదుకుతున్నట్లూ మమ్మల్ని పట్టుకుని తీసుకెళ్ళి జయిల్లో పారేసినట్లూ ఏవేవో దృశ్యాలు కళ్ళముందు మెదుల్తున్నాయి అమ్మకు దగ్గరగా జరిగి, ఆనుకుని కూర్చున్నాను. అమ్మ నా చుట్టూ చెయ్యేసి దగ్గరకు లాక్కుంది.

ఎంత కొద్దికాలంలో ఎన్ని మార్పులు! కొన్నినెలల క్రితం అమ్మ ఆఫీసరుగారి

భార్య. తర్వాత పేదరికం అనుభవించిన అభాగిని. ఆ తర్వాత మొగవాడి వికృత హస్తాలలో నలిగిపోబోయిన ఓ హతాభాగిని. ఇప్పుడు లోకం దృష్టినుంచి పారిపోవ టానికి ప్రయత్నించే ఓ మందభాగిని.

అలా ఎంతసేపు కూర్చున్నామో తెలీదు. ఇంకా పూర్తిగా తెల్లవారలేదు. మనుషుల సందడి కొద్ది కొద్దిగా మొదలయింది. ఎక్కడ్నుంచో ఓ బస్సు వచ్చి స్టాండులో ఆగింది. వెళ్ళి కనుక్కుంటే విజయవాడదాకా వెడుతుందన్నారు. మారు మాట్లాడకుండా అందులో ఎక్కి కూచున్నాం.

*　　　*　　　*

విజయవాడ చేరాం. మళ్ళీ ప్రశ్నలు. ఏం చెయ్యాలి ఎక్కడికి పోవాలి?

తిండిలేదు. స్నానంలేదు. నిలవటానికి నీడలేదు. ఉన్న కొద్ది డబ్బులతో ఏ టీ కొట్టులోనో కాస్త టీ తాగాం. మళ్ళీ పిచ్చెత్తిన వాళ్ళలా తిరుగుతున్నాం.

ఆ సమయంలోనే నారాయణమ్మతో పరిచయం ఏర్పడింది. నారాయణమ్మ ఓ ఫిలిం కంపెనీలో పనిమనిషిగా వుంటోంది. ఆ మధ్యాహ్నం ఓ యింటి అరుగుమీద శోష వచ్చినట్లు చతికిలబడివున్న మమ్మల్ని చూసింది. పలకరించింది. దయ కల మనిషిలా కనపించింది. అమ్మతో ఆ మాటా యీ మాటా మాట్లాడి వాళ్ళ యింటికి తీసుకెళ్ళింది.

నారాయణమ్మ యిల్లు పూరిపాకలాంటిదే అయినా కొంచం విశాలంగా, శుభ్రం గానే వుంది. ఆమెను మొగుడు విడిచిపెట్టేశాడట. పిల్లాజెల్లా లేరు. మనిషికి నలభయి ఏళ్ళు వుంటాయి. అమ్మకు ఎక్కడయినా ఉద్యోగం చూపిస్తానంది.

ఆ రాత్రి కపటం లేకుండా అమ్మ జరిగినదంతా చెప్పేసింది. ఆ మనిషి చచ్చి పోయి వుండవచ్చుననీ, పోలీసులు తమకోసం రావచ్చుననీ, తాము అక్కడ వుంటే తమవల్ల ఆమెకు కూడా ప్రమాదం రావచ్చుననీ ..

అంతా విన్నదిగాని నారాయణమ్మ ఏమీ భయపడలేదు "ఈ ఊరుకాని వూళ్ళో ఏ తోడూ లేకుండా ఎలా నెగ్గుకు వస్తారు? నాకూ ఎవరూ లేరు. కానియ్యి ఏం జరుగు తుందో చూద్దాం" అన్నది.

అమ్మ నన్ను ప్రక్కన పడుకోబెట్టుకుని చెప్పింది. "పోలీసులు వస్తారు. తానే వాడ్ని కొట్టానని చెబుతుంది. నన్నేమయినా ప్రశ్నలువేస్తే నాకేం తెలీదు నిద్రపోతు న్నానని చెప్పాలి."

నేను ఏడ్చాను. "వద్దమ్మా. నిజం చెప్పేస్తాన"ని గోలపెట్టాను.

ఏమయినా సరే. నిజం చెప్పటానికి వీల్లేదని అమ్మ నాతో వొట్టు వేయించుకుంది.

రెండు మూడు రోజులు గడిచాయి. నారాయణమ్మ అమ్మకు ఓ పొగాకు కంపెనీలో చుట్టలు చుట్టే పని ఇప్పించింది. చేసిన పనినిబట్టి డబ్బులు ముడతాయి.

చీకటితో లేచి పనిలోకి వెళ్ళిపోయి, ఏ సాయంత్రానికో అలిసిపోయిన

శరీరంతో యింటికి చేరేది అమ్మ.

ఆ స్థితిలో అమ్మని చూస్తే జాలేసేది.

"అమ్మా! నేను వస్తాను. నీతోకూడా పని చేస్తాను. నువ్వట్లా కష్టపడుతూంటే నేనింట్లో కూర్చోలేనమ్మా" అని రోజూ పోరు పెట్టేదాన్ని.

"సునీతీ! నువ్వు చదువుకోవాలి. పైకి రావాలి. ఇద్దరం అర్థం లేకుండా కష్ట పడి యీ రొంపిలో శాశ్వతంగా యిరుక్కుపోయే కంటే కనీసం ఒకరైనా బయట పడే మార్గం చూసుకుంటే మంచిది కదూ" అనేది అమ్మ.

ఇలాగైనా ఎక్కువ రోజులు గడవలేదు. ఒక రోజున అమ్మ ఇంటికి రాలేదు. రాత్రి ఏడింటి దాకా చూసి చూసొస్తానని వెళ్ళింది నారాయణమ్మ. నేనింట్లోకి వీధిలోకి కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాను. గుండె దడగావుంది. మనసు ఏదో అశుభం శంకిస్తోంది.

చివరికెప్పటికో నారాయణమ్మ వచ్చింది వొంటరిగా. ఆమె ముఖం వాడిపోయి వుంది.

"ఏం జరిగింది? అమ్మ ఏదీ?" అనడిగాను ఆతృతగా.

ఆమె నన్ను దగ్గరకు తీసుకుని "బాధపడకు. అనుకున్నంత పనీ అయింది. వాడు చచ్చిపోయాడుట. అమ్మని పోలీసులు తీసుకుపోయారు" అన్నది.

"అమ్మా!" అని అరిచి ఆమె చేతుల్లోంచి బయటపడటానికి పెనుగులాడాను.

"అమ్మ యీపని చెయ్యలేదు. వాడిని చంపింది నేను. ఈ సంగతి పోలీసులకు చెబుతాను" అని కేకలు పెట్టాను ఏడుస్తూ.

నారాయణమ్మ నన్ను గట్టిగా పట్టుకుని వొదల్లేదు. ఆమెకూడా ఏడుస్తోంది. "ఇలాంటి పరిస్థితి వస్తుందని ముందుగానే మీ అమ్మకు తెలుసమ్మా. అందుకే యీ ప్రమాదంలోకి నువ్వు యిరుక్కోకుండా జాగ్రత్తపడుతూ వచ్చింది. నువ్వు యిలా అగడం చేస్తావనే ఎలాగైనా కట్టడి చెయ్యమని నాతో వొట్టు వేయించుకుంది .. చూడమ్మా మీ అమ్మ జీవితం ముందే నాశనమైపోయింది. ఆమెకు బతకాలనే కోరిక కూడా ఏమీలేదు. నువ్వలా కాదు. నీ జీవితాన్ని రాసాడుకోవల్సిన అవసరం వుంది. ఇది కేవలం నా మాటకాదు. మీ అమ్మ అలమటించి పోయిందికూడా దీనికోసమే .. "

ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లిపోయినట్లు ఆమె చేతుల్లోనే పడుకుండిపోయాను.

4

రోజులు చప్పగా, క్రూరంగా గడిచిపోతున్నాయి. అమ్మ ఎక్కడుందో, ఆమె మీద కేసు ఎక్కడ నడుస్తోందో తెలీదు. నారాయణమ్మ మాత్రం రెండు మూడుసార్లు వెళ్ళి చూసివచ్చింది. నేను వెళ్ళాలని ఎంతో కొట్టుకుపోయాను గాని ఆమె పడనివ్వలేదు.

ఆమె నన్ను స్కూల్లో చేర్పించింది. నిర్లిప్తంగా బడికి వెళ్ళి వస్తున్నాను.

ఇంటి చుట్టూ పూరిపాకలు. లేకపోతే చిన్నచిన్న పెంకుటిళ్ళు అందరూ పని పాటలు చేసుకుని బ్రతికేవాళ్ళే. అక్కడ రకరకాల వాళ్ళుండే వాళ్ళు. రిక్షావాళ్ళు

మురా పనిచేసుకునే వాళ్ళు, సైకిలు షాపుల వాళ్ళు, కాఫీ హోటల్లో పనిచేసే వాళ్ళు, కిల్లీకొట్ల వాళ్ళు, అచ్చాఫీసుల్లో పనిచేసే వాళ్ళు, పాలు పోసుకునేవాళ్ళు ..యిలా.

కొంత మందికి యిద్దరు పెళ్ళాలుండేవారు. ఆ యిద్దరు పెళ్ళాలూ—వాళ్ళమధ్య ఏమీ విభేదాలు లేనట్లు దొ_త్తంగానే వుండే వాళ్ళు. కొంత మంది త్రాగి వచ్చేవాళ్ళు. చాలామంది బ్రాకెట్ ఆడేవాళ్ళు. అంతలో దెబ్బలాడుకుని తలలు పగలుకొట్టుకునేదాకా వచ్చేవాళ్ళు. అంతలో కలిసిపోయేవాళ్ళు.

నాయీడు పిల్లలు చాలామంది వుండేవాళ్ళు, వాళ్ళంతా నన్ను తమతో ఆడుకునేందుకు పిల్చేవాళ్ళు. నాకే సరదా వుండేది కాదు. గుమ్మంలో నిలబడి వాళ్ళేవో ఆటలు ఆడుతూంటే చూస్తూవుండే దాన్ని.

* *

కొన్ని నెలలు గడిచిపోయాయి. ఒకరోజు నారాయణమ్మ ఓ కవరు మోసుకొచ్చింది. "మీ అమ్మకు జయిల్లో జబ్బు చేసి చచ్చిపోయింది."

"అమ్మా!" అని కేక పెట్టాను. కళ్ళు తిరిగినట్లయ్యాయి. పడిపోతూంటే నారాయణమ్మ పట్టుకోవటం గుర్తుంది.

తెలివి వచ్చేసరికి వళ్ళంతా సలసల క్రాగిపోతున్నట్లూ, కణతలు పగిలిపోతున్నట్లు అనిపించింది.

"అమ్మా! అమ్మా!!" అని మూలుగుతున్నాను.

నారాయణమ్మ ఎక్కడ్నుంచో మందు తీసుకొచ్చి వేసింది. నాకేమీ తగ్గలేదు.

మరునాడు నన్నెత్తుకుని బయటకు వచ్చి-రిక్షాలో ఎక్కించుకుని హాస్పిటల్‌కు తీసుకెళ్ళింది.

అయిదారు రోజులదాకా హాస్పిటల్‌కి వెళ్ళి వస్తూన్నాము.

క్రమంగా జ్వరం తగ్గిందిగాని బాగా నీరసపడిపోయాను. నెలరోజులకిగాని కోలుకోలేదు.

మళ్ళి నారాయణమ్మ పోరగాపోరగా స్కూల్‌కి వెళ్ళడం మొదలు పెట్టాను.

* * *

ఓ సాయంత్రం స్కూల్‌నుంచి యింటికి వస్తోంటే వంట్లో ఏమిటోగా అనిపించింది. కారణం తెలియలేదు.

ఇంట్లోకి వచ్చాక నారాయణమ్మ నా వంక పరీక్షగా చూసి "యిట్లారా" అని వెల్తురులోకి తీసుకెళ్ళి నన్ను అటూ యిటూ త్రిప్పి చూసింది.

చివరకు నవ్వి అంది "నువ్వు యివాళ్ళ నుంచీ వోణీలు వేసుకావాలి"

నా కర్థమయింది. ఈ ప్రపంచం మీద అసహ్యమేసు కొచ్చినట్లు లోలోపల ఏవో భావాలు కలిగాయి.

నారాయణమ్మ ఏవేవో ఆలోచనలు చేస్తోంది. "చాప మీద కూర్చోబెట్టాలి.

పేరంటం చెయ్యాలి. నలుగురు అమ్మలక్కల్ని పిలవాలి "
నేను కోపంగా అన్నాను. దుఃఖాన్ని దిగమ్రింగుకుంటూ. "నా తరపున పెద్ద వాళ్ళెవరూ లేరు కాబట్టే నేనే చెబుతున్నాను. నాకిలాంటి వన్నీ యిష్టం వుండవు నన్నిలా బ్రతకనియ్యి లేకపోతే యిక్కణ్నుంచి గెంటేసెయ్యి."
నారాయణమ్మ అర్థం చేసుకున్నట్లు దగ్గరకు తీసుకుని కళ్ళనీళ్ళతో "నీ యిష్టం లేకుండా ఏదీ చెయ్యనమ్మా" అన్నది.

* * *

ఈ దశలోనే మళ్ళీ జీవితం ఓ మలుపు తిరిగింది
నారాయణమ్మ యింటి ప్రక్కకి క్రొత్తగా ఓ దంపతులు అద్దెకు వచ్చారు. అతని పేరు కృష్ణమూర్తి ముప్ఫయి ఏళ్ళుంటాయేమో భార్య హైమవతి. ఇంటింటికి తిరిగి అగరొత్తులూ యితర సుగంధ ద్రవ్యాలూ అమ్ముతూండేవారు. తానీ ఊరికి కొత్త అనీ, పొట్టతిప్పలు కోసం వచ్చాననీ చెబుతూ వుండేవాడు అందరితో మంచిగా వుంటూ, వాళ్ళకు చిన్న చిన్న సహాయాలు చేసిపెడుతూ, తలలో నాల్కలా అయిపోయే వాడు. కొద్ది రోజుల్లోనే అతను మంచి స్నేహితుడూ, స్నేహపాత్రుడూ అని పేరు తెచ్చుకున్నాడు అతనంటే, అంతా యిష్టపడుతున్నారు.
నారాయణమ్మ దగ్గరకూడా మంచి ప్రాపకం సంపాదించారు మొదట్లో వాళ్ళు దగ్గరకు పిలిస్తే వెళ్ళేదాన్ని కాదు. క్రమంగా తరచు మా దగ్గరకు వచ్చీ, లేకపోతే వాళ్ళ యింటికి తీసుకెళ్ళి కొంత వరకూ అలవాటు చేసుకున్నారు వాళ్ళంటే నాక్కూడా మంచి అభిప్రాయం ఏర్పడింది.
కబుర్లుకూడా భార్యాభర్త లిద్దరూ బాగా చెప్పేవాళ్ళు. మనసు బాగా లేనప్పుడల్లా వాళ్ళింటికి పోయి కూర్చునేదాన్ని.
ఒక సారి ఊళ్ళోకి సర్కస్ వచ్చింది ఒక ఆదివారం ఆ భార్యాభర్త లిద్దరూ సర్కస్ చూడటానికి ప్రయాణమవుతూ నన్ను రమ్మని పిలిచారు.
నేను రానన్నాను. అమ్మతో ఏలూరు విడిచి బయటకి వచ్చాక, సినిమాకెళ్ళటం గాని, మరి అలాంటి వేడుకలు చూడటంగానీ మరిచిపోయాను
వాళ్ళిద్దరూ బలవంతం చేశారు
నారాయణమ్మ కూడా మందలించింది "ఎప్పుడూ యింట్లోనే కూర్చుంటే ఏం తోస్తుంది! ఇహ యీ జీవితానికి అలవాటు పడాలి అప్పుడప్పుడూ అలా బయటకు వెళ్ళివస్తూంటూనే మనసు కుదుటబడుతూ వుంటుంది వెళ్ళిరా మరి" అన్నది.
వాళ్ళని కాదనలేక బయల్దేరాను.
మొదట్లో విముఖంగా వున్నానుగాని సర్కస్ చూడటంలో నిమగ్నమయాక, ఆ విచిత్ర ప్రపంచంలో నా మనసు చిందులు త్రొక్కుతూ విహరించసాగింది. రకరకాల అమ్మాయిలు, వాళ్ళు చేసే వింత వింత విన్యాసాలు, సాహసకృత్యాలు, సైకిళ్ళ

మీద మొగ్గలు వెయ్యటం ట్రెపెజ్ ఫీట్లు మోటార్ సైకిల్ జంప్ పులులూ ఎంహాలతో ఆటలు ఆడించటం ఒక్క క్షణం నేను కూడా సర్కస్ గరల్నైతే ఎంత బాగుండుననిపించింది

రాను రానూ అదే ఆలోచన మనసులో దోబూచులాడసాగింది అవును ఈ ప్రపంచంలో నా కెవరూలేరు కదా ఎదో ఓ మూల వెర్రిగా బ్రతికే బదులు నలుగురి మధ్యా మెసులుతూ నిరంతరం సాహసంలో యీదులాడుతూ యిందులో ఓ థ్రిల్ వుంది కదా అనిపించింది

సర్కస్ మేనేజరో ఎవరో ఇన్‌షర్ట్‌వేసుకుని పొడుగ్గా చిన్న పొట్టతో అటూ ఇటూ తిరుగుతూ ప్రతి ఫీట్‌లోనూ పర్యవేక్షణ చేస్తున్నట్లుగా తన ఉనికిని ప్రాముఖ్యతను కన్పరుస్తూ ఒకతను నా దృష్టిని ఆకర్షిస్తున్నాడు

ప్రదర్శన అయిపోయాక బయిటకు వచ్చాక కూడా నేను కలల్లో తేలిపోవటం పరధ్యానంగా వుండటం కనిపెట్టి హైమవతి అలా వున్నావేమని అడిగింది

నేను నా కోరిక వెలిబుచ్చాను

హైమవతి నవ్వి భర్తతో నా మనసులోని మాట చెప్పింది

అతను వెంటనే సర్కస్‌వాళ్ళ జీవితాలను పొగడటం మొదలుపెట్టి జీవిస్తే అలా జీవించాలనీ లేకపోతే బ్రతుకు వ్యర్థమనీ వాళ్ళు చేసిన ఒక్కొక్క ఫీటూ

వర్ణించటం మొదలుపెట్టాడు.

"అది సరేలెండి. మిమ్మల్ని పొగడమని చెప్పలేదు. మన సునీతికి సర్కస్‌లో పనిచేసే అవకాశం వస్తుందంటారా లేదా?" అన్నది హైమవతి

"ఎందుకు రాదు? వాళ్ళంతా సునీతికంటే పొడిచేశారా ఏమిటి? ఆ మాటకొస్తే మన సునీతి చాలా చలాకీ అయినపిల్ల, అందంగా వుంటుంది" అంటూ నా వైపోసారి చూశాడు.

ఆ చూపుని గమనించానుగాని పట్టించుకోలేదు నా ఊహా ప్రపంచంలో నేనున్నాను. ఇన్నాళ్ళ తర్వాత నా మనసుకు రెక్కలు వచ్చినట్లయింది

ఇంటికి వచ్చి చాపమీద పడుకుని నిద్రపోయినా, తెల్లవార్లూ నేను సైకిలు మీద గిర్రున తిరుగుతూ ఫీట్లు చేస్తున్నట్లూ, రయ్యిమని పరిగెత్తి గుర్రం మీద మొగ్గలు వేస్తున్నట్లూ కలలు కంటూనే వున్నాను.

మరునాడు హైమవతి ముందు నా ఉబలాట మంతామంతా మళ్ళీ వెళ్ళబోసుకున్నాను. ఆమె వెళ్ళి భర్తతో మాట్లాడింది

"నేపోయి సర్కస్ మేనేజరుతో మాట్లాడివస్తాను సునీతంటే మనిద్దరికీ పంచ ప్రాణాలు ఎలాగైనా ఆ అమ్మాయి కోరిక తీరేటట్లుగానే చేస్తానుగా" అని కృష్ణమూర్తి బయటకు వెళ్ళిపోయాడు.

రెండు మూడు గంటలుపోయాక, తిరిగివచ్చి "మేనేజర్‌తో మాట్లాడి వచ్చాను. తప్పకుండా సాయం చేస్తానన్నాడు. రేపు సాయంత్రం తీసుకురమ్మన్నాడు" అని చెప్పాడు

ఇహ నా మనసు మనసులో లేదు రోజూ ఓ గంటసేపు పుస్తకాలు పట్టుకునే దాన్ని ఆ పూట చదువుమీదను ధ్యాసపోలేదు మరునాడు స్కూల్‌కి కూడా వెళ్ళలేకపోయాను.

నారాయణమ్మకు నా ప్రయత్నం గురించి చెబుదామనుకున్నాను గాని, సర్కస్ కంపెనీ వాళ్ళతో మాట్లాడి, అన్నీ సఫలీకృతమయాక చెప్పటం మంచిదని కృష్ణమూర్తి వారించటంవల్ల ఆ ఉద్దేశం మానుకున్నాను.

ఆ సాయంత్రం నారాయణమ్మ ఇంట్లో లేదు అయిదూ అయిదున్నరయేసరికి హైమవతి నా దగ్గరకొచ్చి 'పద' అన్నది.

"ఆయనేడీ?" అన్నాను.

"ఏదో పని వుండి ముందుగా వెళ్ళిపోయారు. సర్కస్ కంపెనీ దగ్గరగానీ, దారిలోగాని కలుస్తానన్నారు" అంది.

ఇద్దరం బయలుద్దేరాం.

"రిక్షాలో పోదాం" అంది.

సరేనన్నాను.

రిక్షా ఎక్కి పూర్ణానందం పేట దాటి ఏలూరు కాలవ వంతెనదాటి గాంధీనగరం దాటి గవర్నరుపేట సెంటర్‌దాకా వచ్చేసరికి వెనుకనుంచి కేక వినబడింది అది కృష్ణమూర్తి గొంతు

హైమవతి వెనక్కి తిరిగిచూసి అదిగో ఆయనిక్కడే వున్నారు అంటూ రిక్షా ఆపించింది

చేతిలో ఓ సూట్‌కేసుతో కృష్ణమూర్తి రిక్షా దగ్గరకు నడిచి వచ్చాడు ఆ సమయంలో అతని చేతిలో సూట్‌కేసు వుండవలసిన అవసరం ఏమిటో నాకు బోధపడలేదు అయినా బాగుండదని ప్రశ్నించలేదు

దిగండి కాఫీ త్రాగి వెడదాం అన్నాడు కృష్ణమూర్తి

హైమవతి నా వంక దిగమన్నట్లుచూసింది వాళ్ళతో కలిసి కాఫీ త్రాగటం ఇష్టంలేకపోయినా చేసేదిలేక క్రిందకు దిగాను

ఇద్దరం కలిసి కృష్ణమూర్తి వంక ఓ మాదిరి పెద్దదైన హోటల్లోకి వెళ్ళాం

కృష్ణమూర్తి మమ్మల్ని ఓ ఫ్యామిలీరూంలోకి తీసుకెళ్ళాడు

టిఫిన్ తెప్పించాడు వద్దంటున్నా బలవంతంగా ఆప్యాయతతో తినిపించారు

తర్వాత కాఫీ ఆర్డర్ చేశాడు

సునీతీ! నీ మొహం వాడిపోయింది వాష్‌బేసిన్ దగ్గరకెళ్ళి శుభ్రంగా

కడుక్కురా. సర్కస్ మేనేజరుకు కళకళలాడుతూ కనిపించాలి. తెలిపిందా?" అన్నాడు కృష్ణమూర్తి.

ఇవన్నీ నా కిష్టంలేదు. అయినా ప్రతిదానికీ వద్దనటం బాగుండదని, అతని మాట శిరసావహిస్తూ వాష్‌బేసిన్ దగ్గరకు వెళ్ళాను.

తిరిగి వచ్చేసరికి కాఫీ వచ్చివుంది.

కాఫీ తీసుకుంటూంటే కృష్ణమూర్తి సర్కస్ కంపెనీల గురించీ, రోజూ వాళ్ళ కయే ఖర్చు గురించీ, ఇన్ని జంతువులతో, బలగంతో, సరంజామాతో ఊళ్ళు మారేటప్పుడు వాళ్ళు పడే అవస్థగురించీ విడమర్చి చెబుతున్నాడు.

కాఫీ త్రాగటం పూర్తయాక బిల్లు చెల్లించి "ఇహ పదండి" అన్నాడు.

లేచి నిల్చున్నాను. తల తిరుగుతున్నట్లుగా అనిపించింది. అర్థంకాలేదు. హైమవతి బుజం ఆసరాగా చేసుకుని ఆమె వెంటనడిచి బయటకు వచ్చాను.

వాళ్ళు రిక్షాపిలవటం, ఆమే, నేనూ కలసి అందులో కూర్చోవటం, రిక్షా కదలటం కలలోని దృశ్యాల్లా కనబడుతున్నాయి.

ప్రాణం ఎక్కడో గాలిలోకి తేలిపోతున్నట్లూ, శరీరం తేలికయిపోతున్నట్లూ మైకం ఆవహిస్తున్నట్లూ ఎలాగో వుంది. ఏదో అడగాలని అనిపిస్తోందిగాని నాలిక స్వాధీనంలోకి రావటంలేదు. రిక్షా కదుల్తోన్నట్లు తెలుస్తోంది గానీ, వున్నచోటనే నేలకి ఎత్తుగా చక్రాలు భూమికి అంటుకుండా ముందుకు పోకుండా అక్కడనే స్థిరంగా తిరుగుతున్నట్లు చెడురుగా భావాలు!

హైమవతి వళ్ళో తలవాల్చి పడుకున్నాను.

పూర్తిగా తెలివి తప్పలేదుగాని, నా స్వాధీనంలో నేను లేను. "లే" అని వాళ్ళు అంటే ఎక్కడో దూర లోకాలనుండి శాసించినట్లు వినబడి, వాళ్ళు చెప్పినట్లు పాటిస్తున్నాను. అంతకు మినహా స్పష్టంగా ఏమీ తెలియటం లేదు.

కొంతసేపటికి, వాళ్ళెక్కడికో తీసుకెళ్ళినట్లూ, కాసేపు కూర్చోబెట్టినట్లూ, మళ్ళీ లేవదీసి, ఎందులోనో కూలవేసినట్లూ తెలుస్తోంది. ఆ వాహనమేదో కదుస్తోంది.

ప్రయత్నించగా, ప్రయత్నించగా నాలిక కొంచెం స్వాధీనంలోకి వచ్చింది. "మనం....ఎక్కడకు పోతున్నాం ...?" అన్నాను.

"సర్కస్ కంపెనీకి."

"ఇంకా....ఎంత దూరం ...?"

"కాసేపట్లో వెళ్ళిపోతాం. కళ్ళు మూసుకుని పడుకో."

ఆ గొంతు ఆజ్ఞ పాటిస్తూన్నట్లు కళ్ళు మూసుకుని పడుకున్నాను. కొంచెం సేపట్లో పూర్తిగా మైకం క్రమ్మేసింది. [సశేషం]

సినిమా

పబ్లిసిటీ ప్రయోగాలు!

చిత్ర నిర్మాణంలో ప్రచార విభాగం ఒక ప్రధానమైన పాత్ర వహిస్తుంది. ఎంత బాగా చిత్రీకరించిన చిత్రమై సరైనరీతిలో ప్రచారం జరగకపోతే, ఆ చిత్రం ప్రేక్షకులనుంచి అవసరమైనంత అభిమానాన్ని పొందలేక పోయే ప్రమాదం వుంది. అలా అని చిత్రంలో లేని ఆకర్షణలు కూడా ఉన్నట్లుగా, చిత్రం స్థాయికి మించి ఎన్నోరెట్లు ఎక్కువ స్థాయిలో యీ చిత్రం ఉంటుందీ అన్న పద్ధతిలో ప్రచారంచేసినా అదీ చిత్రం చూసిన ప్రేక్షకుడికి నిరుత్సాహం కలగజేయొచ్చు. ఈ విషయం బాగా తెలిసిన నిర్మాతల్లో క్రాంతికుమార్ ఒకరు. ఆయన నిర్మించిన చిత్రాలన్నిటినీ గమనిస్తే ఈ విషయం స్పష్టంగా బోధపడుతుంది. చిత్రం నిర్మించే తపస్సునుండీ పూర్తిగా బయటపడకముందే, శ్రీ అన్నపూర్ణా సినీ ఎంటర్‌ప్రైజెస్ పబ్లిసిటీ విభాగం, ఆయా చిత్రాల పబ్లిసిటీ ఎలా ఉండాలో రీసెర్చి మొదలుపెడుతుంది. చిత్రం స్థాయికి తగ్గకుండా, చిత్రంపై అనవసరపు భ్రమలు పెంచకుండా చిత్రం గురించి ప్రేక్షకులకు వివరిస్తుంది క్రాంతికుమార్, కె. రాఘవేంద్రరావు దర్శకత్వంలో మురళీ మోహన్ జయచిత్రలతో నిర్మించిన చిత్రం కల్పన కు ప్రచారానికి కావలసిన




'ఈతరం మనిషి'లో [illegible]

డిజైన్లు, కల్పన జరుగుతోందిప్పుడు. త్వరలోనే ఆ అందమైన పోస్టర్లు, పత్రికలలో డిజైన్లూ ఆపైన చక్కనైన 'కల్పన' చిత్రమూ మీరు చూడొచ్చు.

డి. ఎమ్. ప్రత్యేకత!

అన్నపూర్ణా సంస్థ నిర్మించే చిత్రాలెంత ప్రత్యేకంగా నీట్‌గా వుంటాయో, ఆ సంస్థ అధిపతి డి. మధుసూధనరావు నిర్వహించే పత్రికా ప్రతినిధుల సమావేశాలు అంత ప్రత్యేకంగానూ, పకడ్బందీగానూ ఉంటాయి. అనవసర కాలయాపనలుండవు. ఆరుగంటలకు కాన్ఫరెన్సంటే అంతకు ఓ పావుగంట ముందుగానే అన్ని ఏర్పాట్లూ చేసి తానూ సిద్ధంగా ఉంటారు డి ఎమ్. సమావేశం జరిగిన గంటో గంటన్నరో



'చక్రధారి'లో నాగేశ్వరరావు, వాణిశ్రీ

కేవలం తన చిత్రం గురించి, తన సంస్థ గురించిన విషయాలేగాక — చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధికి తీసుకోవలసిన చర్యల గురించి జర్నలిస్టులతో ఇష్టాగోష్టి జరపడం మరువని నిర్మాత ఈయన ఒకరి అభిప్రాయాలు ఒకరు తెలుసుకొని ఉపయోగకరమైన చర్యలపై పరిశ్రమ అందరం అడుగేయడం మంచిదని నమ్మే ఈ నిర్మాత నిర్మించిన ప్రేమలేఖలు చిత్రం పూర్తి అయిన సందర్భంగా మద్రాసు ప్రెస్‌ని కలిశారు 1976 ... రోజున కె రాఘవేంద్రరావు దర్శకత్వంలో తయారైన ఈ చిత్రంలో మురళీమోహన్ జయసుధలతో పాటు అనంత్‌నాగ్ (అంకుర్ ఫేం) దీప కూడా ప్రధానమైన పాత్రలలో కన్పిస్తారు

కొత్త దర్శకులు

తెలుగు ప్రేక్షకుల ముందుకు ఇటీవల ఎంతో మంది కొత్త దర్శకులు వస్తున్నారు తమ చిత్రాలతో జరుగుతున్న కథ చిత్రం ద్వారా జి శేషగిరి విడుదలైన సంసారంలో సరిగమలు చిత్రం ద్వారా ఎం ఎస్ కోటారెడ్డి మనిషి రోడ్డున పడ్డాడు చిత్రం ద్వారా ... వి రమణ దర్శకుల జాబితాలో చేరారు ఇప్పుడు నిర్మాణంలో ఉన్న ఒక చిత్రం ద్వారా యు ఎస్ వి ... నిర్మాణం ప్రారంభం కాబోతున్న జనప్రియా కంబైన్స్ చి...ం ద్వారా కె వి రావు పూర్తి అయిన రా... నాయుడు చిత్రం సావాసగాళ్ళు ద్వా... బోయిన సుబ్బారావు అనిల్ ప్రొడక్షన్

జో॰

ఈతరం మనిషి ఈ నెలలోనే'

జ్యోతీ సీరియల్ మిస్టర్ సంపత్—ఈతరం మనిషిగా చిత్రరూపం దాల్చిందని మీకు తెలుసు ఆ రంగులచిత్రం వి మధుసూధనరావు దర్శకత్వంతో ఎస్ వెంకటరత్నం ఫోటోగ్రఫీతో జనవరిలో విడుదలవుతోంది శోభన్‌బాబు లక్ష్మి జయప్రద గుమ్మడి రావుగోపాలరావు పద్మనాభం రాజబాబు అల్లు రామలింగయ్య, అంజలీదేవి హలం ప్రధాన పాత్రలలో కన్పిస్తారు నిర్మాతలు ఎస్ వెంకటరత్నం కె రవీంద్రనాథ్

తెలుగు చిత్రంలో శివాజీ'

తమిళనటుడు శివాజీగణేశన్ తెలుగు వారికి చిరపరిచితుడు శివాజీ చిత్రాల్ను తెలుగులోకి డబ్‌చేయబడి యాభై రోజులకు పైబడి ప్రదర్శించబడిన సందర్భాలెన్నో ఉన్నాయ్ ఇప్పుడు శివాజీ ఒక

'గీత-సంగీత'లో కృష్ణంరాజు





'బంగారక్క'లో శ్రీదేవి

తెలుగు చిత్రంలో ఒక ప్రధాన పాత్రలో కన్పిస్తారు మారుతీ కంబైన్స్ వర్ణ చిత్రంలో కృష్ణంరాజు వాణిశ్రీ జయసుధ జగ్గయ్య మరియు ప్రత్యేకాకర్షణగా శివాజీ గణేశన్ ముఖ్య పాత్రలలో కన్పిస్తున్న ఈ చిత్రం ద్వారా జి పి శేఖర్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు నిర్మాత ఎ గోపాలకృష్ణ

పి యస్ ఆర్ పిక్చర్స్ మరో పౌరాణికం'

నిర్మాత ఎంజల సుబ్బారావు తమ ఎ యస్ ఆర్ పిక్చర్ పతాకం క్రింద బాపు దర్శకత్వంలో మనోహర దృశ్య కావ్యంగా ప్రేక్షకుల కందించిన సీతా


పౌరాణికం మొదలుపెట్టారు రంగుల్లో వైభవంగా నిర్మితమైన యీ చిత్రం సీతా రామ వనవాసం కె కామేశ్వరరావు దర్శకత్వంలో జయప్రద రవి సీతా రాములుగా కన్పిస్తారు సత్యనారాయణ శ్రీధర్ గుమ్మడి అంజలి ఝాన్సీ విజయలలిత బి సరోజాదేవి మొదలైన వారు నటించిన ఈ చిత్రం కె వి మహదేవన్ సంగీతంతో తయారౌతోంది

ముత్యాలపల్లకి'

ఓ అందాలజంట అనురాగజలరాశిలో ఓలలాడాలనుకొన్నది జలరాశిలోని ముత్యాలను ఎరుకొని పెండ్లినాటి ఊరేగింపులో పల్లకికి అమర్చి ఆ ముత్యాల పల్లకిలో ఊరేగాలనుకొన్నది మల్లెమాల సుందర సాహితీ మధుర గీతికలను రాగ భావయుక్తంగా మనసారా పాడుకొన్నది ఆ జంట కౌముదీవారి 'ముత్యాలపల్లకి'లో కన్పిస్తారు మీకు బి వి ప్రసాద్ దర్శకత్వం సత్యం సంగీతం సమకూర్చిన ఈ చిత్రంలో జగ్గయ్య నారాయణరావు చక్రపాణి రాజబాబు జయసుధ రోజా రమణి ప్రభ రమాప్రభ మమత మొదలైనవారు నటించారు నిర్మాత ఎం ఎస్ రెడ్డి అతి త్వరలో విడుదల కాబోతున్న చిత్రమిది

జయలలితను చూడొచ్చు'

యువతరం ప్రేక్షకులకు గిలిగింతలు



మద్రాసు 'ఫిలిం ప్రెస్ క్లబ్' సభ్యులతో ఆంధ్రప్రదేశ్ ఆర్థికమంత్రి శ్రీ పి రంగా రెడ్డి, సమాచారశాఖ డైరక్టర్ శ్రీమతి

శ్రీ రాజం సినా



'నన్ను ప్రేమించు'లో జగదీష్ బాబు, శుభ

రచయిత సి. యస్. రావు (డైరెక్టరుగారు) 'ఊరుమ్మడి బ్రతుకులు' కథానిక రాశారు చాలాకాలం క్రితం. తర్వాత అదే కథను నాటికగా మలచి విజయవంతంగా ప్రదర్శించారు కూడా. ఇప్పుడు 'ఊరుమ్మడి బ్రతుకులు' చిత్రంగా తయారైందీ కథ, బి. ఎస్. నారాయణ దర్శకత్వంలో. రంగుల్లో తయారైన చిత్రంలో సత్యేంద్రకుమార్, మాధవి






'ప్రేమలేఖలు'లో మురళీమోహన్, జయసుధ, ఆనంత్ నాగ్

ట్టే గ్లామర్ స్టార్‌గానే కాకుండా, నటిగా ాడా తన శక్తి నిరూపించుకున్న తార యలలిత. గత రెండు మూడు సంవత్స ాలుగా జయలలిత తెలుగు చిత్రాల్లో న్పించడంలేదు. ఇప్పుడు శరవణభవ ఆర్ట్ ప్రొడక్షన్స్ సమర్పిస్తున్న 'బంధాలు-ంధుత్వాలు' చిత్రంద్వారా చూడొచ్చు. వాజీ (జగ్గయ్య కంఠంతో) నటించిన ఈ చిత్రం రంగుల్లో తయారైంది

మళ్ళీ ఎప్పుడో ఎక్కడో,

తెలుగులో అపరాధ పరిశోధన నవలా చయితగానే గాక హృదయం కదిలించే ాంఘిక నవలా రచయితగా కూడా వినుతి కెక్కి పాఠకాభిమానం పొందిన కొమ్మూరి సాంబశివరావు ఇప్పుడు ప్రేక్షకాభిమానం పొందే ప్రయత్నంలో ఉన్నారిప్పుడు. తన నవల "మళ్ళీ ఎప్పుడో ఎక్కడో"ను అదే పేరుతో జయంతి కథానాయికగా, ఇతర పాత్రలలో నూతన నటీనటులను పరిచయం చేస్తూ చలన చిత్రంగా నిర్మించాడీ రచయిత. దర్శకుడు గురుదేవ్-చిత్రంలో ఉన్న పాటలన్నిటినీ మహాకవి శ్రీశ్రీ రాశారు చిత్రీకరణ పూర్తిఅయిన ఈ చిత్రం త్వరలోనే మీ ముందుకు వస్తుంది ఈ చిత్ర విశేషాలను వివరించేందుకు ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో చిత్రంలో పాటలు వినిపించారు నిర్మాత

—యస్వీనారాయణ



Edited and Published by V Leelavathy Raghavaiah 40/1 Moosa sait Street Madras 600 017 and Printed by D Hanumantha Rao, at Kranti Press 12 Francis Joseph Street Madras 600 001

జ్యోతి వ్యవస్థాపకులు

కీ॥ శే॥ ఎ. వి. రాఘవయ్యగారికి

స్మృత్యంజలి




1928-1971

మీ కార్యదీక్షా, క్రమశిక్షణా, సహృదయతా
మాకు ఆశీస్సులై నిలుస్తుండగా
మీరు స్థాపించిన యీ సాహితీ జ్యోతిని
వెలిగిస్తూ ముందుకు సాగుతున్నాము.
మీరు మాకు దూరమైన క్షణాన్ని కసితీరా తిట్టుకొంటూ
మీ జ్ఞాపకాల్ని మననం చేసుకొంటూ
మీకు మా స్మృత్యంజలి ఘటిస్తున్నాము.

—స్టాఫ్ మెంబర్లు, జ్యోతి

REGD: No.M8669





జ్యోతి